
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం


ప్రజలే ప్రభువులు

జనవరి 2021 రూ.10/-




## 2021-30 దశాబ్దమే యువ భారతానికి 'కీ'

## సమగ్ర సాగు సంస్కరణల రోడ్‌మ్యాప్‌ని ప్రకటించాలి: జేపీ





## కొవిడ్ మహమ్మారి.. కీలక పాఠాలు


INDIAN DEMOCRACY AT WORK

**Rule of Law**

Second edition of Indian Democracy at Work Annual conference

Top Judges, Advocates, Academicians and Civil Society Groups will discuss:

1) Measures to address the challenges of modern policing


2) Framework to address procedural complexities in administration of justice

3) Roadmap for a clear, non-partisan, fair and speedy civil and criminal justice system

Join us on 20th-28th February 2021

Register at www.idaw.in

FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS | ISB Bharti Institute of Public Policy | हैदराबाद विश्वविद्यालय University of Hyderabad


INDIAN DEMOCRACY AT WORK
HOW SLOW IS THE JUSTICE DELIVERY SYSTEM IN INDIA?
9.46 MILLION CIVIL CASES AND
25 MILLION CRIMINAL CASES ARE PENDING
IN SUBORDINATE COURTS
70% OF THE PRISONERS ARE
UNDER-TRIALS
THE CONVICTION RATE IS AS LOW AS 50.4%
FOR IPC CRIMES

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 24 సంచిక 01
జనవరి 2021

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## కార్టూన్ కార్నర్



ఇప్పుడు.. మీ బీపీ
పూర్తి నార్మల్‌కు వచ్చేసింది!


కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# అమెరికా పరిణామాలు..
# భారత్‌కు ప్రజాస్వామ్య పాఠాలు

అమెరికన్ ప్రజాస్వామ్యం గత 200 ఏళ్లుగా ప్రపంచ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేసింది. తొలి రిపబ్లిక్, తొలి లిఖిత రాజ్యాంగ దేశం అమెరికా. ఎన్నికల ద్వారా శాంతియుతంగా అధికార మార్పిడిని మొట్టమొదటగా ప్రపంచానికి నేర్పింది అమెరికాయే. 1800 సంవత్సరంలో థామస్ జఫర్సన్ చేతిలో జాన్ ఆడమ్స్ ఓటమి చాలామందికి దిగ్భ్రాంతిని కలిగించినా, హుందాగా ఆయన తన అధికారాన్ని అప్పగించారు. తొలి ఫెడరల్ వ్యవస్థ అమెరికాలోనే నిర్మాణమైంది. తొలిసారిగా కార్యనిర్వాహక వ్యవస్థ, చట్టసభలు, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజన జరిగింది అమెరికాలోనే. ఇలా ఎన్నో ఒరవడులకు శ్రీకారం చుట్టిన అమెరికాలో, అంత సంపద, అంత సంస్థాగత బలం ఉన్నా కూడా ప్రజాస్వామ్యం ఇంతటి సంక్షోభాన్ని తాత్కాలికంగా అయినా ఎదుర్కోవటం చూస్తే.. ప్రజాస్వామ్యం ఎంత సంక్లిష్ట వ్యవస్థో అర్థమవుతుంది.

ఒక్క వ్యక్తి వాగాడంబరత, ఉన్మాదం సామాన్య జనాన్ని భ్రమల్లోకి నెట్టేసింది. స్వీయారాధన (నార్సిసిజం), అహంభావం మూర్తీభవించిన ఆ వ్యక్తి.. వాళ్లను వశం చేసుకునేందుకు అసత్యాల్ని, అభూతకల్పనల్ని విరివిగా ప్రచారం చేశాడు. ఆదర్శం, నమత్ర, ఇతరుల అభిప్రాయాల పట్ల గౌరవం వీటి అర్థం మచ్చుకైనా తెలియనివాడు, నియంతృత్వ లక్షణాలు కలవాడు.. ఒక బలమైన వ్యవస్థను ఎలా తేలిగ్గా లొంగదీయగలడో, ప్రమాదంలోకి నెట్టగలడో అమెరికా అనుభవం హెచ్చరిస్తోంది. అదే సమయంలో ప్రభావాలకు లొంగకుండా, నిష్పాక్షికంగా, వేగంగా స్పందించిన న్యాయవ్యవస్థ .. పార్టీలకి, పక్షపాతాలకు లొంగకుండా నిజాయతీగా ఎన్నికలు నిర్వహించి, ఫలితాల్ని ప్రకటించిన వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు .. ఆలస్యంగానైనా మేలుకొని రాష్ట్రపతి చర్యల్ని అరికట్టిన అక్కడి కాంగ్రెస్ (చట్టసభలు) ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛాయుత ఎన్నికల వ్యవస్థని కాపాడాయి.

అయితే అంతమాత్రం చేత ఒక్క వ్యక్తి మాత్రమే అమెరికన్ ప్రజాస్వామ్యం, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకి మూలకారణం అని భావించటం లేదా ఇంతటితో ప్రజాస్వామ్య వ్యవస్థలకు ముప్పు తప్పిందని భావించటం పొరపాటవుతుంది. ఈ సంక్షోభం మూలాలు అమెరికా సమాజం, ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మార్పుల్లో ఉన్నాయి. ఓ వంక పెద్దగా చదువు, ఆలోచన లేని ఒక వర్గం శ్వేతజాతీయులు తమ పూర్వీకులు నిర్మించిన దేశం మీద తమ ఆధిపత్యం పోతుందని కసితో రగిలిపోతున్నారు. ఒకటి రెండు దశాబ్దాల కాలంలో ఆంగ్లో శాక్సన్ మూలాల నుంచి వచ్చిన తెల్లజాతి ప్రొటెస్టంట్ క్రైస్తవుల (WASP) మెజారిటీ పోయి మిగతా వర్గాలు అమెరికన్ సమాజంలో 50 శాతం జనాభాని దాటతాయి. దాన్ని సహించలేక.. కొన్ని దశాబ్దాలుగా చెదురుమదురుగా జాత్యహంకార బృందాలు, సంకుచితవాదులు, తమ సమాజాన్ని నాశనం చేయటానికి రహస్య కుట్రలు చేస్తున్నారని నమ్మేవారు (కాన్స్పిరసీ థియరిస్ట్స్) వీరంతా గణనీయ సంఖ్యలో కలిసి తమ సొంత ప్రయోజనాలు విస్మరించి, ఉన్మాదానికి, ఆగ్రహావేశాలకి లోనై సమాజాన్ని అల్లకల్లోలం చేయటానికి సిద్ధంగా ఉన్నారు. రెండవది, శరవేగంగా మారుతున్న సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక వ్యవస్థల వల్ల పెద్దగా నైపుణ్యాలు లేని అల్ప, మధ్యస్థాయి ఆదాయ వర్గాల్లో అభద్రత ఉంది. అత్యంత సంపన్న దేశం అమెరికాలోని ఈ దిగువ వర్గాలు తమ తల్లిదండ్రుల తరంలో కంటే, తమ తరంలో ఆదాయాలు తక్కువగా ఉంటాయని

## సంపాదకీయం

భయాందోళనలతో తల్లిడిల్లుతున్నారు. ఈ రెంటినీ ఒడుపుగా, సమర్థంగా ఎదుర్కొని ఈ వర్గాలని రాజ్యాంగ విలువలతో కూడిన రాజకీయ స్రవంతిలోకి తీసుకురావటం, వాళ్ల శక్తిని, ఆలోచనల్ని, నిర్మాణాత్మకంగా మలచి, శాంతియుత మార్పుని తీసుకురావటం అమెరికన్ సమాజం ముందున్న దీర్ఘకాలిక సవాలు. దాంతోపాటు ఈ వర్గాలు, రిపబ్లికన్ పార్టీకి పునాదిగా ఉన్నారు. వీళ్ల అండ లేకుండా ఆ పార్టీలో రాజకీయంగా ఎదగటం చాలా కష్టమనే దశకి అమెరికాలోని చాలా రాష్ట్రాల్లో రిపబ్లికన్ పార్టీ చేరుకుంది. డొనాల్డ్ ట్రంప్‌కి ఈ వర్గాల్లో ఉన్న పట్టు కారణంగా అతడి దుందుడుకు చర్యల్ని, నియంతృత్వ పోకడల్ని, అధికార దుర్వినియోగాన్ని, ఇప్పటి ఆ పార్టీ నాయకులు, ఆ పార్టీ చేతుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, చట్టసభల సభ్యులు నివారించే సాహసం చేయాలేదు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా చేయిదాటి పోయే దశ వచ్చాకే రిపబ్లికన్ నాయకులు అధ్యక్షుడి దుందుడుకు చర్యల్ని ఎదుర్కొనేందుకు సిద్ధపడ్డారు. ఈ అనుభవం నుంచి భారతదేశం చాలా పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది.

ఎంతో పరిణతి చెందిన దేశమైనా, శతాబ్దాల చరిత్ర ఉన్నా, అణువణువునా ప్రజాస్వామ్య సంస్కృతి ఉన్నా అమెరికన్ సమాజంలో ప్రజాస్వామ్యానికి సవాళ్లు ఎదురైతే.. మనలాంటి సమాజంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం ఎంత కష్టమో అర్థమవుతుంది. ప్రజాస్వామ్యం ఒక సుకుమారమైన మొక్కలాంటిది. దాన్ని నిరంతరం కాపాడుకోవటం కోసం అన్ని వర్గాలూ చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలి. కేవలం అట్టహాసంగా ఎన్నికలు జరుపుకోవటం, ఆ తర్వాత నిరంతరం నిరసనలు, రాస్తారోకోలు, బంద్‌లు, అరుపుల ద్వారా మన కోపాన్ని వెళ్లగక్కటం- ఈ రెండు ప్రక్రియలతో నిజమయిన ప్రజాస్వామ్యం నడవదు. ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవాలన్నా, ప్రజలకు అర్థవంతమైన ఫలితాల్ని ఇవ్వాలన్నా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ, స్వతంత్రంగా, నిష్పాక్షికంగా వ్యవహరించే రాజ్యాంగ సంస్థలు, రాజ్యాంగ విలువలకు కట్టుబడిన బలమైన న్యాయవ్యవస్థ, వాస్తవాలు, తర్కం, ఆధారాలుగా నడిచే మంచి ప్రమాణాలుగల బహిరంగ చర్చ- ఇవన్నీ అవసరం. అలాగే ఏదోకరకంగా అధికారాన్ని చేజిక్కించుకోవటమే లక్ష్యంగా పెత్తందారీ స్వభావంతో మధ్యయుగాల సంస్కృతిలోకి సమాజాన్ని నెట్టే నాయకత్వం ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదం. దూరదృష్టి, హేతుబద్ధ ఆలోచనలు, అన్ని వర్గాలనీ కలుపుకుపోయే తత్వం, మౌలిక రాజ్యాంగ విలువలకి కట్టుబడుతూనే ఐకమత్యం కోసం రాజీపడే ధోరణి, సమాజానికి తమ ఉమ్మడి ప్రయోజనాల్ని విడమర్చి చెప్పే సామర్థ్యం, ఆదర్శాల్ని ఆచరణలో చూపగల నైతికత ఉన్న నాయకత్వం అవసరం. అమెరికన్ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్ల నుంచి మన సమాజం, రాజకీయ వ్యవస్థ, మన పత్రికలు, జనమాధ్యమాలు ఆత్మవిమర్శ చేసుకోవటం అవసరం.

మన జాతి నిర్మాతల పుణ్యమా అని అక్షరజ్ఞానంలేని ఒక నిరుపేద సమాజంలో అన్ని కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషల్ని ఏకం చేసే ప్రజాస్వామ్య వ్యవస్థను మనం ఏర్పరచుకున్నాం. ఎన్ని ప్రతికూల పరిస్థితులున్నా, ఎన్నికల వ్యవస్థలో స్వేచ్ఛని కాపాడుకున్నాం. కానీ మన ప్రజాస్వామ్య పునాదులు ఇంకా బలహీనంగానే ఉన్నాయి. అధికార కేంద్రీకరణ, వ్యక్తిస్వామ్యాలతో నడిచే పార్టీలు, బలహీనమైన రాజ్యాంగ వ్యవస్థలు, అధికారం చుట్టూ తిరిగే నేరన్యాయవ్యవస్థ, డబ్బు పంపిణీలతోనో, తాత్కాలిక తాయిలాలతోనో, విభేదాలను రెచ్చగొట్టటంతోనో ప్రజలను వశం చేసుకుని ఓట్లు వేయించుకునే ఎన్నికల వ్యవస్థ ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్నాయి. దేశ ప్రగతికి, పేదరిక నిర్మూలనకి అడ్డుగోడలుగా నిలుస్తున్నాయి. అడ్డుగోడల్ని ఛేదించి పునాదులుసహా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటం మన ముందున్న చారిత్రక అవసరం.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

# 2021-30 దశాబ్దమే యువభారతానికి 'కీ'

భారతదేశం ఎప్పటికి సూపర్ పవర్ అవుతుంది? నా చిన్నప్పటి నుంచి మనది అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంది తప్ప, అభివృద్ధి చెందిన దేశం కాలేదు.. అని ఇప్పటికీ వింటుంటాం. కొందరు భారతీయులు అమెరికా వంటి సంపన్న దేశాల్లో సాధిస్తున్న విజయాలు.. జనాభా రీత్యా మనకున్న మార్కెట్ శక్తి.. కుటుంబం, మధ్యేమార్గం వంటి అంశాలపరంగా మన సమాజానికున్న అంతర్గత శక్తి లాంటి సానుకూలతల్ని చూసి భారత్ దానంతటదే అభివృద్ధి చెందిన దేశంగా మారిపోతుందన్న భావన నేటి యువతరంలో అనేకులు భావిస్తూండవచ్చు. కానీ వాటితోనూ, సోషల్ మీడియాలో దేశభక్తిని రంగురంగుల బొమ్మలతో, పాటలతో చాటుకోవటం, సైనికులకు సిన్సియర్‌గా వందనాలర్పించటం వంటి కార్యక్రమాలతోనూ ఇండియా అభివృద్ధి చెందిన దేశంగా మారిపోదు. భారత్‌ను సూపర్ పవర్‌గా మారుస్తామని హామీ ఇచ్చి పోటీ చేస్తున్న వాళ్లని వరుసగా గెలిపిస్తున్నా, దేశం మాత్రం అడుగులో అడుగు వేసుకుంటూ తప్ప తనకున్న సామర్థ్యం మేర ఎందుకు ఎదగలేకపోతోంది అన్న ప్రశ్నను మనం ఎందుకు లోతుగా వేసుకోలేకపోతున్నాం? భారత్ సూపర్ పవర్ కావాలనే మనందరం ఓట్లు వేస్తున్నాం.. కానీ ఏళ్లు గడుస్తున్నా, నేతలు ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీల్ని ఏదోకరకంగా అమలు చేస్తున్నా అది జరగటం లేదు. ఎందుకని?.. ఈ ప్రశ్న ఇతరులను అడగటం మాత్రమే కాదు.. మనకి మనం ఎవరికి వారుగా ప్రశ్నించుకోవాలి.. అప్పుడు మాత్రమే సరైన సమాధానం లభించి, ముఖ్యంగా యువత పరిష్కారంలో భాగం కాగలుగుతారు. ఎందుకంటే, రాబోయే కాలంలో అత్యధిక శాతం పెద్దలది కాదు.. యువతదే.

ఇటీవల లాన్సెట్ జర్నల్‌లో యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ శాస్త్రవేత్తల అధ్యయనమొకటి ప్రచురితమైంది. అందులో మన జనాభా గురించి కొన్ని వివరాలతోపాటు ఓ హెచ్చరిక కూడా దాగి ఉంది. భారతదేశ జనాభా 2048 నాటికి గరిష్ఠస్థాయికి చేరే అవకాశముంది. అప్పటికి సుమారు 160 కోట్లకు చేరుతుంది. కానీ ఆ తర్వాత క్రమంగా తగ్గుతుంది. ఈ శతాబ్ది రెండో భాగంలో భారత్ జనాభా గణనీయంగా తగ్గిపోతుందని ఆ అధ్యయనం తెలిపింది. క్రమంగా తగ్గుతూ.. 2048తో పోలిస్తే 2100 నాటికి దేశ జనాభా 32 శాతం తగ్గి 109 కోట్లకే పరిమితమవుతుంది. దీనర్థం యువత, పనిచేసే వయసున్నవారి సంఖ్య తగ్గుతుందని. 2100 నాటికి కాస్త అటూఇటుగా దేశ జనాభాలో సగం మంది




మాత్రమే పనిచేసే వయసు (20-64 సంవత్సరాల మధ్య)లో ఉన్నవారుగా ఉంటారని అంచనా.

2100 దాకా అంటే ఇంకో 80 ఏళ్లు ఉందని భరోసా పడితే భారత్‌కు తేరుకోలేని దెబ్బవుతుంది. కచ్చితంగా భారత్ చేతిలో ఉన్న అత్యంత విలువైన సమయం ప్రధానంగా 2048 దాకా.. అంటే మరో 28 ఏళ్లు మాత్రమే. భారతదేశ స్వాతంత్ర్య శతవసంత వేడుకల సంవత్సరం దాకా అంటే గుర్తుపెట్టుకోవటం తేలికేమో. ఈ వ్యవధిలో మనకు అత్యధిక సంఖ్యలో యువత అందుబాటులో ఉంటారు. ఆ తర్వాత నుంచి క్రమంగా యువత పెద్దవారవుతూ, కొత్తగా వచ్చేవారి సంఖ్య తగ్గుతూ ఉంటుంది. కొన్ని ఆఫ్రికా దేశాలు మినహా మిగతా దేశాలదీ ఇదే పరిస్థితి. అయితే మనం సూపర్ పవర్ లక్ష్యంతో పోల్చుకుంటున్న దేశాలను తీసుకుంటే అవన్నీ అభివృద్ధి చెందిన దేశాలు. మన సమస్యతో పోలిస్తే వాటి సమస్య తక్కువ. మనకు అవకాశాలు ఎక్కువుండీ ఎక్కువ సమస్యను ఎదుర్కొంటుండగా, ఆ దేశాలు అవకాశాలు పరిమితంగా ఉన్నా కూడా మన కంటే తక్కువ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు మనకున్న పెద్ద అడ్వాంటేజ్ యువత. ఈ యువశక్తిని సాంకేతికత సాయంతో సద్వినియోగం చేసుకోగలిగితేనే.. మనం 2048 నాటికి ప్రపంచంలో చెప్పుకోదగిన స్థాయికి చేరుకుని ఆ తర్వాత మరో 50 ఏళ్లు కూడా దిగజారకుండా పనిచేసే సామర్థ్యాన్ని నిలబెట్టుకోగలం. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయా? అన్నదే ఇప్పుడు భారతదేశంలోని యువత ప్రశ్నించుకోవాల్సింది.

2020 సంవత్సరానికి గత ఇరవై ఏళ్లుగా ఎంతో ప్రాధాన్యం ఉంది. విజన్ ట్వంటీట్వంటీ అని పాలకులు ఆశచూపగా భారతదేశం సూపర్ పవర్ కావటానికి గడువని కొందరు 2020 ఏడాది మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొన్ని చెప్పుకోదగిన

విజయాలను సాధించినా కూడా.. కొవిడ్-19తో సంబంధం లేకుండానే ఆ గడువు నాటికి భారతదేశం సూపర్ పవర్ స్థాయికి యోజనాల దిగువనే ఉంది. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎట్లా ఎక్కుతుంది? కొనుగోలు శక్తిని బట్టి మన దేశ తలసరి ఆదాయం 2,000-2,200 డాలర్లు. మన ఆర్థిక వ్యవస్థ కాస్త ఊపందుకుని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా గుర్తింపు రావటంతో సూపర్ పవర్ హోదాకు దగ్గరగా వచ్చేశామని మనం ఎక్కువ కలలు గన్న గత దశాబ్దంలో మన తలసరి ఆదాయం కేవలం రెట్టిపైంది. 2010లో మన తలసరి ఆదాయం సుమారు 1,000 డాలర్లుంది. ఈ తలసరి ఆదాయం లెక్క కూడా పూర్తిగా వాస్తవ పరిస్థితికి అద్దం పట్టకపోయినా, ఇదో కీలకమైన ఇండికేటర్. ప్రస్తుతం మన తలసరి ఆదాయం 2,200 డాలర్లుండగా, అమెరికాది 65,000 డాలర్లుంది, చైనా తలసరి ఆదాయం 10,000 డాలర్లు దాటింది. సంక్షోభ ప్రభావం వల్ల విధిలేక 1990ల ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలతో మన తలసరి ఆదాయం ఆ మాత్రమన్నా పెరిగింది. ఆ తర్వాత ఏ ప్రభుత్వమొచ్చినా వాటిని ఏదోకస్థాయిలో కొనసాగించటం వల్ల వృద్ధి పెరుగుతూ 2010-11 నాటికి వేగాన్ని సంతరించుకుంది. కానీ ఆ వృద్ధిని సుస్థిరపరిచే ముందుచూపు మొదట్నుంచీ కొరవడటం వల్ల క్రమంగా దుష్ప్రభావాలు మొదలయ్యాయి. దీనికితోడు నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాల్ని అసమగ్రంగా, అసమర్థంగా అమలు చేయటం వల్ల వృద్ధి రేటు ఇంకా కుంగింది. వృద్ధి రేటును వేగంగా పెంచటంతోపాటు సుస్థిర పరిచేందుకు ఏయే రంగాలను వృద్ధి పరుస్తూ ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తేవాలన్న ప్రణాళిక, పాలనా, రాజకీయ సంస్కరణలు కొరవడ్డాయి.

వ్యవసాయం నుంచి జాతీయాదాయానికి సమకూరే వాటా 15 శాతం కంటే తక్కువే ఉంటోంది. కానీ ఆ రంగం మీదే ఇప్పటికీ జనాభాలో 40-50 శాతం దాకా ఆధారపడి ఉన్నారు. వ్యవసాయం నుంచి వ్యవసాయేతర రంగాలకు వేగంగా మళ్లుతున్న వారి సంఖ్య భారత్‌లో ఎక్కువగానే ఉన్నప్పటికీ వారికి సరైన ఆదాయమంటూ సమకూరటం లేదు. గతిలేని పరిస్థితుల్లో పొట్ట చేత పట్టుకుని గ్రామాల నుంచి పట్టణాలకు వలస పోతున్నారు. వీరిలో ఎక్కువమందికి ఎటువంటి వృత్తి నైపుణ్యమూ ఉండటం లేదు. రియల్ ఎస్టేట్, హోటళ్లు వంటి రంగాల్లో తక్కువ స్థాయి నైపుణ్యం అవసరమైన పనుల్లో కుదురుకుంటూ ఆదాయం పొందుతున్నారు. వీరికి వృత్తి నైపుణ్యాలతోపాటు ప్రపంచంతో సంధానంకాగల సామర్థ్యాన్ని అందించే నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చి, ఉపాధినిచ్చేలా పారిశ్రామిక ఉత్పత్తి రంగాన్ని నిర్మించి ఉంటే వృద్ధి రేటు సుస్థిరంగా ఉండేది. తలసరి ఆదాయాలు ఎప్పటికప్పుడు గణనీయంగా పెరుగుతూండేవి. అలాగే రైతులకు మార్కెట్‌లో అమ్ముకునే స్వేచ్ఛ ఇవ్వకుండా ఆంక్షలతో కుంగదీస్తూ, ఆహారభద్రత పేరుతో వరి, గోధుమలను కుళ్లబెడుతూ వ్యవసాయ రంగాన్ని అణగదొక్కకుండా, డిమాండ్‌కు తగ్గ పప్పులు, వంటనూనెల పంటలపై దిగుమతి సుంకాల్ని, రైతులకు ప్రోత్సాహకాల్ని ఇస్తూ వ్యవసాయానికి స్వేచ్ఛా మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చి ఉంటే రైతులకు ఆదాయంతోపాటు దేశ ప్రజలకు పౌష్టికాహార భద్రత లభించి ఉండేది. ఈరోజు మన దేశానికి కావలసింది ఆహార భద్రత కాదు, పౌష్టికాహార భద్రత. శీతల గిడ్డంగులు, రోడ్లు సహా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల్ని నిర్మించి, భూమి హక్కుల్లో సంక్లిష్టతలు లేకుండా చేసి, రిటైల్ చెయిన్లను తెచ్చి, చిన్న పట్టణాలను వ్యవసాయాధారిత పరిశ్రమలతో ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, నిలకడైన ఎగుమతుల విధానాన్ని అమలు చేసి ఉంటే రైతుకు ఇంకా ఆదాయం పెరగటంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు భారీగా పెరిగి ఉండేవి.

జేబులో నుంచి ఖర్చు లేకుండా అందరికీ నాణ్యమైన వైద్యాన్ని ప్రాథమిక స్థాయి నుంచి అందించే ఏర్పాటు చేసి ఉంటే, కోట్లాది ప్రజలు పేదరికం నుంచి శాశ్వతంగా బైటపడగలిగేవారు. ప్రజల ఉత్పాదక శక్తి పెరగటంతోపాటు కోటికి పైగా ఉద్యోగావకాశాలు లభించేవి. విద్యను మొక్కుబడిగా అందించటం కాకుండా విద్యాప్రమాణాల్ని పెంచి ఉంటే నైపుణ్యాలు గల, ఎప్పటికప్పుడు నైపుణ్యాలను తాజా పరచుకోగల యువత పెరిగి మెరుగైన ఆదాయాలు గల ఉద్యోగావకాశాలను సొంతం చేసుకోగలిగేవారు, ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా సంపదసృష్టితో కొత్త ఉపాధి అవకాశాల్ని సృష్టించగలిగేవారు. ప్రభుత్వ సేవలు అవినీతి లేకుండా సక్రమంగా సకాలంలో ప్రజలకు అందేలా పౌర సేవల చట్టం వంటి ఏర్పాటు చేయటంతోపాటు.. ప్రజానీకానికి అందే రోజువారీ సేవలు సక్రమంగా అందేలా స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం, ప్రజలందరికీ చట్టం, న్యాయం సమానంగా వేగంగా అందుతుందనే భరోసా కల్పించి ఉంటే ప్రజల సాధికారత పెరిగేది.

ఇలా మౌలిక వసతులు, పారిశ్రామిక ఉత్పత్తి, వ్యవసాయంలో స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ, గ్రామాల చుట్టూ ఆర్థిక కేంద్రాలుగా చిన్న పట్టణాల అభివృద్ధి, అందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ కార్యాలయాల్లో నాణ్యమైన సేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చట్టబద్ధపాలన, సత్వరన్యాయం, మేయర్ నుంచి ముఖ్యమంత్రి దాకా ప్రత్యక్ష ఎన్నికలు, పన్ను సంస్కరణలపై దృష్టి పెడితే, ఆర్థిక వ్యవస్థ కాస్త నెమ్మదిగానే అయినా సుస్థిరంగా పెరిగి ఉండేది. క్రమంగా ఊపందుకుని ప్రజల ఆదాయాలు పెరిగి ఉండేవి. ఆదాయపరంగా కాస్త చెప్పుకోదగిన 49 దేశాల గణాంకాలను ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) స్థూలంగా అధ్యయనం చేస్తే, ఈ కీలక విభాగాలన్నిటిలో భారతదేశం చివరి ఐదు దేశాల్లో ఉంది. ఈ మార్పుల్ని తీసుకురాకుండా స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా ప్రభుత్వ ప్రమేయం పెద్దగా లేకున్నా కూడా పెరిగిన ఆదాయాన్ని తాత్కాలిక తాయిలాలతో అనుత్పాదక పథకాలతో దుబారా చేస్తూ, అధికారాన్ని కేంద్రీకరించుకుని, కొన్నిచోట్లే అభివృద్ధిని కేంద్రీకరించి, అవినీతిమయమైన వ్యవస్థలో కొన్ని రంగాలకే ఊతమిస్తూ, సులభ వాణిజ్యానికి ఎన్ని రకాల రాయితీల్ని ప్రకటించినా, పెట్టుబడులు ఒక స్థాయి దాటి వచ్చే

అవకాశముండదు, సుస్థిరంగా కొనసాగే అవకాశముండదు.

జనాభా రీత్యా మనం వైవిధ్యభరితమైన మార్కెట్ శక్తిగా ఉన్నాం కాబట్టి, సరళీకృత ఆర్థికవిధానాలు కొంతమేర వేగంగానే సత్ఫలితాలనిస్తాయి. కానీ అవి వేళ్లూనుకోవాలంటే పైన చెప్పిన సంస్కరణలు తప్పనిసరి. వేళ్లూనుకోకుంటే, ప్రపంచవ్యాప్తంగా మందగమన సమస్యలతోపాటు కరోనా వంటివి వస్తే తీవ్ర ప్రకంపనలు ఎదురవుతాయి. 2016-17 వరకు సుమారు 8 శాతంగా నమోదైన భారతదేశ వృద్ధి రేటు, 2019-20 నాటికి 4.2 శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో, సాధారణ పరిస్థితుల్లోనే మన వృద్ధి రేటు 2020-21లో 5-6 శాతం ఉండొచ్చన్న అంచనా ఉంది. దానికి కొవిడ్ లాక్‌డౌన్, తదనంతర సమస్యలు తోడయ్యాయి. ఇప్పుడు దేశ ఆర్థికం రెండంకెల నెగెటివ్ గ్రోత్‌ను వేగంగా అధిగమించి పుంజుకుంటుంటున్నందున భారత వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రపంచంలోనే రికార్డు స్థాయిలో 9 శాతానికి (అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే) చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదంటున్నప్పటికీ, దాని చుట్టూ అనుమానాలు, అనిశ్చితి మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఎందుకంటే రిస్కుల్ని సమర్థవంతంగా ఎదుర్కోగల, ఉపాధిసహితం, సమ్మిళితం కాగల వృద్ధికి అవసరమైన పునాదులు మనకు లేవు. సుస్థిర వృద్ధికి కావలసిన సానుకూలతలు చాలా దేశాలకంటే భారత్‌కే ఎక్కువగా ఉన్నాయి కానీ.. కొండంతలు సాధించగలిగే చోట గోరంతలు మాత్రమే చేసే మన రాజకీయ హ్రస్వదృష్టి, పేలవమైన విధానాలు ఒడిదుడుకులకు కారణమవుతున్నాయి.

మన దేశంలోలా సంక్షేమం పేరుతో తాత్కాలిక తాయిలాలకు కాకుండా.. జీవన భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆర్థిక వృద్ధికి కావలసిన చర్యల్ని మన కంటే మెరుగ్గా తీసుకుంటుండటం వల్లే వియత్నాం, శ్రీలంకలు కూడా తలసరి ఆదాయంలో మనల్ని దాటి వెళ్లాయి. ఈ జాబితాలోకి మనం పెద్దగా పట్టించుకోని బంగ్లాదేశ్ కూడా ఇటీవల పోటీపడుతోంది. కొవిడ్ తీవ్రతను తట్టుకుని భారత్ కంటే మెరుగైన వృద్ధిని సాధిస్తున్న దేశంగా బంగ్లాదేశ్ గుర్తింపు తెచ్చుకోవటం వెనుక మూడు దశాబ్దాల కృషి ఉంది. వారు ఉద్యోగాల సృష్టి మీద గట్టి దృష్టి పెట్టటమేకాకుండా, ఉపాధి పనుల్లో మహిళల పాత్రను గణనీయంగా పెంచారు. మన దేశ తలసరి ఆదాయం ఇప్పుడున్న 2,200 డాలర్ల నుంచి వచ్చే పదేళ్లలోనైనా రెట్టింపయి కనీసం 5,000 డాలర్లకు చేరుకోవాలంటే జీడీపీ వృద్ధి రేటు నిలకడగా కనీసం 8 శాతం ఉండాలి. వృద్ధి రేటు 5 శాతం ఉంటే ఆదాయం రెట్టింపు కావటానికి 17 ఏళ్లు పడుతుంది. 3 శాతముంటే 30 ఏళ్లు పడుతుందని అంచనా.

2030 నాటికి దేశంలో పనిచేసే వయస్కుల జనాభా ప్రపంచంలోనే అత్యధికంగా 96 కోట్లకు మించనుందని యూనిసెఫ్ అధ్యయనం లెక్కేసింది. ఇంకోమాట కూడా చెప్పింది. 96 కోట్ల మందిలో పట్టభద్రులు 31 కోట్ల దాకా ఉంటారని, కానీ ఉద్యోగాలకు పనికొచ్చే నైపుణ్యాలు కలిగినవారు సగం మందేనని తెలిపింది. అంటే 2048లోగా వచ్చే అత్యంత కీలక ఘట్టంలో కూడా మన పరిస్థితి తీవ్ర బలహీనతలతో కూడి ఉంది. దీన్ని సరిదిద్దుకుని వ్యక్తిసుఖాన్ని-సమాజహితాన్ని సంధానం చేసే రీతిలో ఉపాధిని అందించే రంగాల చుట్టూ నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నం చేయాలి. కరోనా వైరస్ విజృంభణ వల్ల రోబో విప్లవం ముందుగానే వచ్చేస్తోందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) గత అక్టోబర్‌లో ఇచ్చిన నివేదికలో తెలిపింది. అంతర్జాతీయ సగటు కంటే వేగంగా భారత్‌లోని కంపెనీలు ఆటోమేషన్ (యాంత్రీకరణ) దిశగా అడుగులు వేస్తున్నాయని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 50 శాతం కంపెనీలు ఆటోమేషన్ పనులను వేగవంతం చేయగా.. భారత్‌లో 58 శాతం ఆ పనిలో పడ్డాయని పేర్కొంది. డిజిటలీకరణ యత్నాల్లో భారత్‌లో 87 శాతం కంపెనీలుండగా, ప్రపంచ సగటు 84 శాతమేనని వెల్లడించింది. వచ్చే అయిదేళ్లలో 26 ఆర్థిక వ్యవస్థల్లో 15 రంగాల్లో 8.5 కోట్ల ఉద్యోగాలు రూపాంతరం చెందే అవకాశం ఉందని, అదే సమయంలో రోబో విప్లవం వల్ల సరికొత్తగా 9.7 కోట్ల ఉద్యోగాలు వస్తాయనీ, అయితే ఆ ఉద్యోగాలను అందిపుచ్చుకునే శక్తి ఉండటం కీలకమనీ హెచ్చరించింది. ఈ హెచ్చరిక అందుకున్న దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది.

కొత్తగా వచ్చే ఉద్యోగాలన్నీ నాలుగో పారిశ్రామిక విప్లవ పరిశ్రమలైన కృత్రిమ మేధ వంటి రంగాల్లో రావొచ్చని డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. “2025 కల్లా కంపెనీలు మనుషులకు, మెషీన్లకు సమానంగా పనిని విభజించవచ్చు. నైపుణ్యం ఎక్కువ ఉన్నవారికి గిరాకీ కూడా ఎక్కువగా ఉంటుంది. మెషీన్లు కేవలం సమాచార, డేటా ప్రాసెసింగ్, పాలనాపర పనులు చేసే అవకాశం ఉంది. సలహాలు ఇవ్వటం, నిర్వహణ, నిర్ణయాలు, హేతుబద్ధ ఆలోచనలు, కమ్యూనికేషన్ వంటివి మనుషులే చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హరిత ఆర్థిక ఉద్యోగాలను భర్తీ చేయగల సిబ్బందికి గిరాకీ పెరగవచ్చు” అని చెబుతూ భవిష్యత్ రాతను మార్చే 20 రంగాలను ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసింది. బ్రాడ్ స్పెక్ట్రమ్ యాంటీ వైరల్స్, స్పేస్ ఫ్లైట్లు, జీన్స్-డీఎన్ఏ సీక్వెన్స్‌లు, ప్రెసిషన్ ఔషధాలు, ఎడ్‌టెక్, కృత్రిమ మేధ, శాటిలైట్ సేవలు, విద్యుత్ వాహనాలు, డిజిటల్ ఫైనాన్షియల్ సేవలు, హైపర్‌లూప్ ఆధారిత రవాణా సేవలు, కొత్త యాంటీబయాటిక్స్, నిరుద్యోగబీమా.. తదితరాలు అందులో ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు అవసరమైన విశ్లేషణ సామర్థ్యం, నూతన ఆవిష్కరణలు, కొత్త విషయాలను వేగంగా గ్రహించగల నేర్పు, క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మక, సహజమైన తెలివితేటలు (ఒరిజినాలిటీ), నాయకత్వ లక్షణాలు, సోషల్ ఇన్‌ఫ్లుయెన్స్, సాంకేతిక వినియోగం, నియంత్రణ, పర్యవేక్షణ, టెక్నాలజీ డిజైన్ అండ్ ప్రోగ్రామింగ్, ఒత్తిడిని తట్టుకునే శక్తి, ఓటమి నుంచి త్వరగా తేరుకోగల మానసిక స్థితి, తార్కికత, సమస్యల పరిష్కారం, కొత్త ఆలోచనలు పెంపొందించుకుని మార్కెట్లను అందిపుచ్చుకోవటానికి ఇప్పటికే ఉన్నవారికి రీస్కిల్లింగ్‌తోపాటు నూతన విద్యావిధానాన్ని సక్రమంగా అమలు చేయాలి. ఈ కొత్త ఉద్యోగాల్లో యువతులు/మహిళలు కూడా సగం అవకాశాల్ని అందిపుచ్చుకునే అవకాశాలున్నాయి. నూతన

విద్యావిధానానికి ఇతర సంస్కరణల్ని కూడా జోడించి పటిష్ఠ సామాజిక పునాదిని వేసినప్పుడు మాత్రమే భారతదేశం తనకున్న ఆర్థిక బలాల్ని పూర్తిగా ఆవిష్కరించుకుని సుస్థిర శక్తిగా కొనసాగగలుగుతుంది. ఈ దార్శనిక కార్యాచరణలో ప్రభుత్వాలు ప్రయివేటు శక్తులను కూడా కలుపుకుని వెళ్లాలి. ఇదే సమయంలో పారిశ్రామిక రంగాన్ని ఉపాధి కేంద్రంగా ప్రోత్సహించాలి. జిల్లా యూనిట్‌గా పెద్దఎత్తున పారిశ్రామికీకరణ ఏర్పాట్లు చేయాలి. విజయనగరం జిల్లా అచ్యుతాపురంలో బ్రాండిక్స్ తరహాలో. చుట్టుపక్కల ఊళ్లలో మహిళలు సహా ఎవరు ఉద్యోగం చేస్తామన్నా వెంటనే ఉపాధి కల్పించే అవకాశాల్ని బ్రాండిక్స్ అందించింది. చైనా నుంచి పెద్దఎత్తున పరిశ్రమలను ఆకర్షించటం, కరోనా కాలంలో చైనా పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్న సమయంలో కూడా మనం ఈ విషయంలో సఫలం కాలేకపోయాం. మనకంటే చిన్న దేశాలైన వియత్నాం, తైవాన్ వంటివి ఆ అవకాశాల్ని అందుకున్నాయి. ఈ వైఫల్యాన్ని సరిదిద్ది పెద్దఎత్తున పెట్టుబడులు మన దేశంలోకి ప్రవహించే ఏర్పాటు చేయాలి.

రూపొందించుకోవాలి. అందుకు 2021-30 దశాబ్దమే మనకు కీలకం. ఈ దశాబ్దం ఎంత కీలకమో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా స్పష్టంగానే చెబుతున్నారు. "ఈ దశాబ్దిలో భారత్‌ను అగ్రగామిగా చేసేందుకు అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకొస్తున్నాం. దేశంలో యువత ఎక్కువగా ఉంది. వారిని పోటీ ప్రపంచానికి దీటుగా మలిచేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ దశాబ్ది మనది కావాలంటే మన పునాదులు బలంగా ఉండాలి" అని ప్రధాని పేర్కొన్నారు. కానీ కేవలం మాటలు చెబితే చాలదు. 2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం వంటి ప్రకటనలు, సంస్కరణల పేరుతో పైపై పూతలతో లాభం లేదు. ప్రభుత్వం చేయాల్సిన పనులు సక్రమంగా చేయకుండా.. ప్రజలు రాజ్యాంగం ప్రసాదించిన తమ ప్రాథమిక హక్కులను అనుభవించటం కన్నా ప్రాథమిక విధులను నెరవేర్చేందుకు అధిక ప్రాధాన్యమివ్వాలి, విధులను, బాధ్యతలను చిత్తశుద్ధితో, నిబద్ధతతో నెరవేర్చాలి.. అంటూ ఉపన్యాసాలిస్తే ఉపయోగం లేదు. చైనా జాతీయాదాయం ఇప్పటికే 15 ట్రిలియన్ డాలర్లు చేరింది! కొనుగోలు శక్తి రీత్యా

## తయారీరంగంలో కొరవడిన పెద్ద అడుగులు

ఎస్‌బీఐ రీసెర్చి నివేదిక ప్రకారం.. భారత్ మొత్తం జీడీపీలో తయారీరంగం వాటా 25 శాతం ఉండాలన్న లక్ష్యంగా 2000 నుంచీ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. ఇందుకు 2025ను లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే ఈ దిశలో పెద్ద అడుగులు ఏవీ పడలేదు.

- ప్రపంచ తయారీ రంగంలో భారత్ తయారీ రంగం వాటా 2004-2017 మధ్య 1.5 శాతం నుంచి 3 శాతానికి పెరిగింది. చైనా విషయంలో ఇది ప్రస్తుతం 18 శాతం.
- భారత్ తయారీ రంగంలో మరింత శక్తిసామర్థ్యాలు సాధించడానికి టారిఫ్‌ల పెంపు మార్గం కాదు. ఇందుకు తగిన పటిష్ఠమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసుకోవాలి. ఆయా మార్గాలే మన ఎగుమతులనూ పెంచుతాయి. వ్యాపారాలు మరింత సరళతరంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- 2005 నుంచి 2008 మధ్య సంవత్సరాలు మినహా, తయారీ రంగంలో మనం రెండు అంకెల్లో వృద్ధి ఎప్పుడూ సాధించలేదు. దీంతో గత కొన్నేళ్లుగా మొత్తం భారత్ స్థూల దేశీయోత్పత్తిలో తయారీ రంగం వాటా 15 నుంచి 18 శాతం మధ్యే పరిమితమవుతోంది.

నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల కల్పనతోపాటు జేబులో నుంచి ఖర్చు లేకుండా అందరికీ నాణ్యమైన వైద్యాన్ని ప్రాథమిక స్థాయి నుంచి అందించే ఏర్పాటు చేస్తే కోట్లాది ప్రజలు పేదరికం నుంచి శాశ్వతంగా బైటపడగలుగుతారు. జీడీపీలో అదనంగా మరో 0.5 శాతం కేటాయిస్తే జేబులో నుంచి రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా అందరికీ నాణ్యమైన వైద్యాన్ని, యువతకు ఉపాధిని అందించే విధానాన్ని లోక్‌సత్తాయే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించింది.

మన స్థూల జాతీయాదాయం 8 నుంచి 10 శాతం వరకు కొనసాగుతుంటేనే, మనం 2040 నాటికి ఇప్పుడు చైనాకున్న తలసరి ఆదాయం స్థాయికి చేరగలం. ఇక అమెరికా తలసరి ఆదాయం స్థాయి గురించి ప్రస్తుతం మాట్లాడుకోనక్కర్లేదు.. కాబట్టి సూపర్ పవర్ వంటి నినాదాల చుట్టూ కాలయాపన చేయకుండా, మనకున్న యువ జనాభా శక్తిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా కనీసం వచ్చే 100 ఏళ్ల దృష్టితో కార్యాచరణను

చైనా జాతీయాదాయం 25 ట్రిలియన్ డాలర్లు దాటి అమెరికాని అధిగమించింది. మనం ఏమీ చేయకుండా యధాతథంగా వదిలేసినా సమాజంలోని అంతర్గత బలం, అత్యధిక యువజనాభా వల్ల భారతదేశం 2025కో, 2026కో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారొచ్చు. కాబట్టి భారతదేశం, అందులోని పౌరులుగా మనం పూర్తిస్థాయిలో ఎదగాలంటే మనకున్న వనరులన్నిటినీ సరైన దిశలో నిలకడగా వినియోగించేందుకు సర్వశక్తులతో కష్టపడటం తప్ప మార్గం లేదు. కరోనా సృష్టించిన నిరుద్యోగాన్ని, పేదరికాన్ని ఎదుర్కొంటూనే లక్ష్యాన్ని అందుకోవాలి. భవిష్యత్తు పట్ల అమెరికాలో ఉన్నంత అభద్రత భారతదేశంలో లేదు. గత తరం కంటే మనం మెరుగ్గా ఉన్నామన్న అంచనా, మన కంటే మన భవిష్యత్ తరాలు మెరుగ్గా ఉంటాయన్న ధీమా మనలో ఎక్కువమందిలోనే ఉన్నాయి. ఇదో గొప్ప సానుకూల శక్తి మనకు. అయితే నియంతృత్వం ద్వారా వేగంగా ఎదగటమనే చైనా నమూనా మనకు ఆదర్శం కాదు. భారత్ సరైన ఎజెండాతో, పరస్పర విశ్వాసంతో,

## కరోనా 'భూతద్దం'లా పనిచేసింది

సమాజంలోని అసమానతలు, అన్యాయాలను వెలుగులోకి తెచ్చే భూతద్దంలా కరోనా మహమ్మారి మారిందని విప్రో వ్యవస్థాపక ఛైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ పేర్కొన్నారు. కోట్ల మంది పౌరులకు కనీస గౌరవం లభించకపోవడాన్ని తేటతెల్లం చేస్తూ ప్రజావ్యవస్థలు చేయాల్సిన పనులను గుర్తుచేసిందన్నారు. "ఆర్థిక వ్యవస్థ అనేది సమాజంలో ఒక భాగమని కొవిడ్ గుర్తు చేసింది. మనుషులంతా అన్ని కోణాల్లో సమానంగా బాగుండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. సమాజంలో మార్కెట్లు, వ్యాపారాలు అనేవి భర్తీ చేయలేని పాత్రను పోషిస్తున్నాయనీ తేటతెల్లం చేసింది" అన్నారు. ఆహారం, నివాసం, భద్రత, ప్రాథమిక సామాజిక భద్రత, సమాన, అత్యున్నత నాణ్యత గల విద్య, ప్రజారోగ్య వ్యవస్థలు, భూ సంరక్షణ, జీవవైవిధ్య రక్షణ మొదలైనవి మన ఎజెండాగా ఉండాలన్నారు. ఇందుకు ప్రభుత్వాలు, పరిశ్రమలు, పౌర సమాజం, రాజకీయ నేతలు, సగటు పౌరులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే సమాన, మానవత్వం ఉన్న స్థిరమైన సమాజాన్ని మనం పొందగలమని ప్రేమ్‌జీ అన్నారు.

## వచ్చే 10 ఏళ్లలో వచ్చే మార్పులు భవిష్యత్తునే మార్చేస్తాయి

"మానవ ఇతిహాసంలో గత 100 ఏళ్లుగా వచ్చిన అనూహ్యమైన మార్పులు చరిత్రలో ఎప్పుడూ రాలేదు. గత 25 ఏళ్లుగా వచ్చిన మార్పులు అంతకుముందున్న 500 సంవత్సరాలలో రాలేదు. బహుశా వచ్చే 10 ఏళ్లలో వచ్చే మార్పులు.. భవిష్యత్తునే మార్చేస్తాయి. అందుకే దూరదృష్టితో ఆలోచించి సరైన సంస్కరణల్ని సరైన రీతిలో వేగంగా అమలు చేయగలిగితే.. మన ఆర్థిక వ్యవస్థను దశాబ్దకాలంలోనే 8 నుంచి 10 ట్రిలియన్ డాలర్లకు పెంచుకోగలం, సుస్థిరాభివృద్ధితో వివక్ష, అసమానతలు లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను, జీవన భద్రతను ఇచ్చే పర్యావరణహిత భవిష్యత్ భారతాన్ని నిర్మించుకోగలం. మనం సంకల్పించాలేగానీ, ఇది పూర్తిగా ఆచరణసాధ్యం".

–డా॥ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్),
లోక్‌సత్తా వ్యవస్థాపకులు



రాజ్యాంగ ప్రజాస్వామ్య స్థాయికి ఎదగటమే సరైన మార్గం.

ప్రజాస్వామ్యం ఆర్థిక ప్రగతికి అవరోధమన్న వాదన అవాస్తవం. చైనా ఎప్పుడు నియంతృత్వ ధోరణులని అవలంబించినా అది ఆర్థికవ్యవస్థని దెబ్బతీసింది. అదే చైనా అందరికీ మంచి విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, ఆర్థిక స్వేచ్ఛ, అధికార వికేంద్రీకరణ లాంటి చర్యలని చేపట్టినప్పుడు అద్భుత ఫలితాలని సాధించింది. సరయిన ప్రజాస్వామ్యం, ఆర్థిక ప్రగతి ఓ బండికి రెండు చక్రాలు. కరోనా సృష్టించిన నిరుద్యోగాన్ని, పేదరికాన్ని ఎదుర్కొంటూనే మనం లక్ష్యాన్ని అందుకోవాలి. వృద్ధి రేటును పెంచుకోవటానికి సౌర విద్యుత్, బ్యాటరీ టెక్నాలజీ నుంచి అంతరిక్ష ఆర్థికం దాకా పర్యావరణహిత, స్వేచ్ఛా మార్కెట్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయటంతోపాటు వాటి ఫలితాలు సుస్థిరంగా ఉండేందుకు, మున్ముందు ఇంకా విస్తరించేందుకు కావలసిన పునాదిని కూడా అందించేలా మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక సాధికారతతో పౌరుడు కేంద్రంగా అవినీతిరహిత పాలన, చట్టబద్ధపాలన, పన్నుల వ్యవస్థలో మార్పులు, ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం వంటి సంస్కరణలకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ ఉంటేనే మనం కనీస స్థాయి ఆదాయాన్ని, ప్రపంచంలో బలమైన శక్తిగా గుర్తింపును పొందగలం. వ్యవసాయంలో రైతులకు ధర రాకుండా దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు వేసిన సంకెళ్లను కొంతమేర తొలగించే చట్టాలను ఎట్టకేలకు ఇటీవల తీసుకొస్తే వాటిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల రైతులు స్వాగతిస్తున్నా కూడా కొంతమంది రైతుల అమాయకత్వాన్ని అడ్డంపెట్టుకుని ఆందోళనలు చేశారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయటానికి ఎంతో కీలకమైన మౌలిక వసతుల కల్పన చేసే ఆర్థిక వనరులు మన ప్రభుత్వాల వద్ద లేవు. ఏదోక రూపంలో పెట్టుబడులు వచ్చే అవకాశాల్ని అడ్డుకోవటం చివరికి రైతుల ప్రయోజనాలనే దెబ్బ తీస్తుంది. నూతన వ్యవసాయ చట్టాల వల్ల రైతుకు ఆదాయం పెరిగేందుకు ఒక మార్గం ఏర్పడుతుంది. ఒడిదుడుకులను తట్టుకునేందుకు సబ్సిడీలను కొనసాగిస్తూనే రిటైల్ చెయిన్లు వంటి అనేక చర్యలను ప్రభుత్వాలు తీసుకురావాల్సుంది. వ్యవసాయం కావచ్చు, మరో రంగంలో కావచ్చు.. మనం ఉత్తర కొరియా భాషను మార్చుకుని దక్షిణ కొరియా తరీకాలో వ్యవహరించాలి.

మనం అలా స్వీయసామర్థ్యంతో సన్నద్ధమైతే, సరైన రీతిలో నిర్ణయాలు తీసుకుంటే రాబోయే కాలంలో చైనాను కొన్ని దశాబ్దాల తర్వాతైనా అధిగమించే అవకాశం ఉంది. కాలక్రమంలోనైనా సూపర్ పవర్ రేసులోకి ప్రవేశించగలుగుతాం. 2021–30ని భారతదేశ దశాబ్దంగా మార్చేందుకు, తద్వారా 21వ శతాబ్దమంతా మన దేశ ప్రాభవాన్ని పరిరక్షించేందుకు భవిష్యత్ భారతీయులైన యువతే ఎక్కువ చొరవ తీసుకోవాలి, జాతీయ యువజన దినోత్సవం (జనవరి 12) వంటి సందర్భాలను కూడా ఈ కార్యాచరణకు అవకాశాలుగా వినియోగించుకోవాలి.

..: డాక్టర్ వెల్చాల కొండల్ రావు

# వృద్ధ రాజకీయవేత్తలు - యువజనులు-
# పరిణతి నాయకత్వం

**భారత రాజకీయాలు ఒక పక్క కాలం చెల్లిన ఆలోచనలు, సాంప్రదాయాలను ఆచరించే వృద్ధాప్య రాజకీయ వేత్తలు, మరోపక్క అనుభవ రహితులు, ప్రజావ్యవహారాల వివేకవంతమైన నిర్వహణకు అవసరమైన శిక్షణ సరిగ్గా.., కాదు.. అసలే లేనివారితోను కొట్టుమిట్టాడుతున్నాయి. ఒక వైపు వృద్ధ రాజకీయవేత్తలు అధికారమే పరమావధిగా వ్యవహరిస్తుండగా, మరోవైపు వర్తమాన ప్రపంచ సంక్లిష్టతలను అర్థం చేసుకోగల మేధో సామర్థ్యం కొరవడిన, అపరిణత మనస్కులైన యువజనులు అధికారం కోసం ఆరాటపడుతున్నారు. కాలానుగుణంగా ఆలోచించలేని వృద్ధ రాజకీయవేత్తలు, లేదా అపరిణత యువజనులు ఎవరు అధికారాన్ని కైవశం చేసుకున్నా జాతికి మేలు జరగదుగాక జరగదు. ఇది ఇప్పుడు మన సువిశాల దేశం, మన పురా నవ జాతి ఎదుర్కొంటున్న తీవ్ర సమస్య. భారత ప్రజలు ఇప్పుడొక సంకట స్థితిలో ఉన్నారు. ఈ సమస్య పరిష్కారానికి దేశ పౌరులందరూ విధిగా శ్రద్ధ చూపాలి. లేని పక్షంలో మనం ఆంతరంగిక స్వాతంత్ర్యాలను కోల్పోయే ప్రమాదమెంతైనా ఉన్నది. వివేచనాయుతమైన, వివేకవంతమైన నాయకత్వం కొరవడటం వల్లే ఈ సమస్య తలెత్తింది. భారతీయ ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న ఈ సంక్షోభ తీవ్రతను మన 'యువజనుల'తో పాటు 'వృద్ధులు' కూడా ఎంత త్వరగా గుర్తిస్తే ఈ జాతి భవితవ్యానికి అంత మంచిది...**




భారత ప్రజాస్వామ్య వ్యవస్థ భారత భూస్వామ్య వ్యవస్థలానే నడుస్తోంది. కుటుంబ పెద్దే కుటుంబ వ్యవహారాలన్నిటినీ శాసిస్తాడు. జీవిత పర్యంతమూ! వృద్ధాప్యం కారణంగా శారీరక అశక్తత, బుద్ధిమాంద్యానికి ఎంతగా లోనైనప్పటికీ కుటుంబ పెద్దదే తుది మాట. భూస్వామ్య సాంప్రదాయాలు ఇంతగా పాదుకుపోయిన మన సమాజంలో భూస్వామ్య లక్షణాలు కౌటుంబిక, ఆస్తి వ్యవహారాల నిర్వహణలో మాత్రమే కాదు, రాజకీయ వ్యవస్థలోనూ అంతే ప్రగాఢంగా నెలకొని ఉన్నాయి. మన రాజకీయవేత్తలు పదవులను తమ సొంత ఆస్తులుగా పరిగణిస్తున్నారు. ఆ పదవులను అలంకరించడం కోసమే తాము పుట్టామనే భావనతో జీవితాంతం పదవికి అంటి పెట్టుకొని ఉండిపోవడానికి సంకల్పించుకున్నారు. మారుతోన్న పరిస్థితులకు అనుగుణంగా మారరు సరి కదా కొత్తగా రంగంలోకి వచ్చినవారికి బాధ్యతలు అప్పగించేందుకూ ఇష్టపడరు. కొత్తవారికి అవకాశాలను వీలైనంతవరకు నిరాకరించడానికే ప్రయత్నిస్తున్నారు. మరి రాజకీయ రంగంలో యువరక్తం ఎలా ప్రవహిస్తుంది? ఈ భూస్వామ్య తత్వం ఇంతగా పాదుకొనిపోయి ఉండడం వల్లే దీక్షా దక్షతలు గల యువ రాజకీయవేత్తలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు, ఒంటరివారై పోతున్నారు, తిరస్కరింపబడుతున్నారు, అనివార్యంగా రాజకీయాల నుంచి నిష్క్రమిస్తున్నారు. మరి ఇటువంటి ధోరణులు మన ప్రజాస్వామ్య పరిణతికి ఎలా దోహదం చేస్తాయి? ఎప్పటికప్పుడు పాత స్థానంలో కొత్త ప్రవేశించకపోతే కాలానుగుణమైన నూతన ఆలోచనలు ఎలా వికసిస్తాయి? ప్రతిభావంతులను అనాదరించడం, అణచివేయడం ప్రజాస్వామ్య పరిపుష్టికి ఎలా తోడ్పడుతుంది? రాజకీయ రంగాన్ని సంపూర్ణంగా ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

మన రాజకీయాలు ఒక పక్క కాలం చెల్లిన ఆలోచనలు, సాంప్రదాయాలను ఆచరించే వృద్ధాప్య రాజకీయ వేత్తలు, మరోపక్క అనుభవ రహితులు, ప్రజావ్యవహారాల వివేకవంతమైన నిర్వహణకు అవసరమైన శిక్షణ సరిగ్గా, కాదు.. అసలే లేనివారితోను



## లోక్‌సత్తా ఎజెండా కోసం క్రియాశీల కృషి చేసిన రాములు

ఓటరు నమోదు, ప్రజాసర్వేలు, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత కోసం లోక్‌సత్తా ఉద్యమకారునిగా నిమ్మల రాములు క్రియాశీల కృషి చేశారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, నేతలు చారుగుండ్ల వెంకటేశ్వర్లు, మదనపు రజనీకాంత్, శనగ రామచందర్‌రావు ఘన నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 1999 సంవత్సరంలో నాటి జిల్లా అధ్యక్షుడు చారుగుండ్ల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ పాల్వంచ పట్టణ ఉపాధ్యక్షునిగా నియమితులైన రాములు ఆ తర్వాత పలు బాధ్యతల్ని నిర్వహించారు.

కొట్టుమిట్టాడుతున్నాయి. మరి మన ప్రజాస్వామ్య ఆరోగ్యం సజావుగా, సౌష్ఠవంగా ఎలా ఉంటుంది? రాజ్యవ్యవస్థ వ్యవహారాలకు బాధ్యత వహించేవారు అనుభవజ్ఞులు, పరిణత ఆలోచనాపరులై ఉండి తీరాలి. నేడు ప్రధానమంత్రి నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్ దాకా వివిధ ప్రభుత్వ పదవులను నిర్వహించే రాజకీయవేత్తలు తమ విద్యుక్త ధర్మాన్ని సమర్థంగా నిర్వహించి తీరాలంటే పలు విషయాలలో అత్యున్నత స్థాయి అవగాహన, పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి. మరి ఈ అధునాతన యుగ రాజకీయవేత్తలలో ఎంతమందికి అటువంటి అవగాహన ఉన్నది? జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలను నిశితంగా అర్థం చేసుకోవాలంటే రాజకీయవేత్తలు ఉన్నత విద్యావంతులై ఉండాలి, ప్రపంచాన్ని విస్తృతంగా చూసినవారై ఉండాలి. లోక వ్యవహారాలలో విధిగా అనుభవజ్ఞులై ఉండాలి. అన్నిటికీ మించి స్వప్రయోజనాల కంటే సమాజ ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వగల పెద్ద మనస్సు కలవారై ఉండాలి.

మన రాజకీయ రంగంలో మౌలిక మార్పులు రావాలంటే కార్యాచరణ ఆధారిత రాజకీయవేత్తలు పెద్దసంఖ్యలో ఉండాలి. మరి విద్య, అనుభవం ఉన్నవారే అటువంటి రాజకీయవేత్తలు కాగలుగుతారు. ఇటువంటి రాజకీయవేత్తలు అసలే లేరని చెప్పకపోయినా మన రాజకీయవేత్తలలో అత్యధికులు ఏదో చేస్తున్నట్టు కన్పించే వారే కాని వాస్తవంగా వారు కార్యాచరణ ఆధారిత రాజకీయవేత్తలు కానే కారు. ఈ కీలక వాస్తవాన్ని మన సమాజం గుర్తించడం లేదు, అర్థం చేసుకోవడం లేదు. పార్లమెంటు, శాసనసభల చర్చల్లో శ్రద్ధగా పాల్గొంటున్న ప్రజాప్రతినిధులు అతి తక్కువ సంఖ్యలో ఉండడానికి కారణమేమిటి? మంత్రి పదవులలో ఉన్నవారు కూడా ప్రజాసమస్యలపై ఉన్నతస్థాయి అవగాహన, విస్తృత అనుభవమూ లేనివారేననడంలో ఎలాంటి సందేహం లేదు. సంక్లిష్ట ప్రజాసమస్యలను పరిష్కరించగల మేధో సామర్థ్యం వారిలో పూర్తిగా కొరవడిందనేది ఒక కఠోర సత్యం.

రాజకీయ చాతుర్యం, రాజకీయ కార్యదక్షత రాజకీయాలలో ఒక ముఖ్యభాగం. ఇటువంటి నైపుణ్యాలు రాజకీయవేత్తకు తప్పనిసరిగా ఉండాలి. అలాగే పాలనాదక్షత, మేధో అవగాహన, సామాజిక అభిజ్ఞత అనేవి కూడా రాజకీయాలలో ముఖ్యభాగమే. నిజం చెప్పాలంటే ఇవే ముఖ్యమైనవి. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజాశ్రేయస్సుకే ప్రాధాన్యతనిచ్చే రాజకీయవేత్త ఎవరైనా సరే అటువంటి వ్యక్తిత్వ లక్షణాలను పెంపొందించుకుని తీరాలి. ఇరవై ఒకటో శతాబ్ది సమాజాలు విజ్ఞానాధారిత సమాజాలు. ఈ యుగ రాజకీయాలకు ఉన్నతస్థాయి మేధో అవగాహన అత్యంత అవసరం. చట్టసభలలో గానీ, ఇతర రాజకీయ వేదికలలో గానీ మెరుగైన మేధో సామర్థ్యాలు గల అనుభవజ్ఞులైన రాజకీయవేత్తలే తమ విధులను సమర్థంగా నిర్వహించగలరు. ప్రజల అభ్యున్నతికి దోహదం చేయగలరు.

అనుభవజ్ఞులైన రాజకీయవేత్తలను స్వాగతించాలి. అంతేగాని 'వృద్ధ' రాజకీయవేత్తలను మాత్రం కాదు. అలాగే యువ రాజకీయవేత్తలను స్వాగతించాలి. అంతేగానీ సరైన విద్యా వ్యాసంగాలు లేని, అనుభవరహితులైన యువజనులను రాజకీయాలలో ప్రోత్సహించకూడదు. యువజనులైనంత మాత్రాన వారి మేధో సామర్థ్యాన్ని విస్మరించి స్వాగతించకూడదు. కాలం చెల్లిన సాంప్రదాయాలను, భావ స్రవంతులను అనుసరించే యువజనులను రాజకీయాలకు దూరంగా ఉంచాలి. తాము ఎవరినైతే విమర్శిస్తున్నారో, ఆ విమర్శలకు లోనైన వారి వలె తామూ వ్యవహరించే యువ రాజకీయవేత్తలను తప్పక నిరాదరించాలి. అధికారాన్ని శాశ్వతంగా గుప్పిట్లో ఉంచుకోవాలని ఆశిస్తున్న యువ రాజకీయవేత్తలను తిరస్కరించాలి. రాజకీయ నాయకుల బంధువులను ఆహ్వానించవచ్చు. అయితే వారు స్వప్రయోజనాలకు గాక జాతి విశాల ప్రయోజనాలకు విధిగా ప్రాధాన్యమిచ్చేవారై ఉండాలి.

నిజమే, ఇది 'యువజనుల యుగం'. జాతి భవిష్యత్తుకు సరికొత్త ప్రణాళికలను రచించగల, లక్ష్య సాధనకు వినూత్న ఆచరణలను ప్రవేశపెట్టగల యువజనులకు రాజకీయ పదవీ బాధ్యతలను అప్పగించాలి. ఆ బాధ్యతలు అటువంటి యువతీయువకులకు మాత్రమే దక్కేలా పౌరులు జాగురూకత వహించాలి. మరి అటువంటి మేధో సంపన్నులు, ప్రజాసేవాభిలాష గల యువజనులు మనకు సమృద్ధిగా ఉన్నారా? సమాధానం స్పష్టమే. ధనబలం, కండ బలంతో పదవులు సాధించుకోవడానికి వెనుకాడని యువజనులు ఇప్పుడు రాజకీయ రంగంలో మనగలుగుతున్నారనేది ఒక చేదు నిజం. ఇప్పటికీ కీలక పదవులలో ఉన్న నాయకుల కుటుంబ సభ్యులు, బంధుగణం మాత్రమే రాజకీయాలలోకి ప్రవేశించగలుగుతున్నారు, రాణించగలుగుతున్నారు. సమాజపు అట్టడుగు వర్గాల నుంచి ప్రభవిస్తున్న ప్రతిభావంతులకు రాజకీయ రంగంలో సరైన అవకాశాలు లభించడం లేదు. ఈ పరిస్థితి మారాలి.

ఆదర్శాలు, మానవతా దృక్పథం, ప్రజల శ్రేయస్సుకు తోడ్పడాలనే సద్భావనలు, సత్సంకల్పాలు లేని యువజనుల నుంచి ఈ దేశాన్ని భగవంతుడే రక్షించాలి. భారత ప్రజలు ఇప్పుడొక సంకట స్థితిలో ఉన్నారు. ఒక వైపు వృద్ధ రాజకీయవేత్తలు అధికారమే పరమావధిగా వ్యవహరిస్తుండగా, మరోవైపు వర్తమాన ప్రపంచ సంక్లిష్టతలను అర్థం చేసుకోగల మేధో సామర్థ్యం కొరవడిన, అపరిణత మనస్కులైన యువజనులు అధికారం కోసం ఆరాటపడుతున్నారు. కాలానుగుణంగా ఆలోచించలేని వృద్ధ రాజకీయవేత్తలు, లేదా అపరిణత యువజనులు ఎవరు అధికారాన్ని కైవశం చేసుకున్నా జాతికి మేలు జరగదుగాక జరగదు. ఇది ఇప్పుడు మన సువిశాల దేశం, మన పురా నవ జాతి ఎదుర్కొంటున్న తీవ్ర సమస్య. ఈ సమస్య పరిష్కారాన్ని దేశ పౌరులందరూ విధిగా శ్రద్ధ చూపాలి. లేని పక్షంలో మనం ఆంతరంగిక స్వాతంత్ర్యాలను కోల్పోయే ప్రమాదమెంతైనా ఉన్నది. వివేచనాయుతమైన, వివేకవంతమైన నాయకత్వం కొరవడటం వల్లే ఈ సమస్య తలెత్తింది. భారతీయ ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న ఈ సంక్షోభ తీవ్రతను మన 'యువజనుల'తో పాటు 'వృద్ధులు' కూడా ఎంత త్వరగా గుర్తిస్తే ఈ జాతి భవితవ్యానికి అంత మంచిది.

**("ది ప్రాబ్లమ్ ఆఫ్ ఐసొలేషన్ ఆఫ్ ది 'ఐడియల్ అండ్ ది 'ప్రామిసింగ్' ఇన్ ఇండియన్ పాలిటిక్స్" శీర్షికన రాసిన ఆంగ్ల వ్యాసంలోని కొన్ని భాగాలకుస్వేచ్ఛానువాదం. కర్టసీ:ఆంధ్రజ్యోతి)**

# అధైర్యమే ఓటమి రహస్యం యువతరమా!

**మన సమాజంలో విశ్లేషణ, పరిష్కారంలో భాగమయ్యే ధైర్యం తక్కువగా ఉన్నాయనటానికి అనేక ఉదాహరణలు చుట్టూ (తెలుగునాటే కాకుండా దేశంలో కూడా) కనిపిస్తూనే ఉన్నాయి. విద్యార్థి దశ నుంచీ ఈ లోపం మొదలవుతోంది. తెలంగాణలో పదవ తరగతి విద్యార్థుల మధ్య నిర్వహించిన ఓ సైకోమెట్రిక్ సర్వేలో.. సవాళ్లను ఎదుర్కొనే తత్వం (రిస్క్ టేకింగ్) కేవలం 2 శాతం మందిలోనే ప్రస్ఫుటంగా కనిపించింది. 61 శాతం మంది పిల్లలు మానసికంగా బలహీనంగా ఉన్నారు. సవాళ్లను ఎదుర్కొనే శక్తి ఎక్కువమందిలో బాగా తక్కువగా ఉంది. సమస్య నుంచి పారిపోవటం కాకుండా ఎదుర్కోవాలనే దృక్పథం కొరవడటంతోపాటు, సమస్యను ఆచరణసాధ్యంగా పరిష్కరించుకునేందుకు కావలసిన విశ్లేషణా సామర్థ్యం కూడా 11% మందిలోనే మెరుగ్గా ఉందని తేలింది. విద్యార్థుల్లో రిస్క్‌టేకింగ్ లక్షణాలు పెంచేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన ప్రొఫెసర్ సూచించారు...**



లోక్‌సత్తా పార్టీకి ఓ 20 సీట్లు లేదా 10-15 శాతం ఓట్లు పలు చోట్ల నిలకడగా వస్తుంటే, సాంప్రదాయ రాజకీయం మెడలు వంచేవారమని వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెబుతుంటారు. ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ అలాంటి విజయాల్ని ఇప్పటిదాకా సాధించలేదు గదా, మరి పార్టీ పెట్టినందుకు పశ్చాత్తాపపడుతున్నారా? పార్టీ పెట్టి నష్టపోయానని బాధపడుతుంటారా?.. అని అడిగితే 'నెవర్' అని జేపీ నిస్సంకోచంగా చెబుతారు.

ఓట్లు, సీట్లు సాధిస్తున్న సాంప్రదాయ పార్టీల కంటే అనేక రెట్లు ఎక్కువ కృషిని లోక్‌సత్తా రాజకీయంగా, పాలనాపరంగా చేస్తోందని, సాపేక్షంగా అనేక రెట్లు విజయాల్ని సాధిస్తోందని, లోక్‌సత్తా గురించేమీ దిగుల్లేదని జేపీ అంటారు. కానీ పార్టీ ఏర్పాటు గురించి మాత్రం ఒక ఆసక్తికరమైన వ్యాఖ్యను చెబుతుంటారు.

లోక్‌సత్తా భావజాల నిత్యనూతనత్వం, ప్రజల్లో మార్పు పట్ల ఆకాంక్ష.. ఈ రెంటి పట్లా తన అంచనా ఏమీ తప్పలేదని, కానీ సమాజంలో జనహితం దిశగా చొరవ తీసుకోగలిగే అవకాశం ఉన్నవారి పట్లే తన అంచనా ఆశించిన మేర లేదంటారు. ప్రజల కోసం వనరుల్ని, సమయాన్ని ఇవ్వగలిగే స్థాయిలో ఉన్నవారు అంత ధైర్యం లేకుండా ఉంటారని తాను అనుకోలేదంటారు.

ప్రస్తుత సమాజంలో ఎన్నికల్లో గెలిచి సొంతంగా అధికారంలోకి వచ్చేంత బలం లోక్‌సత్తాకు లేదనే సంగతి తనకు ముందు నుంచీ స్పష్టత ఉందని, కానీ కనీసం 10-15 శాతం ఓట్లు వస్తే ఆ బలంతో అధికార క్రీడలోని ఆటనియమాల్ని కచ్చితంగా మార్చగలమనే అవగాహనతోనే లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని పార్టీగా కూడా విస్తరించామని జేపీ చెప్తారు. సమాజాన్ని ప్రభావితం చేయగలిగేవారు ధైర్యం చేయలేక కీలక సమయాల్లో ముందుకు రాకపోవటం, కొన్ని సందర్భాల్లో వచ్చినా కుంటిసాకులతో మళ్లీ కాడిపారేయటం వంటి కారణాల వల్లే ప్రధానంగా లోక్‌సత్తా అనుకున్న స్థాయిలో ఇప్పటికీ ఎన్నికల ఫలితాల్ని సాధించే పరిస్థితి లేదు. అయినా తాను ఆశావాదినని ప్రపంచవ్యాప్త చరిత్ర గతిని చూపుతూ పునరుద్ఘాటిస్తారు.

అధైర్యం.. ఎవరో వచ్చి మనల్ని కాపాడాలి తప్ప మనం చొరవ తీసుకోలేం అనే బేలతనం.. ఎవరి వెనకాలన్నా వెళ్తూ తప్ప సొంతంగా నాయకత్వాన్ని ప్రదర్శించలేని బలహీనత పెద్దతరాన్నే కాకుండా యువతరాన్ని కూడా పట్టిపీడిస్తున్నాయనటానికి పలు ఉదాహరణలు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో తీవ్రాతితీవ్రమైన రియాక్షన్లు తప్ప.. పరిష్కారాల్ని సాకారం చేసేందుకు ఏం చేయాలి, అందులో తాము ఎలా భాగస్వాములం కావాలి

అనే ఆలోచన కనబరుస్తున్నవారు చాలా తక్కువమంది ఉంటున్నారు.

స్వతంత్ర పోరాటంలో పనిచేస్తామని ముందుకొచ్చేవారిని గాంధీజీ ఒక ప్రశ్న అడుగుతుండేవారట- త్యాగాలకు సిద్ధపడే వస్తున్నావా? అని. లోక్‌సత్తాలో ఆ ప్రశ్నను ఎదుర్కోవలసిన అవసరం చాలామందికి రాలేదు. ఎవరైనా వారంతట వారు స్వచ్ఛందంగా అలా ముందుకొచ్చినా కూడా.. వారి జీవనోపాధి, ఇతరత్రా అంశాల గురించి సంతృప్తి చెందాకే జేపీ పెద్ద బాధ్యతలకు అనుమతిస్తుంటారు. అలా పూర్తి సమయం ఇచ్చేవాళ్లకి కూడా కాలపరిమితి వెసులుబాటు కల్పించారు. అంటే, తమకు నచ్చినన్ని సంవత్సరాలు చేసి ఆ తర్వాత తమకు నచ్చిన రంగంలోకి వెళ్లిపోవచ్చు. అక్కడ తమ బాధ్యతల నిర్వహణలో లోక్‌సత్తా భావజాలానికి తగ్గట్లు పనిచేయటంతోపాటు.. నేరుగా లోక్‌సత్తా భావజాల కార్యక్రమాల్లో కూడా తమకు వీలున్నరీతిలో వీరు భాగస్వాములవుతుంటారు. వీటన్నిటినీ దాటుకుని కూడా పూర్తిస్థాయిలో పనిచేయాలనుకుంటే ఇక వారిష్టం. కానీ స్వతంత్ర పోరాటకాలంలోలా ఇప్పుడు తీరిగ్గా ఉండే సంప్రదాయ వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ కాదు కాబట్టి, పోటీ ఆర్థిక వ్యవస్థ కాబట్టి.. ఎక్కువమంది తమ సొంత పనులు చూసుకుంటూనే కొంత సమయాన్ని, వనరుల్ని సమాజం కోసం కేటాయించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ కార్యక్రమాల్లో సంఘటితంగా ఎక్కడికక్కడ భాగస్వాములు కావాలని జేపీ కోరుతుంటారు. దీనికి లక్షల సంఖ్యలో యువత, మహిళలు కూడా స్పందించారు, స్పందిస్తుంటారుగానీ, వారి స్పందన నిర్మాణాత్మక కృషి, ఓట్ల రూపంలోకి మారటం లేదు.

లోక్‌సత్తా బరిలో ఉన్న ఎన్నికల సమయంలో ప్రచారం, పోటీ, బూత్ స్థాయి బాధ్యతల నిర్వహణ వంటి పనులకు వనరుల్ని ఇవ్వటానికి, నాయకత్వాన్ని అందించటానికి చాలామంది ధైర్యం చేయలేదు. ఓటు వేయటానికి, పక్కవారి చేయి వేయించటానికి కూడా ప్రజల్లో అనేకమంది చొరవ చూపలేదు. అనేకమందికి లోక్‌సత్తా అంటే అభిమానమే, లోక్‌సత్తా ఎజెండా జరగాలి, భవిష్యత్తు లోక్‌సత్తా భావజాలానిదే అంటుంటారు. కానీ తమ మనసులోని ఆకాంక్షను ఓటు రూపంలో నెరవేర్చుకునే చిన్నపాటి రిస్కును తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునైనా తీసుకోలేకపోయారు.

ప్రధానంగా ఈ అధైర్యం వల్ల మంచి మనసు, మంచి ఆలోచనలు ఉన్నవాళ్లు కూడా మంచి ఫలితాలనిచ్చే పనుల్లో నిలకడగా భాగస్వాములు కాలేకపోయారు. చక్కటి రోడ్‌మ్యాప్, సృజనాత్మకమైన వేదిక, ప్రామాణిక బహిరంగ చర్చా సంస్కృతి వంటి వాటినన్నిటినీ పళ్లెంలో పెట్టి అందుబాటులోకి తెచ్చినా ఎన్నికల్లో వినియోగించుకోలేకపోయారు.

## ధైర్యం అంటే తెంపరితనం కాదు

ఆదర్శాల్లో స్వతంత్ర పోరాటకాలం నాటి భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, నెహ్రూ, ఆజాద్, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, అంబేద్కర్ లాంటి వారికి ఏమాత్రం తీసిపోని వారు ఈనాటి యువత. నాటి కాలం వారి కంటే ఇప్పటి యూత్ చురుకైన, తెలివైన వారు కూడా. మానవజాతి చరిత్రలోనే ఏ తరానికీ లేనన్ని గొప్ప సాంకేతిక



ఆవిష్కరణలు, ప్రపంచస్థాయి పరిజ్ఞానాలు ఈవేళ మన యువతకు అందుబాటులో ఉన్నాయి. కానీ తగినంత ధైర్యం, ఇతరుల మీద ఆధారపడకుండా సొంతంగా సాధించాలనే ధోరణి ఎక్కువమందిలో కొరవడుతున్నాయి. ఇతరులను చులకన చేయగల, వారి మీద బురద జల్లగల, ప్రాణాలు తీయగల, తీసుకోగల తెంపరితనం ఉంటోందిగానీ, తమ శక్తిసామర్థ్యాలను నిలకడగా వినియోగించుకోగల ధైర్యం తక్కువగా ఉంటోంది. దీనివల్ల సమాజానికి ఉపయోగపడుతూ ఏదోక రకంగా ఉపాధి పొందటం, సమాజానికీ తద్వారా తనకీ ఉపయోగపడేలా ఇతరులతో కలిసి నిర్మాణాత్మకంగా పనిచేయటం వంటి అంశాల్లో యువత ఆశించినంత వేగంగా ఎదగలేకపోతున్నారు. నాయకులుగా రూపొందలేకపోతున్నారు. జనాభాలో అత్యధికులు యువత ఉండటమనే అద్భుత అవకాశం కలిగిన భారత్‌ను ఈ లోపం బాగా కుంగదీస్తోంది. ఇది ఇక్కడితో ఆగటం లేదు, రాబోయే తరాల్లో కూడా ఈ లోపం కొనసాగుతోందని ఓ సైకోమెట్రిక్ సర్వే వెల్లడించింది. దేశంలోనే తొలిసారిగా 2018-19లో తెలంగాణ ప్రభుత్వం

'మై చాయిస్ - మై ఫ్యూచర్' (ఎంసీఎంఎఫ్) పేరుతో ఈ సైకోమెట్రిక్ పరీక్షను నిర్వహించింది.

రాష్ట్రంలోని 27 జిల్లాల్లో 194 మోడల్ స్కూళ్లలో దాదాపు 20,000 మంది పదో తరగతి విద్యార్థులపై ఈ పరీక్షను నిర్వహించారు. ఇందులో 10 వేల మంది చొప్పున బాలబాలికలు ఉన్నారు. విద్యార్థుల ఆసక్తుల్ని, అంతర్గత నైపుణ్యాల్ని గుర్తించి వారిని ఆ రంగాల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సైకోమెట్రిక్ పరీక్ష చేశారు. వ్యవసాయం, హెల్త్‌కేర్, ఇంజినీరింగ్, క్రీడలు, సైన్స్, గణితం, పోలీస్, డిఫెన్స్, జర్నలిజం, ఉపాధ్యాయ, న్యాయ, పరిపాలన, బిజినెస్, మేనేజ్‌మెంట్, సేల్స్, పర్యావరణం.. ఇలా అనేక రంగాల్లో తమ అభిరుచుల్ని వారు చెప్పారు. అమ్మాయిలైతే 20 శాతం మంది వ్యవసాయం పట్ల మొగ్గు చూపి పలువురిని ఆశ్చర్యంలో ముంచారు. సర్కారీ ఉద్యోగాల పట్ల మోజు తగ్గుతున్నట్లు కూడా కనిపించింది. ప్రభుత్వం చేసిన ఈ మంచి ప్రయత్నంలో అన్నింటి కంటే దిగ్భ్రాంతికరమైన ఓ అంశం వెల్లడైంది. సవాళ్లను ఎదుర్కొనే తత్వం (రిస్క్ టేకింగ్) కేవలం 2 శాతం మందిలోనే ప్రస్ఫుటంగా కనిపించింది. 61 శాతం మంది పిల్లలు మానసికంగా బలహీనంగా ఉన్నారు. సవాళ్లను ఎదుర్కొనే శక్తి ఎక్కువమందిలో బాగా తక్కువగా ఉంది. ఇది చూశాక.. పూర్వకాలంలోలా సవాళ్లను ఎదుర్కొనే శక్తిని క్రమంగా సంతరించుకోవటానికి అవకాశమివ్వని ప్రస్తుత పోటీ ప్రపంచంలో వీరు తమకు నచ్చిన రంగంలోనైనా రాణించగలరా? అనే సందేహం కూడా కలుగుతుంది. సమస్య నుంచి పారిపోవటం కాకుండా ఎదుర్కోవాలనే దృక్పథం కొరవడటంతోపాటు, సమస్యను ఆచరణసాధ్యంగా పరిష్కరించుకునేందుకు కావలసిన విశ్లేషణా సామర్థ్యం కూడా 11% మందిలోనే మెరుగ్గా ఉందని తేలింది. విద్యార్థుల్లో రిస్క్‌టేకింగ్ లక్షణాలు పెంచేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన ప్రొఫెసర్ సూచించారు.

ఇది ప్రయోగాత్మక సర్వేనే అయినా.. ఈ సర్వే చేసింది బాగా చదువు చెబుతున్నారనుకుంటున్న కొన్ని మంచి స్కూళ్లలోనే. వీటిల్లోనే ఫలితాలు ఇలా ఉంటే, మిగిలిన పాఠశాలల్లో ఫలితాలు ఇంకా మెరుగ్గా ఉండే అవకాశాలు తక్కువ. కొవిడ్ సద్దుమణిగాక ముమ్మందు అన్ని పాఠశాలల్లో చేసే సైకోమెట్రిక్ పరీక్షల ఫలితాల గురించి వేచిచూద్దాం గానీ, అందులో తక్షణం పెద్ద భారీ తేడాలనైతే ఆశించలేమనుకోవచ్చు. మన సమాజంలో విశ్లేషణ, పరిష్కారంలో భాగమయ్యే ధైర్యం తక్కువగా ఉన్నాయనటానికి అనేక ఉదాహరణలు చుట్టూ (తెలుగునాటే కాకుండా దేశంలో కూడా) కనిపిస్తూనే ఉన్నాయి.


మన చుట్టుపక్కల అనేక వైఫల్యాలకు మూలం మనలో, మన యువతలో, రాబోయే తరాల్లో ఉన్న అధైర్యమనే లోపంలోనే ఉంది. దీనివల్లే ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ప్రజలుగా మనం మాత్రం నిరంతరం ఓడిపోతున్నాం. ఈ చొరవలేనితనాన్ని, పిరికితనాన్ని వదిలించుకుని కనీసం మన సమస్యలను, మన చుట్టూ ఉన్న సమస్యలను ఎదుర్కొనే, పరిష్కరించుకునే సానుకూల ధైర్యాన్ని మనం పెంపొందించుకోవటం, పెంపొందించటం అవసరం. అష్టలక్ష్మల్లో ధైర్యలక్ష్మి ఉంటేనే మిగతా లక్ష్ములూ లభిస్తాయని పెద్దలు ఎప్పుడో చెప్పారు. జాతీయ యువజన దినోత్సవానికి ఎవరి జన్మదినమైతే సంకేతంగా ఉందో ఆ వివేకానంద కూడా చెప్పారు. కానీ ఇప్పటిదాకా ఇది మన జాతిజీవనంలో భాగం కాలేదు. మన కుటుంబ వ్యవస్థలో, విద్యావ్యవస్థలో ఉన్న లోపాలు, చట్టబద్ధపాలన సక్రమంగా లేకపోవటం వంటివి ఇందుకు ప్రధాన కారణాలు. వీటిని తొలగించేందుకు అందరికీ నాణ్యమైన విద్యను అందించటం, చట్టబద్ధపాలన సక్రమంగా అమలయ్యేలా చేయటం, స్థానిక స్వయంపాలన మొదలైన అంశాల మీద మనం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలి. ఈ మౌలిక పనులన్నీ చేయాల్సిన ప్రభుత్వం.. అవి చేయకుండా ఏం చేస్తోందని నేతల్ని గట్టిగా నిలదీయాలి. ఏ పార్టీ అయినా మనకనవసరం. పాలకుల చేత ఆ పనుల్ని చేయించేలా పౌరులుగా మనకున్న ఓటుని, ఇతర హక్కుల్ని బాధ్యతతో, పరిజ్ఞానంతో వినియోగించుకోవాలి.

రాత్రికి రాత్రి సెలబ్రిటీలయ్యేవాళ్లు హీరోలని భ్రమపడవద్దు. మన బాధ్యతల్ని మనం నెరవేర్చే ధైర్యం లేకుండా మనకు ఎదిగే అవకాశాలు, నాయకత్వ గుర్తింపులు లభిస్తాయనుకుంటే అది ఎండమావే అవుతుంది, నియంతలు, దోపిడిదారుల పాలనలో మగ్గిపోవాల్సి ఉంటుంది. నిజాయతీ, చిత్తశుద్ధి, దూరదృష్టి, కష్టపడే తత్వం, సమాజానికి ఉపయోగపడటం.. ఇవి లేకుండా వచ్చే గుర్తింపులు తాత్కాలికమే. చెప్పాలంటే, ఇన్ని ఉన్నా కూడా గుర్తింపు తెచ్చుకోవటం పూర్వకాలంలోవారికంటే కూడా ఈకాలంలోవారికి మరీ కష్టం. గుర్తింపు కోసం పోటీ, ప్రమాణాలు ఒక రేంజిలో.. కొన్ని అంశాల్లో ప్రపంచస్థాయిలో కూడా ఉంటున్నాయి. అందుకే, అడ్డదారులు వెతకొద్దు, తాత్కాలిక ధోరణితో వ్యవహరించొద్దు. తాత్కాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుంటూనే దీర్ఘకాలిక దృష్టితో పనిచేస్తుంటే గుర్తింపు దానంతటదే వస్తుంది.

కాబట్టి, నిరాశను వీడి మితిమీరిన త్యాగాలు అవసరంలేని నిర్మాణాత్మక ధైర్యాన్ని ప్రదర్శిద్దాం, చుట్టూ ఉన్న పాలనను పార్టీలకతీతంగా మారుద్దాం, చదువులో, కెరీర్‌లో, సంపదలో ఎదుగుదాం, చుట్టూ ఉన్నవారికీ ఎదిగే అవకాశాలని కల్పిద్దాం, మంచి సమాజంలో హాయిగా బతుకుదాం!

# 31 ఏళ్ల క్రితం కూడా అదే లక్ష్యం, అదే తపన!

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను నిద్రలో లేపి అడిగినా రాజకీయ, పాలనా సంస్కరణల గురించి, దేశ భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్ గురించి గడగడ చెప్పేస్తారని తెలిసినవాళ్లంతా అంటుంటారు. ఆయన భావాల్ని చదివినవారికి, ప్రసంగాల్ని, చర్చా కార్యక్రమాల్ని చూసిన, విన్నవారికి కూడా ఇదే అభిప్రాయం కలుగుతుంది. ఆయనేమో నేను ఏ విషయాన్నీ పనిగట్టుకుని గుర్తుపెట్టుకోనని, కనీసం రాసింది కూడా గుర్తుంచుకోనని చెబుతుంటారు.



JP Narayan, Former IAS, Founder LokSatta

ఏదైనా అంశం మీద గతంలో ఒక వైఖరి తీసుకున్నారు, ఇప్పుడు స్టాండ్ మార్చారు వంటి విమర్శలు పలువురు నేతల మీద సోషల్ మీడియా వచ్చాక దాడిలాగా మారాయి. అయితే జేపీ చెప్పిన అంశాలు అర్థం కాక, లేక కొంతే అర్థమై కొందరు పొరబడిన సందర్భాలు మినహాయించి.. ఆయన మీద ఇలాంటి విమర్శలైతే రాలేదు. తాను గత సందర్భంలో ఏం చెప్పానో గుర్తు లేకపోయినా, తానెప్పుడూ మాట తప్పలేదని, ఇందుకు కారణం ఎప్పుడూ హేతుబద్ధంగా, వాస్తవాల ఆధారంగా, సమగ్ర దృష్టితో విధానాలను రూపొందించటమేనని జేపీ వివరిస్తారు. మౌలికాంశాలకు సంబంధించి తానెప్పుడూ వైఖరి మార్చుకోనని, పరిస్థితులకనుగుణంగా మారే అంశాలకు సంబంధించి మాత్రం అప్‌డేట్‌కనుగుణంగా పరిష్కారాన్ని మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తుంటానంటారు. ఇటువంటి సందర్భంలో కూడా ఎప్పటికీ మార్చుకోవాల్సిన అవసరంలేని మౌలిక ప్రమాణాలనే గీటురాళ్లుగా చేసుకుని ఫ్లెగ్జిబిలిటీ మార్పును ప్రజల ముందుంచుతానని చెబుతారు.

తన గమ్యం, గమనం పట్ల ఇలా నూటికి నూరుశాతం స్పష్టత ఉండటం వల్లే ప్రత్యేకించి గుర్తుపెట్టుకోకపోయినా.. జేపీ తాను రాసిన, చెప్పిన భావజాలం ఎక్కడైనా తనను ఉటంకించకుండా వచ్చినా కూడా వెంటనే గుర్తించగలుగుతారు. కొన్నేళ్ల క్రితం, లోక్‌సత్తా పార్టీని స్థాపించిన కొత్తలో 'దక్కన్ క్రానికల్' ఆంగ్లపత్రికలో ఒక వ్యాసం వచ్చింది. దాన్ని రాసినాయన చాలా పలుకుబడి గల వ్యక్తి. ఐఏఎస్‌గా ప్రధాని ఇందిరాగాంధీ వద్ద ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. తమిళనాడు, మహారాష్ట్ర, గోవా లకు గవర్నర్‌గా చేశారు. పీవీ నరసింహా రావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు డా॥ మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రి కావటంలో కీలక పాత్ర పోషించారీయన. 2002లో రాష్ట్రపతి పదవికి కూడా ఈయన పేరును పరిశీలించారు. ఇంత ప్రముఖ వ్యక్తి రాసిన ఆ వ్యాసాన్ని చదివాక లోక్‌సత్తా వాళ్లలో కూడా కొందరికి ఈ వాక్యాల్ని ఎక్కడో చదివినట్లుందే అన్న భావన కలిగింది. ఇవన్నీ జేపీ చెప్పినవే కదా అని వారు అనుమానం వ్యక్తం చేశారు. పదాలు సహా అంతా కాపీ కొట్టినా ఎక్కడా జేపీ పేరును ఉటంకించకుండా ఆ వ్యాసాన్ని పూర్తిగా తన భావాలన్నట్లు తన పేరుతో రాసుకున్నారాయన. దీన్ని జేపీ కూడా గమనించినా పట్టించుకోలేదు. ఆ తర్వాత ఒక విధాన పరమైన అంశం మీద వాదనలు వినిపించటానికి జేపీ ఢిల్లీలో పార్లమెంటరీ కమిటీ ముందుకు వెళ్లారు. ఆ కమిటీకి సదరు పవర్‌ఫుల్ పర్సనే ఛైర్మన్‌గా ఉన్నారు. కమిటీ ముందు జేపీ ఎవిడెన్స్ అనంతరం ఆయన చెప్పారట- జేపీ! మీ ఆలోచనల్ని మీరు రాసిన ఓ పత్రం నుంచి నేను కాపీ/చౌర్యం చేశాను, ఏమీ అనుకోవద్దు అని. ఈ విషయాన్ని 2011లో ఆయన మరణానంతరం ఎప్పుడో మాటల సందర్భంలో జేపీ తెలిపారు.

ఇప్పుడిదంతా ఎందుకంటే.. జేపీ మెంటార్‌గా పనిచేసే 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' (వైబీఐ) కార్యక్రమాల్లో బాధ్యతలు నిర్వహించిన ఒక యువకునికి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఓ పెద్దాయన నుంచి ఒక పాత న్యూస్ క్లిప్పింగ్ వాట్సాప్ ద్వారా వచ్చింది. 1989లో తూర్పు గోదావరికి కలెక్టర్‌గా జేపీ పాల్గొన్న ఒక కార్యక్రమాన్ని కవర్ చేసిన పేపర్ కటింగ్ అది. ఆ కటింగ్‌ను ఆయనేదో ఫైల్లో అప్పట్లో భద్రపరిచారు. ఇటీవల ఆ ఫైల్‌ను తీసినప్పుడు కనిపిస్తే వెంటనే క్లిప్పింగ్‌ని షేర్ చేసుకున్నారు. 'లోక్‌సత్తా ప్రారంభించటానికి ఎన్నో ఏళ్ల ముందు నుంచి కూడా జేపీ ఈ భావజాలాన్ని చెబుతున్నారని, దీన్ని సాకారం చేసే దిశగా ప్రజల్ని చైతన్యపరుస్తున్నారని తెలిసి చాలా ఆశ్చర్యం కలిగింది. జేపీ నాలుగున్నర దశాబ్దాలకు పైగా నూతన

భారతదేశ నిర్మాణమే సర్వస్వంగా పనిచేస్తున్నారని ఇప్పటిదాకా కొందరు పెద్దవాళ్లు చెబుతుంటే విన్నాం.. అలాగా, అనుకున్నాం గానీ, ఈ పేపర్ కటింగ్ చూశాక మాత్రం ఉద్వేగం కలిగింది. ఇన్నేళ్లుగా, ఇన్ని దశాబ్దాలుగా ఇంత భారీ, సంక్లిష్ట, సాహసోపేత లక్ష్యం కోసం అంతే తపనతో పనిచేయటం మా ఊహకు అందని విషయం. మా తరం పుట్టక ముందు సంస్కరణల ప్రయత్నాల్ని మొదలుపెట్టి, ఇప్పటికీ వాటి కోసం అలుపెరగకుండా పనిచేస్తున్న నాయకుడి నేతృత్వంలోనే యువకులుగా మేం పనిచేయటం చాలా థ్రిల్లింగ్‌గా కూడా ఉంది. జేపీ ప్రతిపాదించిన లక్ష్యాల్ని సాధ్యమైనంత త్వరగా సాధించేందుకు, ఆయన అందించిన అజరామర భావజాలాన్ని ముందు తరాలకు అందించేందుకు మా వంతు కృషి చేస్తాం' అని వైబీఐ యాక్టివిస్టు అన్నారు. 'జనబలం'లో ఈ అంశాల్ని ప్రచురిస్తే బాగుంటుందని సూచించారు. అందుకే.. కాలపరీక్షను తట్టుకుని నిలబడిన లోక్‌సత్తా భావజాలానికి అద్దం పట్టే ఆ కటింగ్‌లోని న్యూస్ కవరేజీని యధాతథంగా ఇక్కడ అందిస్తున్నాం.

**'దుష్టశక్తుల గుప్పిట్లో గిజగిజలాడుతున్న సమాజం.. కలెక్టర్ ఆవేదన' శీర్షికతో 1989, సెప్టెంబర్ 28న రాజమండ్రి డేట్‌లైన్‌తో ఓ తెలుగు పత్రికలో వచ్చిన వార్త ఇది:**

"దుష్టశక్తుల నుంచి సమాజాన్ని రక్షించడానికి మేధావులంతా మేల్కొని స్వాతంత్ర్య సంగ్రామం వంటి మరొక ఉద్యమాన్ని నడిపించవలసిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నొక్కిచెప్పారు. స్థానిక లయన్స్ క్లబ్, లయన్ లేడీస్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం రాత్రి ఇక్కడ జరిగిన ఒక సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం దేశంలోని అన్ని ప్రాంతాలలోను రగులుతున్న విద్వేషాగ్నికీలలు ఆలోచనాపరులను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆయన అన్నారు. ఐదారు వేల సంవత్సరాల అవిచ్ఛిన్నమైన నాగరికత, చరిత్ర, మహోన్నతమైన సంస్కృతికి వారసులమని చెప్పుకొనే మన సమాజంలో మరే ఇతర దేశంలోను లేనంత తీవ్రస్థాయిలో అహంకారం, అజ్ఞానం, రాక్షసత్వం, దౌష్ట్యం వంటివి ప్రబలుతున్నాయని, కులం, మతం, భాష వంటి విభేదాలు సంకుచితత్వానికి ప్రతీకలై సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా మహాత్మాగాంధీ జాతీయతాభావాన్ని కల్పించారని, అయితే దీన్ని దెబ్బతీసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన అన్నారు. యూరప్ దేశాలలో ఉన్న అవగాహన, కలయిక కేవలం ఒకే ఒక దేశమైన మనలో లేకుండా పోయిందని, ప్రతి మనిషి తన వ్యక్తిగత సమస్యలను కుల సమస్యగానో, మత సమస్యగానో, భాషా సమస్యగానో చిత్రించి అందరిపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నాడని, ఈ ధోరణి జాతీయతా భావాన్ని నిరంతరం కలుషితం చేస్తూ చాలా ప్రమాదకరమైన పరిస్థితులు తెచ్చిపెడుతున్నదని డాక్టర్ జయప్రకాష్ పేర్కొన్నారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే ముందుతరాల వారికి భవిష్యత్ ఉండదని ఆయన అన్నారు. దురదృష్టవశాత్తూ ఆలోచనాపరులైన వారంతా ఏమీ పట్టనట్లు వ్యవహరించడం వల్ల ఇటువంటి శక్తులు నానాటికీ పెరిగిపోతున్నాయని ఆయన చెప్పారు. ఒక పక్క చెడు విజృంభిస్తుండగా, సంస్కరణవాదం బలహీనంగా మారిందని, దేశంలో ఎక్కడ చూసినా వితండవాదం పెరిగి శాస్త్రీయదృక్పథం తగ్గిపోతున్నదని ఆయన అన్నారు. ఒక పట్టణంలో పౌర జీవనాన్ని స్తంభింపజేయడానికి పెద్ద ప్రయత్నమేదీ అవసరం లేకుండా, కేవలం పది మంది గూండాలతో ఆ పనిని పూర్తిచేసేయగలుగుతున్నారని, కొన్ని ప్రాంతాలలో ఒక వ్యక్తి ప్రజాజీవనంలో అడుగుపెట్టాలంటే అతను ఎన్నో హత్యలు చేయడం అర్హతగా మారిందని ఆయన అన్నారు. చట్టం, ధర్మం, న్యాయం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి వాటిని చెత్తకాగితాలుగా పరిగణించి వాటికి ఏమాత్రం అర్థం తెలియని వారు పాలకులు అవుతున్నారని డాక్టర్ జయప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. గూండాలు, సంకుచితత్వంతోపాటు మరో వంక చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోని విచిత్రమైన వ్యక్తుల నుండి కూడా అరాచకత్వం ప్రబలుతోందని ఆయన అన్నారు. పరిస్థితి


విజయవాడ 28.9.1989 గురువారం
# దుష్టశక్తుల గుప్పిట్లో గిజగిజలాడుతున్న సమాజం
కలెక్టర్ ఆవేదన

ఇదే విధంగా కొనసాగితే, కొంతకాలానికి దేశంలో మరొక రకమైన వాదం తప్పనిసరిగా ఉద్భవిస్తుందని డాక్టర్ జయప్రకాష్ అభిప్రాయపడ్డారు. 'స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అవసరం లేదు, భద్రత ఇవ్వండి చాలు' అని కోరే రోజు త్వరలో వస్తుందని ఆయన అంటూ, అయితే ఆనాడు మనం సగర్వంగా చెప్పుకొనే సంస్కృతి, చరిత్రలకు అర్థం ఉండదని చెప్పారు. ఈ దృష్ట్యా సమాజంలో పౌరులు ముందుగా తమ బాధ్యతలను గురించి ఏమి చేయాలనే ఆలోచన ప్రారంభించవలసి ఉన్నదని కలెక్టర్ తెలిపారు. మేధాశక్తి, చిత్తశుద్ధి, విజయాల నుంచి స్ఫూర్తి పొందే వ్యక్తులకు ఈ దేశంలో కొరత లేదని, ఇటువంటి వారు చేవచచ్చి కూర్చోకుండా ధైర్యంగా ముందుకు వస్తే నిస్సందేహంగా ఈ సమాజాన్ని మార్చవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఇందుకు అవసరమైతే స్వరాజ్య పోరాటంలో మన పూర్వీకులిచ్చిన త్యాగాలను ఆదర్శంగా తీసుకుని అంతటి త్యాగాలకు సిద్ధపడిననాడు, కనీసం మరో రెండు దశాబ్దాలకాలంలోనైనా మన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోగలమని డాక్టర్ జయప్రకాష్ అభిప్రాయపడ్డారు."

## రైతుల ఆదాయాన్నిపెంచే సమగ్ర సాగు సంస్కరణల

# రోడ్‌మ్యాప్‌ని ప్రకటించాలి: జేపీ

తాకట్టులో భారతదేశం అనే తరహా పరిస్థితుల్లో ప్రధానమంత్రి బాధ్యతల్ని స్వీకరించిన పీవీ నరసింహారావు దేశ ఆర్థిక సామర్థ్యాల్ని ఆవిష్కరించేందుకు స్వేచ్ఛా వాణిజ్య విధానాలకు నాంది పలికారు. ఉంటుందో, ఊడుతుందో తెలియనిరీతిలో ప్రతిరోజూ ఊగిసలాడే ప్రభుత్వంతోనే అందరినీ ఒప్పిస్తూ పారిశ్రామిక రంగంలో లైసెన్స్ – పర్మిట్ రాజ్‌ను కూలదోశారు, మార్కెట్ ఆంక్షలను తొలగించారు. దానివల్ల ఉపాధి, ఆదాయపరంగా, సాంకేతికత, సౌకర్యాలపరంగా భారతదేశం ఎంతో లాభపడింది. అదేసమయంలో సంస్కరణలను సమ్మిశ్రితంగా అమలు చేసే ఏర్పాట్లు, అందులో ప్రభుత్వం తన పాత్రను పోషించటం లోపించటం దేశానికి పెద్ద వైఫల్యంగా పరిణమించాయి. వ్యవసాయరంగంలో లైసెన్స్ – పర్మిట్ వ్యవస్థను తొలగించలేకపోవటం ఇంకో పెద్ద వైఫల్యానికి దారితీసింది. పారిశ్రామిక రంగంలో సరళీకృత ఆర్థిక సంస్కరణల్ని అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని పాత చట్రంలోనే కొనసాగించటం వల్ల వ్యవసాయ – వ్యవసాయేతర రంగాల్లో ఆదాయపు అంతరం 6 రెట్లుకి పెరిగింది. పార్లమెంట్‌లో హామీ ఇచ్చి కూడా నాటి ప్రభుత్వం వ్యవసాయంలో మార్పులు తేలేక పోయింది. ఒక పరిశ్రమ యజమానిలాగా రైతు తన ఉత్పత్తిని తనకు నచ్చిన చోట ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకునే అవకాశం లేకుండా సంకెళ్లను అలాగే కొనసాగించారు. పక్క జిల్లాలో కూడా రైతు అమ్ముకోకూడదన్నారు. భారతదేశ దశ, దిశను మార్చే చరిత్రాత్మక మార్పుల్ని ప్రపంచమే అబ్బురపడే రీతిలో సాధించిన పీవీ తన తర్వాతి ప్రభుత్వాలకు వదిలిపెట్టిన ఈ రెండు వైఫల్యాలూ ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలు, బలమైన స్థానిక ప్రభుత్వాలతో మూడో అంచె ఫెడరలిజం, రైతుకు ఆదాయం లక్ష్యంగా వ్యవసాయ విధానాలు మొదలైనవి.. నెహ్రూ నుంచి మోదీ హయాం వరకూ అమలుకు నోచుకోలేదు. పరిస్థితుల ప్రాబల్యంతోనే అయినా స్వతంత్రం వచ్చి డెబ్భై ఏళ్లు దాటాక రైతుల సంకెళ్లను కొంతమేర తొలగించి, కొంత వెసులుబాటు కల్పించేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం 2020లో కొన్ని వ్యవసాయ చట్టాలను తీసుకొస్తే వాటి చుట్టూ అపోహల్ని పెంచి యధావిధిగా రైతుకు నష్టం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఒక ఐఏఎస్ అధికారిగా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ భూసేకరణలో, ప్రకాశం, తూర్పు గోదావరి జిల్లాల్లో, ముఖ్యమంత్రి కార్యాలయం, సహకార పరపతి సంస్థలు తదితరాల్లో నిర్వహించిన బాధ్యతల్లో రైతుల ఆదాయం కోసం అసాధారణ కృషి చేయటంతోపాటు.. ఆ అనుభవాలను మన దేశంలో,



ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన విధానాలతో సమన్వయం చేస్తూ లోక్‌సత్తా రాజకీయ ఉద్యమంలో నూతన వ్యవసాయ విధానంగా పలు కార్యక్రమాల్ని నిర్వహించి ఫలితాలను సాధించిన ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ నూతన చట్టాలు, సాగులో మిగిలిన విధాన మార్పుల కోసం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. కొత్త చట్టాలతో అద్భుతాలు జరగవుగానీ, రైతులకు మెరుగైన ఆదాయాన్ని అందించటానికి ఇవి తొలి అడుగులని స్పష్టం చేస్తున్నారు. పక్క రాష్ట్రంలో రేటు ఉన్నా కూడా రైతులు అక్కడికెళ్లి అమ్ముకోకూడదు అనే మార్కెట్ ఆంక్షలకు వ్యతిరేకంగానే 2012లో రైతు సత్యాగ్రహ యాత్రతో వేలాదిమందిని పార్టీలకతీతంగా సమీకరించి కర్నూలు నుంచి కర్నాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు బియ్యం మూటల్ని భుజాల మీద తీసుకెళ్లి జేపీ అమ్మారు. దానివల్ల అప్పుడు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లోని రైతులకు ఒక్క సీజన్‌లో ఒక్క బీపీటీ ధాన్యానికి దాదాపు రూ.3,600 కోట్ల లాభం దక్కింది. అందుకే 2020లో పార్లమెంటు ఆమోదించిన 'వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార వాణిజ్య ప్రోత్సాహక, సౌకర్యాల కల్పన (స్వేచ్ఛాయుత మార్కెట్), రైతుల సాధికారత, రక్షణ – ధరల హామీ, వ్యవసాయ సేవల ఒప్పందాలు (కాంట్రాక్టు వ్యవసాయం), నిత్యావసర వస్తువుల చట్ట సవరణ (నిల్వలపై పరిమితుల ఎత్తివేత)' చట్టాలపై రైతుల్లో, పౌర సమాజంలో, రాజకీయ పార్టీల్లో అపోహల్ని తొలగించేందుకు వివిధ కార్యక్రమాల ద్వారా జేపీ విస్తృత ప్రయత్నం చేస్తున్నారు. రైతుల కోసం దశాబ్దాల బహుముఖ కృషి చేసిన జయప్రకాష్ నారాయణ్ నూతన వ్యవసాయ చట్టాల నేపథ్యంలో చెప్పిన అంశాల్లో కొన్ని..

▶▶ నూతన వ్యవసాయ చట్టాలతో విప్లవం వచ్చేస్తుందన్నట్లు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చేసిన ప్రచారం వల్ల విపక్షాలు ప్రతికూలంగా ప్రతిస్పందించాయి. నిజానికి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే అధికారంలో ఉన్నప్పుడే ఈ చట్టాలకు మార్గదర్శకాలను తయారు చేసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు

ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా వ్యవహరించటం బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలూ చేశాయి. ఈ మితిమీరిన పార్టీ రాజకీయాల వల్ల పంజాబ్ లాంటి చోట రైతుల్లో అపోహలు పెరిగాయి. ఢిల్లీ వద్ద రైతులు చేసిన ఆందోళన ప్రధానంగా పంజాబ్, హర్యానా ప్రాంతంలోని ఒక వర్గం రైతులకు సంబంధించినది. రైతుల వేదన, కష్టం, సంక్షోభం నిజమైనవి. కేంద్ర ప్రభుత్వం రైతుల ఆందోళనను కించపరచకుండా వారి అపోహల్ని తొలగించాలి. ఈ చట్టాలకు కొనసాగింపుగా శీతల గిడ్డంగులు, తక్కువ రేటుకి రైతులు పంటను తెగనమ్ముకోవాల్సిన అవసరం లేకుండా నిల్వ చేసిన పంట ఆధారంగా ప్లెడ్జి రుణాలు అందించటం (తక్షణం ఇందుకు రూ.లక్ష కోట్లు కేటాయించాలి), మార్కెట్ యార్డుల ప్రక్షాళన, సహకార పరపతి, మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయటం, ధరల స్థిరీకరణ నిధి, వ్యవసాయ, అనుబంధ ప్రాసెసింగ్ యూనిట్లు, రిటైల్ చెయిన్లు, పరిశోధనల్ని ప్రోత్సహించటం తదితర అంశాల అమలు కార్యాచరణతో స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ని ప్రభుత్వం ప్రకటించాలి.. తమ ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్న వాస్తవాన్ని తెలియజేసి రైతులకు భరోసాని కలిగించాలి.


▶▶ఎంఎస్‌పీ (కనీస మద్దతు ధర)కి, ఈ చట్టాలకు సంబంధం లేదు. అపోహల వల్లే ఎంఎస్‌పీ గురించి ఆందోళనలు.

▶▶మనం అత్యధికంగా సేకరిస్తున్నటువంటి ఆహారధాన్యాలుగానీ, వ్యవసాయోత్పత్తులుగానీ బియ్యం, గోధుమలు. బియ్యంలో 34% ప్రభుత్వం సేకరిస్తున్నది, గోధుమల్లో 31% సేకరిస్తున్నది. మిగతా వన్నీ.. ఉదాహరణకు మొక్కజొన్న 0.17%. ఒక్క శాతంలో ఆరో వంతు. దేశ ఉత్పత్తిలో 600వ వంతు. రెండోది, మార్కెట్ రేటు కంటే ప్రకటించిన ఎంఎస్‌పీలు మిగతా అన్ని పంటల్లో ప్రకటించిన సందర్భాల్లో నూటికి 95 సందర్భాల్లో మార్కెట్ రేటు కంటే తక్కువ.

▶▶నిజంగా వ్యవసాయంలో ఎవరికి ఇబ్బంది ఉంది? మెట్టప్రాంతాల రైతులకి. మన రాగి గానీ, సజ్జ గానీ, జొన్న గానీ.. ఇవీ అసలు ప్రధానమైనవి. అవన్నీ నాశనం చేశారు ప్రభుత్వాల విధానాలతో. మొక్కజొన్న-0.17%, సజ్జ-0.39%, కొన్ని పప్పులు-0.54%, ఆవాలు0.59%, జనపనార-0.69%.. అన్నీ ఒక్క శాతం కంటే తక్కువ సేకరణే. సోయాబీన్-0.66%, పత్తి-1.75%, పొద్దుతిరుగుడు-3%. ఇదీ ఎంఎస్‌పీ డ్రామా. ఏదో అద్భుతం జరుగుతోంది, గొప్ప మద్దతు ధర ప్రకటిస్తున్నారు, కొనేస్తున్నారు అనేది పచ్చి అబద్ధం.

▶▶కేవలం రెండంటే రెండు పంటలు, మనం క్రమంగా వినియోగం తగ్గిస్తున్న పంటలు.. బియ్యం, గోధుమలకు మాత్రమే, అది కూడా కొంత శాతం మాత్రమే ఎంఎస్‌పీ అందుతోంది. రోజురోజుకీ డిమాండ్ పెరుగుతున్న పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, మాంసం, చేపలకు ఎటువంటి ప్రోత్సాహకాలూ లేవు. బియ్యం, గోధుమల్ని మాత్రమే మద్దతు ధరతో సేకరిస్తుండటం.. భారత్‌లో డిమాండ్ పెరుగుతున్న ఇతర ఆహారపదార్థాలకు అందాల్సిన ప్రోత్సాహాన్ని దెబ్బతీసింది. మనం ఈ వాస్తవాల్ని గమనించాలి.

▶▶రైతు ఉద్యమాల్లో రెండు రకాలున్నాయి. ఒకటి ప్రభుత్వం



తాయిలాలు ఇవ్వాల్సిందేనంటూ నిరంతరం చేయిజాచి తీసుకునే రకం. ఇది మహేంద్ర తికాయత్ మోడల్. రెండోది, రైతులకు ఆదాయాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచేది. ఇది శరద్‌జోషి నమూనా. ఈ రెండో నమూనాయే వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూ రైతుకు లాభాన్ని, దేశానికి అభివృద్ధిని అందించేది.

▶▶వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ)ల చట్టం గుత్తాధిపత్యాన్ని సృష్టించటంతోపాటు అసమర్థమైన, లొసుగులమయమైన ఓ అవ్యవస్థను తయారుచేసింది.

▶▶నిత్యావసర వస్తువుల (ఈసీ) చట్టమంత దుర్మార్గమైనది రైతుల పట్ల ఇంకోటి లేదు. నేను కలెక్టర్‌గా అమలు చేసిన అనుభవంతో చెబుతున్నాను.

▶▶దేనికోసమయితే ఈసీ చట్టాన్ని తెచ్చామని చెప్పారో, దానికి విరుద్ధమైన ఫలితాలు దాని నుంచి వచ్చాయి. సరకుల నిల్వ చేసుకోవటం, విలువ జోడింపు వంటి వాటికి ప్రోత్సాహం లేకుండా పోయింది. చివరికి ఇది ధరల్లో తీవ్ర ఒడిదుడుకులకు దారితీసింది. కేంద్ర ప్రభుత్వం వెలువరించిన 2019-20 ఆర్థిక సర్వేలోని వివరాలు, గణాంకాలే ఇందుకు సాక్ష్యం.

▶▶కాంట్రాక్ట్ వ్యవసాయంతో ఎటువంటి ఆంక్షలు లేని ఆలుగడ్డలు రైతుకు, వినియోగదారునికి లాభసాటిగా ఉంటే.. ఆంక్షలను అమలు చేస్తున్న ఉల్లిగడ్డల విషయంలో రైతులు, వినియోగదారులూ ఇద్దరూ నష్టపోతున్నారు. కాస్త రేటు పెరగ్గానే ఉల్లిపై నిషేధం విధిస్తూ రైతు నడ్డి విరుస్తున్నారు. వినియోగదారుల్లో డిమాండ్, పెట్టుబడిపై స్పష్టత, నిల్వ సౌకర్యాలు ఉంటే ధరలు నిలకడగా ఉంటాయనేది ఆర్థిక శాస్త్రంలో ప్రాథమిక సూత్రం. ఇది కూడా గుర్తించకుండా గుడ్డిగా వాదించటం రైతులకు, దేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థలకు తీవ్ర నష్టం చేయటమే.

▶▶మన దేశంలో ఇటీవల బహిరంగ చర్చ ప్రమాణాలు, పార్టీల మధ్య సుహృద్భావం తగ్గింది. దేశ ప్రయోజనాల కోసం మౌలిక అంశాలపైనైనా కలిసి పనిచేద్దాం, ఒప్పిద్దాం అనే ధోరణి కొరవడింది. సంప్రదింపులతో, పార్లమెంటులో ఇతర పార్టీల్ని కూడా ఒప్పించి చట్టాల్ని చేసి ఉంటే అపోహలకు అవకాశం ఉండేది కాదు. కానీ అధికార పార్టీ ఆధిపత్య ధోరణితో ఆమోదించింది కాబట్టి దేశాభివృద్ధికి ఉపయోగపడే చట్టాలను సైతం తోసిపుచ్చుతామంటే అది సరికాదు. రైతుల భుజాల మీద తుపాకి పెట్టి కాల్చే రాజకీయం మారాలి.

▶▶పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఇష్టమొచ్చినట్లు చేసుకోవచ్చు.

సేవారంగంలో ఉన్నవాళ్లు.. ఒక డాక్టరో, లాయరో ప్రాక్టీస్ చేయాలా వద్దా అని చెబుతున్నామా? ఇష్టమున్నవాళ్లు చేస్తారు, ఇష్టం వచ్చిన స్పెషలైజేషన్ చేస్తారు. రైతుకి మాత్రమే సంకెళ్లు కావాలా?

▶▶దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీ భారతదేశానికి వచ్చాక జాతీయోద్యమంలో భాగంగా చేసిన మొట్టమొదటి ఉద్యమం చంపారన్ సత్యాగ్రహం. రైతులకు ప్రభుత్వం వేసిన సంకెళ్లు తెంచటానికే గాంధీ గారు ఈ పోరాటం చేశారన్న సోయి అయినా ఉండాలిగా మనకి.

▶▶1984 సంవత్సరంలో పత్తి రేటు రూ.600 - 700 నుంచి కాస్త పెరిగి 1000 దాటి వస్తోంది. ఆ రోజుల్లో క్వింటాలుకు రూ.1500 మంచి రేటు. హమ్మయ్య, ఈ సంవత్సరం రైతులు బాగుపడతారు అనుకుంటుండగానే, ఆనాటి ప్రధాన మంత్రి ఒక ప్రకటన చేశారు. ప్రపంచ దేశాల్లో పత్తికి మన కంటే రేటు ఎక్కువ ఉంది అప్పుడు. రేటు ఎక్కువ ఉన్నా కూడా భారతదేశానికి కొన్ని లక్షల బేళ్లు పత్తి దిగుమతి చేసుకుంటున్నాం అన్నారు. పత్తి ఇంకా ఒక్క బేలు కూడా రాకుండానే మర్నాటికి రూ.1600 రేటల్లా 800కి పడిపో యింది. అంటే ఒక కలం పోటుతో, ఒక ప్రధానమంత్రి మాటతో లక్షల మంది రైతుల బతుకుల్ని నాశనం చేశాం.

▶▶రైతు పండించిన పంటనంతా ప్రభుత్వమే కొని నిల్వ చేయటం ప్రపంచంలో ఎక్కడా జరగలేదు, మన దేశంలోనూ సాధ్యం కాదు. గతంలో ఒకసారి ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ధాన్యం కొనుగోళ్లను జాతీయం చేసి ప్రభుత్వం తప్ప ఎవ్వరూ కొనకూడదని శాసించారు. కొన్ని వారాల్లోనే లెంపలేసుకుని మళ్లీ జాతీయీకరణని ఎత్తివేశారు. భారత్‌లో మొత్తం వ్యవసాయోత్పత్తుల వ్యయం ఏటా రూ.30 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. దేశ బడ్జెట్ కంటే కూడా ఎక్కువైన ఇంత మొత్తాన్ని వ్యవసాయ కొనుగోళ్ల కోసం వెచ్చించటం ఏ రకంగా సాధ్యం?

▶▶వ్యవసాయ రంగంతో దేశ ఆహార భద్రత కూడా ముడిపడి ఉంది కాబట్టి రైతు భద్రతను, దేశ ఆహారావసరాలను సమన్వయం చేసేలా వ్యవహరించాలి. దేశ ఆహారావసరాలకు కావలసిన ధాన్యాల్ని వ్యూహాత్మక నిల్వ కోసం (ఇప్పుడున్న నిల్వల్లో మూడో వంతు సరిపోతాయి. ప్రస్తుతం దాదాపు 8 కోట్ల టన్నుల వరి, గోధుమ ఆహారావసరాల పేరుతో గిడ్డంగుల్లో మూలుగుతున్నాయి. ఇవి ముక్కిపోతున్నాయి, పందికొక్కుల పాలవుతున్నాయి. ఎఫ్‌సీఐలో కీలక పోస్టింగ్‌కు కోటి రూపాయల రేటు పలుకుతోందంటే అక్కడేం జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు) సేకరించి మిగిలిన ఉత్పత్తులను రైతు ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను కల్పించాలి.

▶▶మనదేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడైనా వ్యవసాయం క్లిష్టమైన, నష్టప్రమాదం పొంచి ఉన్న వృత్తి. అయినా కూడా తగిన సంస్థాగత ఏర్పాట్లు, సరైన విధానాలు ఉంటే వ్యవసాయంలో లాభాలకు కూడా అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రత్యామ్నాయంతో వ్యవసాయాన్ని పూర్తిగా తొలగించటం కూడా సాధ్యం కాదు. వ్యవసాయమే నాగరికతకు పునాది. వ్యవసాయంతోనే ఆహార భద్రత. వ్యవసాయమే పరిశ్రమలకు ముడిసరుకుల్ని ఇస్తుంది, ఇంధన వనరుగా కూడా



ఉపయోగపడుతుంది. అందుకే రైతుకు న్యాయమైన ధర లభించేలా సంకెళ్లు తెంచటంతోపాటు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేందుకు రైతుకు అవసరమైన సబ్సిడీలను అన్ని రకాలుగా అందించాలి.

▶▶భారతదేశం మొత్తం భూమి విస్తీర్ణం తీసుకుంటే, 32 లక్షల 80 వేల చదరపు కిలోమీటర్లు. అడవులు, పట్టణాలు, గ్రామాలు, ఆవాసాలు, నదులు, వంకలు, డొంకలు, సాగు భూమి.. మొత్తం అన్నీ కలిపి. దాన్లో సగం వ్యవసాయ భూమే. నిజానికి సగం కంటే ఎక్కువ ఉంది కొన్ని సందర్భాల్లో. ప్రపంచంలో ఎక్కడా కూడా ఒక పెద్ద దేశంలో సగం వ్యవసాయ భూమి ఉండటమనేది ఊహించటం కూడా సాధ్యం కాదు. అమెరికాలో అడపాదడపా మన కంటే ఎక్కువగా, మనతో సమానంగా వ్యవసాయం చేసే భూమి ఉంటుంది. చైనా మన తర్వాత అతిపెద్ద దేశం వ్యవసాయంలో. మనకి 16 కోట్ల హెక్టార్ల భూమి వ్యవసాయంలో ఉంటే, చైనాకి 10 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. మనకంటే ఓ 40-50 శాతం తక్కువ. మన భూములు కూడా సారవంతమైనవి. ఉదాహరణకి గంగ వల్ల గానీ, గోదావరి వల్ల గానీ తీరప్రాంతాల్లో చుట్టూ ఒండ్రు మట్టి వగైరాలు శతాబ్దాల పర్యంతం కొట్టుకు వచ్చి సారవంతమైన భూములు ఏర్పడ్డాయి. చక్కటి వర్షపాతం.. కొన్ని సందర్భాల్లో ఒడిదుడుకులున్నా కూడా. సంవత్సరం పొడవునా సూర్యకాంతి. చాలా దేశాల్లో సూర్యకాంతి ఉండదు. వద్దన్నా కూడా ఎండ ఉంది మనకి. ఇవన్నీ ఉన్నా కూడా మన స్థానం ఈవేళ ప్రపంచ వ్యవసాయ వాణిజ్యంలో కేవలం 2.3%. ఉదాహరణకి పండ్లు, కూరగాయల్లో ప్రపంచంలో మనం నెంబర్‌వన్, టూ స్థానాల్లో ఉంటాం ఉత్పత్తిలో. కానీ ప్రపంచ మార్కెట్లో మన వాటా, మామిడిపళ్లు కావచ్చు, దానిమ్మ, కూరగాయలు కావచ్చు.. కేవలం 1.7%. అట్లాగే బొప్పాయి ఉత్పత్తిలో ప్రపంచంలో మనమే నెంబర్‌వన్. కానీ ప్రపంచ మార్కెట్‌లో మన స్థానం 3 శాతం. నిమ్మ.. ఉత్పత్తిలో మనం ప్రపంచంలో నెంబర్‌వన్. కానీ ప్రపంచ మార్కెట్‌లో మన స్థానం అరశాతం. 1 శాతంలో సగం. అలాగే ఆరెంజ్. బత్తాయిలు ప్రపంచంలో చాలా పెద్ద మార్కెట్ అయినా, మనం ఉత్పత్తిలో అగ్రగామి అయినా కూడా మన వాటా 0.3%. అంటే 1 శాతంలో మూడోవంతు కంటే తక్కువ. ఎందుకట్లా ఉంది? ఎందుకంటే, రైతుకి మనం సంకెళ్లు విధించాం. ఉత్పత్తి చేస్తున్నా కూడా సంకెళ్లు విధించాం. అమ్ముకునే స్వేచ్ఛ లేదు, నిల్వ చేసుకునే స్వేచ్ఛ లేదు, గిడ్డంగులు లేవు, మౌలిక సదుపాయాలు లేవు,

## ప్రభుత్వం గోరంతచేసి...
## కొండంత చూపించుకోవటంవల్లే ఈ వ్యతిరేకత



## వ్యవసాయ చట్టాలతో ప్రయోజనాలను రైతులకు వివరించి, అపోహలు పోగొట్టాలి

అదనపు విలువ చేకూర్చే ప్రాసెసింగ్ ఇండస్ట్రీ దాదాపు లేదు.

కొన్ని సందర్భాల్లో మన కాళ్లకు మనమే సంకెళ్లు వేసుకుని ఎగుమతుల్ని నిషేధించాం మూర్ఖంగా. ఉదాహరణకి ఇప్పుడు ఉల్లిపాయల ఎగుమతుల్ని నిషేధించారు. ఆర్నెల్ల క్రితం ఉల్లిపాయలు కిలో 2 రూపాయలకు అమ్ముడుపోయినై. మనం కూడా హైదరాబాద్‌లో మన ఇళ్ల వద్దే కిలో ఐదు, పది రూపాయలకు కొన్నాం. రైతుకి ఇంత నష్టం వాటిల్లుతున్నా ఒక్క ప్రభుత్వం పట్టించుకోలేదు. గమనించామా? కానీ ఆ తర్వాత ఒక్క పదిరూపాయలు ధర పెరిగింది అనగానే, ఉల్లి ఎగుమతుల్ని నిషేధించారు. అంటే మన చట్టాలు, విధానాలు, పద్ధతులు అన్నీ కూడా రైతుల్ని ఎలాగ చావకొట్టాలె, రైతుకు రేటు రాకుండా ఎట్లా చెయ్యాలె, కానీ రైతుబాంధవులుగా ఎట్లా నటించాలె అనే విధంగానే ఉన్నాయి. మళ్లీ రైతులు ఓట్లు కావాలిగా! ప్రతి పార్టీ, ప్రతి నాయకుడు మేము రైతుపక్షం, నేను రైతుని, రైతు కుటుంబం నుంచి వచ్చాను అని మాటలు.. చేతలన్నీ మాత్రం రైతు వ్యతిరేకమే. నేను గణాంకాలతో చెబుతున్నాను.

అంతర్జాతీయ మార్కెట్‌లో మన బియ్యానికి రేటు బ్రహ్మాండంగా ఉంటే, దేశంలో గుట్టలుగుట్టలుగా కోట్ల టన్నులు మూలుగుతూ ఉంటే, రేట్లు పడిపోతే, ఎగుమతుల్ని నిషేధించింది జాతీయస్థాయి ప్రభుత్వం. ప్రపంచంలో ఏ దేశమైనా మార్కెట్‌లో రేటు ఉంటే, తన రైతులకు లాభాలొచ్చేలా అమ్ముకునే మార్గమెట్లా అని ఆలోచిస్తుంది. మన దేశం మాత్రమే రైతులను కుంగదీసేలా వ్యవహరించింది. దీనిపై నేను 2011 ఏప్రిల్ 27న అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో సమావేశమై గట్టిగా వాదిస్తే అప్పుడు ఎగుమతులకు అనుమతులనిచ్చారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా బియ్యం ఎగుమతుల్లో భారతదేశం నెంబర్‌వన్ ఎక్స్‌పోర్టర్‌గా కొనసాగుతోంది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే ఉత్పత్తి గణనీయంగా ఉంది.

ఇప్పటికే 65 శాతానికి పైగా రైతులు మార్కెట్ యార్డుల బయటే అమ్ముకుంటున్నారు. అయితే చట్టవిరుద్ధంగా అమ్ముకుంటున్నారు. అయినా కూడా మార్కెట్ సెస్ కట్టాలి. మార్కెట్ యార్డుతో సంబంధం లేకున్నా సెస్ కట్టాలి. ఇప్పుడు ఈ చట్టాల ద్వారా ఏమంటున్నారంటే.. మార్కెట్ యార్డు బాగుంటే అక్కడ అమ్ముకోండి, పక్కూళ్లో బాగుంటే అక్కడ అమ్ముకోండి, పక్క రాష్ట్రంలో బాగుందా అక్కడ అమ్ముకోండి, హోల్‌సేలర్ మంచి ధర ఇస్తున్నాడా అక్కడ అమ్ముకోండి, ఎలక్ట్రానిక్‌గా అమ్ముకుంటారా అక్కడ అమ్ముకోండి, ఎగుమతిదారుడు కొనుక్కుని అమ్ముతాడా అక్కడ అమ్ముకోండి. మార్కెట్ యార్డుల్లో ప్రభుత్వాలు బాగా చేయకున్నా రైతులు అక్కడికి ఎందుకు రావాలి?

ఒకళ్లకి బలవంతంగా అమ్మటం, ఎక్కడ నిలవ ఉంచాలో, నిలవ ఉంచకూడదో వాళ్లు చెప్పటం, అడుగడుగునా ప్రభుత్వంలో ఉన్నవాళ్లకి లంచాలివ్వటమూ, వాళ్లు చెప్పినప్పుడు అమ్మటం, చెప్పిన రేటుకే అమ్మటం.. దీని స్థానంలో మార్కెట్‌లో ఎక్కడ అవకాశముంటే అక్కడ అమ్ముకోవటం ఈ చట్టాలతో సాధ్యమవుతుంది. కొన్ని చోట్ల పంజాబ్, హర్యానాల్లో మండీలు చాలా బాగా నడుస్తున్నాయి. నేను స్వయంగా చూశాను. మండీ యాక్ట్ అని సర్ చౌతారాం అనే వ్యవసాయ మంత్రి ఎప్పుడో స్వతంత్రం వచ్చిన తొలికాలంలో ప్రతాప్‌సింగ్ కైరానా ముఖ్యమంత్రిగా ఉండగా చాలా ముందుచూపుతో తీసుకొచ్చారు. పంజాబ్, హర్యానాల్లా మార్కెట్ యార్డులు బాగా పనిచేస్తూ మంచి రేటు వచ్చిందనుకోండి, అక్కడే అమ్ముకుంటాం.

ఒకళ్లకి బదులు 10 మంది ఉంటే కొనేవాళ్లు ఉంటే, 10 మంది కొనేవాళ్ల మధ్య పోటీ ఉంటే, లాభమా, కాదా? ఏ వస్తువైనా సరే, మీరు మాస్కులు తయారుచేసినా సరే, లేకపోతే బీడీ చుట్టలు తయారుచేసినా సరే పోటీ ఉంటే బేరమాడి లాభం పొందే అవకాశముంటుందా, ఒకేచోట అమ్మాల్సిందే అంటే లాభం వచ్చే అవకాశముంటుందా? బీడీ చుట్టలు తయారుచేసే కార్మికురాల్ని, ఇంట్లో కుటీర పరిశ్రమలో ఏదైనా వస్తువు తయారుచేసే వారిని అడగండి. కొత్త చట్టాల వల్ల అద్భుతాలు జరగవు, ఎంత ధర వస్తుందో కూడా ఎవరూ గ్యారంటీ ఇవ్వలేరు.. కానీ నష్టం రాదని, గతం కంటే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని మాత్రం కచ్చితంగా చెప్పగలం.

మార్కెట్ యార్డుని ఉపయోగించుకుంటే రైతులారా మార్కెట్ సెస్ కట్టండి. దాంతోపాటు మార్కెట్ మీ చేతుల్లోకి రావాలి. మీరు సెస్ ఇచ్చి మార్కెట్ యార్డుని పోషిస్తుంటే, అది మీకు ఉపయోగపడుతుంటే నిర్ణయాలు ఎమ్మెల్యే చేయటమేంటండీ? నిర్ణయాలు ముఖ్యమంత్రి, మంత్రి చేయటమేంటండీ? సంబంధమేంటి? అందులో రాజకీయం చొప్పించటమేంటి? మీరు ఎన్నుకున్న మనిషి అక్కడ నిర్వహణ చేయాలి. కాబట్టి ఈ చట్టాల వల్ల వచ్చేదేంటంటే, మీకు కొంతమేరకు ఈ సంకెళ్లు తొలగుతాయి. మిగతా రంగాలతోపాటు, పారిశ్రామిక, సేవా రంగాల్లాగా వ్యవసాయంలో ఉత్పత్తి చేసే రైతులకు కూడా ఆర్థిక స్వేచ్ఛ వస్తుంది. అంతమాత్రం చేత మన కడగండ్లు తొలగిపోవు. రైతుకి మార్కెట్‌లో అమ్మే ప్రతి పంటకీ కనీసం 65% అందే ఏర్పాటు జరగాలి. అంటే రిటైల్ చైన్స్ పెద్దఎత్తున రావాలి. పెద్దఎత్తున ప్రాసెసింగ్ రావాలి. లక్షల కోట్ల పెట్టుబడులు గ్రామీణ ప్రాంతాలకు రావాలి వ్యవసాయ, అనుబంధ రంగాల్లో. ఎగుమతుల రంగంలో మనకు స్థానం లభించాలి. దానికోసం గట్టిగా పోరాడాలి.

దిగుమతుల మీద కొంతమేరకు నియంత్రణ పెట్టి దిగుమతుల సుంకాల డబ్బు రైతుల చేతికి వెళ్లాలి. ప్రభుత్వ ఖజానాలకి మళ్లటం కాదు. దేశంలో బియ్యం, గోధుమలు కోట్ల టన్నులు నిల్వలో కుళ్లిపోతుండగా, పౌష్టికాహారానికి కీలకమైన ఆహారం పప్పుధాన్యాలను మాత్రం దిగుమతి చేసుకుంటున్నాం. భారతదేశంలో మాంసాహారం తినేవాళ్లలో కూడా ఎక్కువమంది మాంసం తినేది వారానికి ఒక్కసారే. కాబట్టి ప్రధానంగా

మాంసకృత్తులు వచ్చేది పప్పుల నుంచి. పప్పులు, వంటనూనెలు ఈ రెంటికీ ప్రపంచంలో అతిపెద్ద దిగుమతిదారు భారతదేశం. ఆ పంటలకు ప్రోత్సాహం లేదు. దిగుమతుల్ని మాత్రం యథేచ్ఛగా చేస్తున్నాం. గట్టిగా నాలాంటి వాళ్లు గొంతు విప్పిన తర్వాత వంటనూనెల మీద కొంత దిగుమతి సుంకం పెంచారు. సుమారు 40-50 వేల కోట్ల రూపాయల సుంకం వస్తోంది. పప్పుల మీద ఇప్పటికీ దాదాపు సుంకం లేదు. పప్పులు, నూనెల దిగుమతులపై సుంకం విధించి, ఆ డబ్బు ఖజానాలో వేసుకోకుండా ఆ పంటల రైతులకు ఇస్తే మూడేళ్లలో భారతదేశాన్ని వారు స్వయంసంపన్నం చేస్తారు, రైతుల ఆదాయం పెరుగుతుంది, దిగుమతుల కోసం మనకు లేని డాలర్లు ఖర్చు పెట్టాల్సిన పన్లేదు.

▶▶పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని, వనరులను కాపాడటానికి మెరుగైన ఆహారపు అలవాట్లపై ప్రచారాన్ని నిర్వహిస్తూ తదనుగుణమైన పంటలను ప్రోత్సహించాలి. నియంత్రణల ద్వారా కన్నా మార్కెటింగ్ ఇన్సెంటివ్‌ల ద్వారా సరైన పంటలకు సంబంధించి రైతులకు ప్రభుత్వాలు సంకేతాలనిస్తుండాలి.

▶▶ఒక వస్తువు రవాణా చేయగలిగినదయితే, అమ్మగలిగినదయితే.. రేటు అంతటా సమమవుతుందన్నది ప్రాథమిక ఆర్థిక సూత్రాలలో ఒకటి. ఇతర ప్రాంతాల్లోకి తీసుకెళ్లి అమ్మటం అందరూ చేయనక్కర్లా. కొద్దిమంది చేస్తే చాలు. ఉదాహరణకు 2012లో రైతు సత్యాగ్రహ యాత్రలో కొందరు రైతులతో కలిసి నేను ఇతర రాష్ట్రాల్లో ధాన్యం అమ్మితే తెలుగునాట రేట్లు పెరిగాయి. స్వేచ్ఛా వాణిజ్యం ఉన్నప్పుడు రైతులు డిమాండ్ ఉన్న పంటల వైపు మళ్లటం ద్వారా నష్టాల్ని నివారించుకుంటారు, లాభపడతారు. డిమాండ్, సరఫరా స్వేచ్ఛామార్కెట్‌లో కొనసాగే ఏర్పాటు వల్ల ధరలు నిలకడగా ఉంటాయి. ఒక్కసారి దీర్ఘకాలిక ధరలు స్థిరపడితే, వ్యవసాయంలోకి పెట్టుబడులు ప్రవహిస్తాయి. ఉత్పత్తి, ఉత్పాదకత రెండూ గణనీయంగా పెరుగుతాయి. ఉత్పాదకత పెరిగితే ధరలు నియంత్రణలో ఉంటాయి. మొత్తం ఆర్థికవ్యవస్థ దీర్ఘకాలంలో లాభపడుతుంది.

▶▶వ్యవసాయం 47 శాతం జనాభాకు జీవనోపాధిగా ఉన్నా కూడా 80% పెట్టుబడి ప్రైవేటు రంగం నుంచే ఉంది. దేశం ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో ప్రైవేటు పెట్టుబడులు లక్షల కోట్లలో వస్తే తప్ప వ్యవసాయంలో మౌలిక వసతులు, ఉపాధి సాధ్యం కాదు.

▶▶భారతదేశం నుంచి రిలయన్స్ కావచ్చు, విదేశాల నుంచి వచ్చిన వాల్‌మార్ట్ కావచ్చు, క్యారీఫోర్ వంటి రకరకాల కంపెనీలు కావచ్చు.. ఎవరన్నా కానీండి లక్షల కోట్ల రూపాయలు వ్యవసాయంలో పెట్టుబడులు కావాలి. పిల్లి నల్లదా, తెల్లదా మనకనవసరం.. ఎలకల్ని పట్టాలి. గ్రేడింగ్‌లో, ప్యాకింగ్‌లో, రవాణాలో, గిడ్డంగుల్లో, శీతల గిడ్డంగుల్లో, రిటైల్ చైన్లలో, ప్రాసెసింగ్‌లో, ఎగుమతుల మార్కెట్‌లో. ఎగుమతి మార్కెట్‌లో కనీసం 100 బిలియన్ డాలర్లు, అంటే దాదాపు 8,00,000 కోట్ల రూపాయలు ఒక్క వ్యవసాయోత్పత్తుల్లోనే మనకు అవకాశం ఉన్నది. మనం ఉపయోగించుకోవటంలా. మూర్ఖపు చట్టాల వల్ల, మనం కొంతమందిని రానీయకుండా ఉండటం చేత. దానికి స్కేల్ కావాలి. 40 ఏళ్ల నుంచి నేను వింటున్నాను. తెలుగునాట ఉత్పత్తి చేసినంత అద్భుతమైన మామిడి ఎక్కడా ఉత్పత్తి కాదు, ఎగుమతులు కావాలి, ఎగుమతులు కావాలి అని. ఎంత ఎగుమతి చేస్తున్నాం మనం మామిడిపళ్లను. మొత్తం ఇండియా నుంచి మామిడి ఉత్పత్తి ఎంత, ఎగుమతులు ఎంత? ఒక్కసారి లెక్కచూడండి. హాస్యాస్పదం. ఎందుకని? ఆ స్కేల్ ఉండాలి. ఆ క్వాలిటీ గ్రేడింగ్ ఉండాలి. మనం వెళ్లగానే ప్రపంచ మార్కెట్లలో గేట్లు తెరవరు. ప్రపంచ మార్కెట్‌లోకి చొచ్చుకుపోయే శక్తి ఉండాలి. ఈ మ్యాంగో మచ్చ వచ్చిందంటారు, ఆ రకం రంగు బాలేదంటారు, పురుగుమందులు వాడారంటారు.. రకరకాలు. తమ రైతుని కాపాడుకోవటం కోసం ఆ దేశాలు నానా తంటాలు పడతాయి. మన ప్రభుత్వాలు మన రైతుల నడ్డివిరిచే ప్రయత్నాలతో ముంచేస్తుంటే, ప్రపంచ దేశాలన్నీ కూడా తమ రైతుల్ని కాపాడుకోవటం కోసం రైతుపక్షపాతంతో వ్యవహరిస్తుంటాయి. ఒక్క మన దేశంలో మాత్రమే రైతు పేరు చెప్పి రైతు నడ్డి విరగ్గొడుతున్నాము.

▶▶ఉత్పత్తి చేసే రైతుకి, కొనుగోలు చేసే వినియోగదారునికి మధ్య చాంతాడంత పొడుగున 6-7 లింకులున్నాయి ఈ దేశంలో. ఎన్నో ఏళ్ల నుంచి నాలాంటి వాళ్లం మొత్తుకుంటున్నాం. ఈ సప్లయ్ చైన్లని సంఘటితం చేయండి అని. పెద్దఎత్తున రిటైల్ చైన్లను ప్రోత్సహించండి అని. ఇప్పుడు మనం ఉల్లిపాయల రేటు కాస్త పెరిగితే వెంటనే ఎగుమతుల్ని నిషేధించాం. ప్రపంచంలో ఏ దేశంలో ఈ పని జరగదు. ఒక్క పవిత్ర భారతదేశంలో మాత్రమే జరుగుతుంది. ఇవన్నీ తొలగించండి, రిటైల్ చైన్లు రానివ్వండి. అప్పుడేమవుతుందీ.. మార్కెట్‌లో వంద రూపాయలకు వస్తువు అమ్ముడుపోతే, ఈవేళ రైతులకు వస్తున్న ఆదాయం సగటున 25 నుంచి 35 రూపాయలు. కొన్ని పంటల్లో రూ.10 కూడా రావటంలా. మీరు 70 రూపాయలకు కొంటే, రైతుకి రూ.10 వస్తే అదృష్టం. కానీ ఎప్పుడైతే రిటైల్ చైన్లు వచ్చి మార్కెట్‌ని సంఘటితం చేస్తామో, అప్పుడు రైతుకి వాల్యూ ఎడిషన్ ఉంటే ఆ ఛార్జీలు మినహాయించి 60-65% వస్తుంది. ప్రపంచ మార్కెట్‌లోకి చొచ్చుకునిపోయే శక్తి వాళ్లకు వస్తుంది. ప్రాసెసింగ్ పెద్దఎత్తున వస్తుంది. గిడ్డంగులు, మౌలిక వసతులు పెద్దఎత్తున వస్తాయి. అక్కడ అన్యాయం జరిగితే రైతుని కాపాడటం కోసం ఏర్పాట్లు చేయండి. ఎవర్నీ పూర్తిగా నమ్మాలని నేనటంలా. కానీ మార్కెట్ అంటే ఏమిటి?.. ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉండటం. పంట కోత తర్వాతి దశ నష్టాలు, అరకొర ప్రాసెసింగ్, స్టోరేజీల కొరత వల్ల ఏటా 1,00,000 కోట్ల (ట్రిలియన్) రూపాయల ఆహారోత్పత్తులు వృథా అవుతున్నాయి.

▶▶స్థానికమైనవైనా, విదేశీయమైనవైనా.. పెట్టుబడి, సాంకేతికత, ప్రాసెసింగ్, ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానమైన వ్యవస్థీకృత చిల్లర వర్తక సరఫరా గొలుసులు (రిటైల్ చెయిన్లు) అవసరం. సాంప్రదాయ మార్కెట్ వాటా కొంతకాలానికి తగ్గినా, రిటైల్ మార్కెట్ ఏటా 16-18% పెరగటం వల్ల ఈ రంగం పరిమాణం విస్తృతమవుతుంది. చెప్పుకోదగిన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, వ్యవస్థీకృత చిల్లర సరఫరా గొలుసుల్లో ఇప్పుడు భారత్ వాటా అతి తక్కువగా ఉంది. ఈ-కామర్స్‌తో కూడా కలుపుకుంటే 12% మాత్రమే. అదే బ్రెజిల్ 35%, వియత్నాం 45%, యూకే 80%

వాటా కలిగి ఉన్నాయి.

▶▶రైతులకు ఆదాయాన్నివ్వటంలో ప్రభుత్వం విఫలమైంది, మార్కెట్లు, పంపిణీ వ్యవస్థ అధ్వాన్నంగా, అవినీతిమయంగా ఉన్నాయంటూనే మళ్లీ ప్రభుత్వం కాళ్లే పట్టుకుంటామనే ధోరణి మన ఆలోచనల్లోని డొల్లతనాన్ని, పాతకాలపు ఆలోచనా విధానాన్ని, ఛాందసత్వాన్ని బైటపెడుతోంది. ప్రభుత్వం పని వ్యాపారం చేయటం కాదు. వ్యాపారం, కార్పొరేటు అంటే బూతుపదం అనే ధోరణి మనల్ని మనం మోసం చేసుకోవటమే.

▶▶ఈ కాగితం ఎక్కడ్నుంచి కొన్నాను.. ప్రయివేటు వ్యాపారి నుంచి. ఈ కంప్యూటర్ ఎక్కడ్నుంచి కొన్నాను.. ప్రయివేటు వ్యాపారి నుంచి. ఈ సోఫా ఎక్కడ్నుంచి కొన్నాను.. ప్రయివేటు వ్యాపారి నుంచి, ఈ చొక్కా ఎక్కడ్నుంచి కొన్నాను.. ప్రయివేటు వ్యాపారి నుంచి. ఏం పాపం చేశారండీ వీళ్లు. అసలీ భాష ఏంటి? ఈ ముతక భాష ఏమిటి? ప్రయివేటు, ప్రభుత్వం అని ఎందుకొచ్చిందసలు? రేటెవరిచ్చారు? మన్నిక ఎక్కడుంది? అవి ముఖ్యంగానీ.. ప్రయివేటు, ప్రభుత్వం అనే సమస్య ఎక్కడుందసలు? ప్రయివేటంటే ఎవరు? మన ఇంట్లో మన అబ్బాయిలు, అమ్మాయిలు వ్యాపారం చేస్తే వాళ్లు పాపాత్ములా? గవర్నమెంటులో యాభై వేలో, లక్ష జీతం తీసుకుంటూ ఏం పని చేయకుండా వాడమ్మితే పవిత్రుడా? ఏమిటీ ఆలోచన? ఎందుకొచ్చిందసలు?

▶▶కొత్త వ్యవసాయ చట్టాలపై జయప్రకాష్ నారాయణ్ చెప్పింది నమ్మక్కర్లేదు, మరొకరు చెప్పిందీ నమ్మక్కర్లేదు. వాస్తవాలు ముఖ్యం. నేను చెప్పేవి వాస్తవాలు అవునా, కాదా? చెప్పండి.. భారతదేశ విస్తీర్ణం ప్రపంచంలో 2.5% మాత్రమే అయినా మన దేశ వ్యవసాయ భూమి ప్రపంచంలో 12%- వాస్తవమా, కాదా? భారతదేశంలో వ్యవసాయంలో ఆదాయం తగ్గిపోతున్నది- వాస్తవమా, కాదా? భారతదేశంలో ప్రభుత్వ జోక్యం వల్ల మార్కెట్‌లో అతి తక్కువ రేటు రైతులకు వస్తోంది- వాస్తవమా, కాదా? సంకెళు తొలగి 10 మందిలో అమ్మగలిగే అవకాశం ఉంటే ఉన్నంతలో మంచి రేటుకి అమ్ముకునే అవకాశం రైతుకి దొరుకుతుంది. వాస్తవమా, కాదా? విదేశీ వాణిజ్యంలో మనకు చోటులేకపోతే ఇంత పెద్ద దేశంలో మన రైతులు నష్టపోతున్నారు. వాస్తవమా, కాదా? ఒక్కసారి మన మత్స్యపరిశ్రమను చూడండి. చేపల పరిశ్రమలో కూడా ఒడిదుడుకులుంటుంటాయి. రొయ్యలుగానీ, ఇంకోటిగానీ. కానీ మొత్తం మీద ఎప్పుడైతే ప్రభుత్వ జోక్యం లేదో, అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉందో అప్పుడు పండించిన పంటతో రైతులకు ఎకరాకు 3-4 లక్షల ఆదాయం వస్తుంది. మనం గర్వపడాలా? సంతోషపడాలా? ఈర్ష్యపడాలా? అరె, నాకు రొయ్యలంటే చాలా ఇష్టమండీ, వాడు రూ.10లకు ఇవ్వకుండా రూ.100లకు అమ్ముకుంటున్నాడండీ అని వాడ్ని నాశనం చేయటమే నా లక్ష్యమా? ఎందుకీ నటన ఒక పక్కన రైతు మాట చెబుతూ. రైతుకు మంచి రేటు వచ్చే ఏర్పాటు చెబితే దాన్ని ప్రోత్సహించాలా, మనం వ్యతిరేకించాలా? ఎవరికి నష్టం?

▶▶ఈ చట్టాలను వెనక్కి తీసుకోవటం ప్రమాదకర సంకేతమవుతుంది. రైతులంటే కేవలం పంజాబ్, హర్యానాల్లోని కొంతశాతం




మంది మాత్రమే కాదు.

▶▶ఒక్కసారి సంకెళ్లను తొలగించి, సరైన ప్రోత్సాహకాలను అందిస్తే చాలు.. భారతీయ రైతులు ప్రపంచంలో ఎవరితోనైనా దీటుగా పోటీపడగలరు. మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పును తేగలరు.

▶▶రైతుల ప్రయోజనాలు, పారిశ్రామికాభివృద్ధి, దేశ సుసంపన్నత ఈ మూడూ పరస్పరం విడదీయలేనివి. మొక్కుబడి విధానాలు, తాత్కాలిక తాయిలాలు - వీటి నుంచి బయటపడి హేతుబద్ధమయిన విధానాలు, రైతుకి దీర్ఘకాలంలో ఆదాయాలు పెంచి, ఖర్చులు తగ్గించే మార్గాలు, బతుక్కి భరోసా కల్పించే పద్ధతులని ప్రవేశపెట్టాలి. రైతు, వినియోగదారుడి అభివృద్ధి విడదీయలేని పరస్పర ఆధారితమైన లక్ష్యం. అవినీతి, లీకేజీలమయమైన చాంతాడంత పంపిణీ వ్యవస్థ బదులు.. పేదల కొనుగోలు శక్తిని పెంచేందుకు వినియోగదారులకు, ముఖ్యంగా మహిళల జన్ ధన్ అకౌంట్లకు ప్రత్యక్షంగా నగదును బదిలీ చేయాలి.

▶▶రైతుల మీద, గ్రామీణ పేదల మీద ప్రధానంగా భారమేంటో ఒక్కసారి ఆలోచించండి. ఒకపక్క వ్యవసాయంలో రేట్లు రాకపోవటం, ఆదాయాలు హరించటం, చిన్న కమతాలు.. రెండోపక్క విద్య, ఆరోగ్యంలో ప్రభుత్వాల ఘోరవైఫల్యం. పిల్లల చదువుల కోసం నిరుపేదలు వేలకువేలు ప్రతి సంవత్సరం ఖర్చు చేస్తున్నారు. అది ప్రభుత్వం చెయ్యవలసిన పని. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే, గ్రామీణ, దళిత ప్రజల మీద మమకారం ఉంటే ఎందుకయ్యా విద్యను, ఆరోగ్యాన్ని అంత దారుణంగా తయారు చేశారు? సిగ్గుందా అని నిలదీయండి. రోజూ నిలదీస్తున్నాను నేను. అదేం లేకుండా సందర్భంలేనివి తీసుకొచ్చి కొత్త వ్యవసాయ చట్టాలపై మాట్లాడుతున్నారు. వ్యవసాయరంగమే భారతదేశంలో ఆర్థిక సమస్యలకు పరిష్కారం కాజాలదు. ఈ చట్టాల వల్ల గ్రామీణ పేదల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని మెడ మీద తలకాయ ఉన్నవాడెవ్వడూ వాదించడు. వీటి వల్ల మార్కెట్‌లో కొంతవరకు రేటు న్యాయంగా అందే ఏర్పాటు జరుగుతుంది. ఎంత జాగ్రత్తగా మాట్లాడుతున్నానో చూడండి.. మార్కెట్‌లో కొంతవరకు రేటు న్యాయంగా అందే ఏర్పాటు జరుగుతుంది, కొంతమేరకు సంకెళ్లు తెగుతాయి. దశాబ్దాల పాపం కొంతమేరకు ప్రక్షాళన అవుతుంది.

▶▶రైతు భద్రత, దేశ ఆహార భద్రతకు ఈ రకమైన చర్యలతోపాటు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవల్ని అందుబాటులోకి తెచ్చి చిన్న పట్టణాల అభివృద్ధిని చేపడితే గ్రామాలకు - పట్టణాలకు మధ్య అంతరాలు తగ్గి రైతుల కష్టాలు చాలా మేర తీరతాయి, యువత ఆహ్లాదకర జీవితాన్ని ఆస్వాదించగలిగేలా ఉపాధిని పొందే అవకాశాలు స్థానికంగానే, దూరాభారం లేకుండానే అందుబాటులోకి వస్తాయి. ✦


(గత సంచిక తరువాయి)

# స్థానిక ప్రభుత్వాల ప్రజాప్రతినిధులకు శిక్షణ

## (లోక్‌సత్తా రాజకీయ ఉద్యమ సంస్థ 23 సంవత్సరాల ప్రస్థానం)

- బండారు రామ్మోహనరావు, 98660 74027

2001 సంవత్సరంలో తెలుగునాట గ్రామ పంచాయతీ మొదలుకొని మండల జిల్లా పరిషత్‌ల దాకా ఎన్నికలు జరిగాయి. స్థానిక ప్రభుత్వాల సాధికారతను కీలక ఎజెండాగా కలిగిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ.. ఆ ఎన్నికలలో గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాసమస్యలపై పరిష్కారాలతో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించింది. స్థానిక ప్రభుత్వాలకు సాధికారత అంటే ఏమిటి, ఎందుకు అది ప్రజలకు అత్యవసరం తెలియచెప్తూ ప్రచారం చేసింది. గ్రామాల్లోని బడుగు బలహీన వర్గాలు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో పాల్గొనే అవకాశం స్థానిక ప్రభుత్వాల్లో ఉంటుందని వివరించింది. అప్పుడున్న రిజర్వేషన్ల ప్రకారం మహిళలకు 33 శాతం, బడుగు బలహీన వర్గాలకు 60 శాతానికిపైగా రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. అదే సమయంలో నిరక్షరాస్యులైన గ్రామీణులు వీటిని సద్వినియోగం చేసుకుని ఎన్నికల్లో నెగ్గినా వారికి పాలనాపరమైన అంశాలపై పట్టు ఉండటం లేదని గుర్తించింది. దానివల్ల గ్రామాల్లో ఉన్న పెత్తందార్లు లేక అధికారులు వారిని తప్పుదోవ పట్టించే అవకాశాలున్నాయని భావించింది. అందుకే స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం మొదటగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. దానిలో భాగంగానే రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో మాస్టర్ ట్రైనీలుగా రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా ప్రతినిధులు శిక్షణ పొందారు. అలా శిక్షణ పొందిన ప్రతినిధులు స్థానిక ప్రభుత్వాలలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సర్పంచ్ నుంచి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వరకు శిక్షణనందించారు. ఈ రకంగా స్థానిక ప్రభుత్వాల సాధికారతకు కార్యక్రమాల్ని ప్రారంభించి విస్తరించింది లోక్‌సత్తా. ప్రతి కార్యక్రమంలో విలువైన సాహిత్యాన్ని లోక్‌సత్తా ఉచితంగా లేదా నామమాత్రపు ధరతో కరదీపికలుగా అందించింది.













**హైదరాబాద్ ఎన్నికల్లో ఉమ్మడి వేదికలు**

2002లో జరిగిన హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీహెచ్) ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో లోక్‌సత్తా పాల్గొంది. హైదరాబాద్ నగర ఓటర్ల జాబితాలోని డొల్లతనాన్ని ఆధారాలతో బయటపెట్టింది. దీంతో సవరించిన ఓటర్ల జాబితా విడుదల చేశాక హైదరాబాద్ ఎన్నికలు జరిపారు. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలకు, కార్పొరేషన్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. ఆ సందర్భంగా కార్పొరేషన్ మేయర్లకు, మునిసిపల్ చైర్ పర్సన్ అభ్యర్థులకు ఎన్నికల ఎజెండాపై ఉమ్మడి వేదికల్ని నిర్వహించింది. తమ పార్టీ విధానాలు, స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యేకించి ఇస్తున్న హామీలు వంటి వాటిని ప్రజల ముందుంచేందుకు ఈ వేదికలు అభ్యర్థులకు ఉపయోగపడగా, ప్రజల్లో కూడా ఓటుహక్కు వినియోగంపై అవగాహనకు తోడ్పడ్డాయి.

**ప్రజల మేనిఫెస్టో**

పట్టణ ప్రాంతాల ఎన్నికల్లో మరో ముఖ్యమైన అంశాన్ని లోక్‌సత్తా వెలుగులోకి తెచ్చింది. ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజాసమస్యల వివరాలను ప్రజల నుంచే సేకరించటం జరిగింది. వీటికి రాజకీయ పార్టీలు చూపించాల్సిన పరిష్కారాలు ఏమిటి అని సదస్సుల్లో చర్చించి ఆ పరిష్కారాల్ని ప్రజా మేనిఫెస్టో రూపంలో చిన్న బుక్‌లెట్లుగా ప్రకటించటం జరిగింది. రాజకీయ పార్టీలు తమ మునిసిపల్ ఎజెండాను ప్రకటించకముందే ఈ పని చేసింది. ఆ తర్వాత ఆయా రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులకు వీటిని అందజేసి తమ వైఖరిని తెలియజేయమని లోక్‌సత్తా కోరింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వందకు పైగా మునిసిపాలిటీల్లో ఈ కార్యక్రమాల్ని నిర్వహించటం జరిగింది.

**స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం 2003లో కోటి సంతకాల సేకరణ ఉద్యమం**

స్థానిక ప్రభుత్వాలలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కేవలం శిక్షణనిస్తే సరిపోదని లోక్‌సత్తా గుర్తించింది. ఆ ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలంటే విధులు, నిధులు, సిబ్బంది సహా అధికారాలను కల్పించాలని స్పష్టం చేసింది. ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిన స్థానిక ప్రభుత్వాలకు పునరుజ్జీవనం కలిగించేందుకు ఉద్యమించింది. ఈ ఉద్యమంలో కేవలం ఎన్నికైన ప్రజాప్రతినిధులు

పాల్గొంటే సరిపోదని, ప్రజల భాగస్వామ్యం కీలకమని భావించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణను ప్రకటించింది. అంతకుముందు రామజన్మభూమి కోసం దేశవ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించిన ఉద్యమం మాత్రమే రికార్డుగా ఉండేది. కానీ అప్పటికి కేవలం ఏడు కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనే, ఆ ఒక్క రాష్ట్రంలోనే జాతీయ రికార్డును లోక్‌సత్తా బద్దలు కొట్టింది. స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం లోక్‌సత్తా మొదలుపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమంలో కోటి 10 లక్షల మందికిపైగా పాల్గొని మద్దతు పలికారు. ఇది దేశంలోకెల్లా అతి పెద్ద సంతకాల సేకరణ ఉద్యమంగా మారింది. స్థానిక ప్రభుత్వం అంటే 'ఇంటి ముందు ప్రభుత్వం, కంటి ముందు పాలన' అన్న లోక్‌సత్తా నినాదం తెలుగునాట గల్లీల్లో, మార్కెట్లలో ఎక్కడబడితే అక్కడ మారుమోగింది. దూరంగా ఉన్న మంచివాడి కంటే, దగ్గరగా ఉన్న చెడ్డవాడితో పనిచేయించుకోవటం మనకు ముఖ్యమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. 'స్థానిక ప్రభుత్వాలకు అధికారం ఇవ్వండి, మా గురించి మేం ఆలోచించుకునే అవకాశం ఇవ్వండి' అని ప్రజల చేత డిమాండ్ చేయించింది. మా ఓటు, మా అధికారం అంటూ ఎంపీ, ఎమ్మెల్యేల రాజ్యాన్ని నిర్వహించింది. చట్టసభల్లో శాసనాలు చేయటం మీ పని, గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో రోజువారీ సేవలను అందించటం, అభివృద్ధి చేయటం స్థానికుల పని అని వారికి మనవి చేసింది. స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు తప్పు చేస్తే గల్లా పట్టుకుని నిలదీయవచ్చని, కానీ మీకు సంబంధం లేని స్థానిక అంశాలపై జోక్యం చేసుకోవద్దని ఎమ్మెల్యే, ఎంపీలను కోరింది. మా పన్నుల డబ్బుతో మా పనుల్ని మేమే చేసుకుంటామని స్థానిక ప్రజల తరపున లోక్‌సత్తా ప్రకటించింది. ఇలా స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం కోటి సంతకాల లక్ష్యాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయటమేకాకుండా, లక్ష్యాన్ని మించి ప్రజల మద్దతును కూడగట్టింది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వందలాది సదస్సులను నిర్వహించింది. స్థానిక ప్రభుత్వాల తాజా ప్రజాప్రతినిధులతోపాటు మాజీ ప్రతినిధులు, సమాజంలోని మేధావులు, న్యాయకోవిదులు, ప్రముఖులు ఇలా ఎందరినో వీటిల్లో భాగస్వాములను చేసింది. ఇలా సేకరించిన కోటీ 10 లక్షల సంతకాలతో కూడిన డిమాండ్లను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర రెడ్డిలకు సమర్పించింది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, విధులను బదలాయిస్తామని ఇద్దరూ పోటీపడి హామీ ఇచ్చారు. ఆ తర్వాత రాష్ట్రం నలుమూలల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన వేలాది మందితో హైదరాబాద్ లలితకళా తోరణంలో భారీ సదస్సును నిర్వహించి 'స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిస్తారా? పదవుల నుంచి దిగిపోతారా?' అనే ప్రశ్నను నినాదంగా మలచింది లోక్‌సత్తా.

**దాపరికంలేని పాలన కోసం 'సమాచార హక్కు చట్టం' (ఆర్‌టీఐ)**

పాలనా సమాచారం హక్కుగా పొందాలని, ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజల వద్ద సేవకులైన పాలకులు రహస్యాల్ని దాచకూడదని తొలినుంచీ లోక్‌సత్తా పోరాడుతూ వచ్చింది. 2001లోనే సమాచార హక్కు చట్టం నమూనాను తయారుచేసి పార్లమెంటు, అసెంబ్లీలకు సమర్పించింది. తెలుగు ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఈ చట్టం గురించి వివరించింది. 2002లో సమాచార స్వేచ్ఛ హక్కు చట్టం రావటానికి లోక్‌సత్తా కారణభూతమైంది. కానీ ఈ చట్టం చాలదు, హక్కుగా సమాచారం కావాలని గట్టిగా గళం వినిపించింది. 2004లో అరుణారాయ్ వంటి ఇతర ప్రజాస్వామిక మిత్రులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేయటంతోపాటు అవసరమైన లాబీని కూడా చేసింది. ఢిల్లీ నుంచి గల్లీ వరకూ సంతకాల సేకరణతో అవసరమైన పెద్దలను కలిసి ఒప్పించింది. దీంతో 2005లో యూపీయే ప్రభుత్వం దిగి వచ్చి చట్టాన్ని తేవటానికి అంగీకారం తెలిపింది. ఈ చట్టంలోని ప్రతి పదాన్నీ హైదరాబాద్‌లోని లోక్‌సత్తా కార్యాలయంలో జయప్రకాష్ నారాయణే రాశారు.

**వార్షిక విద్యాస్థితి నివేదిక (అసర్) సర్వేలో లోక్‌సత్తా**

విద్యలో ప్రమాణాల గురించి విస్తృత స్థాయిలో దృష్టి పెట్టింది లోక్‌సత్తా. 2001-2002 విద్యాసంవత్సరం నుంచి మొదలైన సర్వశిక్షా అభియాన్ పథకం ఫలితాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు 'ప్రథమ్' అనే స్వచ్ఛంద సంస్థ చేస్తున్న ప్రయత్నాన్ని లోక్‌సత్తా ప్రోత్సహించింది. దేశవ్యాప్తంగా 600 గ్రామీణ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలోని 6 నుంచి 14 ఏళ్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెద్ద సంక్లిష్టతలు లేని ప్రశ్నలతో అంచనా వేసేందుకు ఈ సంస్థ ప్రయత్నం మొదలుపెట్టింది. వార్షిక విద్యాస్థితి నివేదిక (అసర్) పేరుతో రూపొందే ఈ నివేదికలకు 2005, 2006లో తెలుగునాట లోక్‌సత్తాయే బాధ్యతలు తీసుకుంది. తొలి అసర్ నివేదికను కూడా జేపీయే అప్పటి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న మాంటెక్ సింగ్ ఆహ్లువాలియాతో కలిసి ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో విడుదల చేశారు. రాష్ట్రంలో అసర్ సమన్వయకర్తగా పనిచేసే అవకాశం నాకు లభించింది.

లోక్‌సత్తా వలంటీర్లు ఒక ఉద్యమంలా అన్ని జిల్లాల్లో పాల్గొన్నారు. 2006లో లోక్‌సత్తా రాజకీయ పార్టీగా కూడా విస్తరించింది. దీంతో ఆ తర్వాత గత 14 సంవత్సరాలుగా ఈ సర్వేలో లోక్‌సత్తా తరపున నేను, జనబలం వర్కింగ్ ఎడిటర్ డి.సోమసుందర్ మాస్టర్ రిసోర్స్ పర్సన్స్‌గా రాష్ట్రవ్యాప్త సర్వేలో పాల్గొనే డీఎడ్ అభ్యర్థులకు శిక్షణనిస్తున్నాము. అలాగే ప్రతి సంవత్సరం ఢిల్లీలో ఇంగ్లిష్‌లో విడుదల చేసే అసర్ నివేదికలను తెలుగులోకి అనువదించి అందిస్తున్నాము. ఈ సర్వే వివరాల్ని అనేక సమావేశాల్లోనే కాకుండా, అసెంబ్లీలో కూడా జేపీ పలుమార్లు ప్రస్తావించి విద్యావ్యవస్థను బాగుచేయమని డిమాండ్ చేశారు. ప్రతి పర్యటనలో అవకాశముంటే ఆస్పత్రితోపాటు స్కూలు సందర్శించటం, అసర్ తాజా వివరాల్ని, పీసా సర్వేను ప్రస్తావించటం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే మొట్టమొదటిసారిగా విద్యాప్రమాణాలను మెరుగుపరచటంపై దృష్టిపెట్టేలా జాతీయ నూతన విద్యావిధానాన్ని మలచటంలో కూడా లోక్‌సత్తా తన వంతు కృషి చేసింది.

**(ఇంకా ఉంది)**

# LRS + BRS+AS= LBW

- పివి గోపాలకృష్ణ, 94404 70848

Rule of lawకి తిలోదకాలు. చట్టం దాని పని అది చేసుకుపోడం అంటే జోక్.

చట్టం ఒకటి చెప్తూంటే దాన్ని అమలు చేసే అధికారులు మరోటి చేస్తూంటే ఆ విషయం తెలిసిన ప్రభుత్వ పెద్దలు చట్టం దాని పని అది చేసుకుపోతోందనడం, రూల్ ఆఫ్ లా గురించి మాట్లాడ్డం జోక్ కాక మరేమిటి? దీనికి పరాకాష్ఠ, చట్టం దాని పని అది చేసుకుపోతోందన్న మాటలో నిజం లేదన్నది అందరికీ తెలిసిన విషయమే అవడం. ఒకటి కాదు రెండు కాదు 25 లక్షల యాభైతొమ్మిది సందర్భాల్లో చట్టం దాని పని అది చెయ్యలేదనడానికి LRS కోసం ప్రభుత్వానికి అందిన అన్ని అప్లికేషన్లే సాక్ష్యం. చట్టం దాని పని అది చెయ్యకపోడానికి, చెయ్యలేకపోడానికి కారణం చట్టం సక్రమంగా లేకపోడం కాదు, అది అమలు చేసే అధికారులకి చట్టం ఏం చెప్తోందో అర్థంకాకపోడమూ కాదు. వారి అలసత్వం కాదు. వారు అసమర్థులవడం అంతకన్నా కాదు. ప్యూర్ అండ్ సింపుల్. చట్టం దాని పని అది చెయ్యకపోడానికి కారణం చట్టాన్ని అమలు చేసే అధికారుల్లో లోతుగా వేళ్లూనుకున్న అవినీతి. అమలుచెయ్యవలసిన అధికారుల్లో పూర్తిగా మృగ్యం అయిన చిత్తశుద్ధి. ఈ రెండిటిలో ఏది కావలసిన పాళ్ళలో ఉన్నా ప్రభుత్వ పెద్దల రాజకీయ ప్రయోజనాలకతీతంగా అటువంటి శక్తిమంతులుగా ఉండాలని కోరుకుంటారు. కానీ మొదటిది ఎక్కువగా రెండోది తక్కువకావడమేకాక వారిలో అలవిమాలిన స్వార్థం కూడా కరడు కట్టిపోయింది. అధికార యంత్రాంగం అడ్డదారులు తొక్కడంతో యాంత్రికంగా దాని పని అది చెయ్యవలసిన చట్టాన్ని ప్రజలు కూడా పక్కదారి పట్టిస్తున్నారు. దాన్ని సరిచెయ్యవలసిన అధికారగణంలో చేవచచ్చిపోయింది.

అక్టోబర్ 31 నాటికి, ఇదే ఆఖరు అవకాశం- ఆలసించిన ఆశాభంగం అన్న ప్రభుత్వ పెద్దల హెచ్చరికలతో హైదరాబాద్, వరంగల్ వంటి పెద్ద కార్పొరేషన్లలో 4 లక్షల 16 వేలమంది, ఖమ్మంలాంటి మునిసిపాలిటీల్లో 10 లక్షల 60 వేల మంది, గ్రామ పంచాయతీల్లో 10 లక్షల 83 వేల మంది, చట్టం దాని పని అది చెయ్యనివ్వకుండా అడ్డుపడ్డవారు, తాము చేసిన తప్పుకి పరిహారం కట్టడానికి సిద్ధపడి బయటపడ్డారు. ఒక్క ఆఖరు రోజు మాత్రమే 30,717 మంది బయటపడ్డారు. ఆ పనిలో తమవంతు సాయం చేసిన అధికారులు, వారితో కలిసి అవినీతి ఫలాలు భోంచేసిన ప్రభుత్వ పెద్దలు వారు సంపాదించుకున్నది మూటకట్టుకుని ఎవరి దారిన వారు పోయేరు. అందరూ తోడుదొంగలే అనుకోడానికి కారణం ఈ అధికారగణం ఎవరిమీదా ఎటువంటి చర్యలకు ప్రభుత్వం సిద్ధపడకపోడమే.

Public policy, public welfare అనుకుంటూ కొన్ని నేల విడిచి సాము చేసి చట్టాలు చేసుకుంటాం. అమలు చేయలేక చతికిలబడిపోతుంటాం. Bite off more than one can chew. Prohibition law, Helmet law etc.,., పాలకులు, అధికారులకే కాదు సామాన్య ప్రజానీకానికి కూడా లేనిది చిత్తశుద్ధి. ఇంకా ప్రజాస్వామ్య విలువలు మనకి పూర్తిగా వంటబట్టలేదు. త్రేతాయుగం నుంచి భరతవర్షంలో, భరతఖండంలో వేళ్లూనుకుని ఉన్న రాచరికం ముందు మన ప్రజాస్వామ్యం వయసు సుమారు 70 ఏళ్ళు మాత్రమే. ప్రజాస్వామ్య విలువలు ప్రజాసామాన్యం ఇంకా వంటబట్టించుకోలేదు. ఇంగ్లాండు, అమెరికా, ఫ్రాన్సు వంటి




ప్రజాస్వామ్యాలలా మన ప్రజాస్వామ్యం కూడా క్రియాశీలంగా తయారవడానికి 250 నుంచి 800 ఏళ్ళు పట్టాలనుకుంటున్నామా?

మన ప్రజాస్వామ్యంలో unwritten rule – ప్రజా ప్రతినిధులు వారు చేసే చట్టాలకి అతీతులు. దీనికి టోల్‌ప్లాజాల దగ్గర అడపాదడపా ప్రజాప్రతినిధులు చేస్తున్న వీరంగమే సాక్ష్యం. రాజరికంలో అధికారం జన్మరీత్యా సంక్రమిస్తే, ప్రజాస్వామ్యంలో ప్రజలే దాన్ని కట్టబెట్టి తమని రాజులు ఎన్నుకుంటారనుకునే మహాజ్ఞానులు దాపరించేరు. చట్టం దాని పని అది చేసుకుపోతుందన్న నమ్మకం తగ్గడానికి కారణం ఒకసారి చట్టసభల్లో చోటు సంపాదించడం పాపం, చట్టం మా చుట్టం అనుకునే సంఖ్య పెరగడం. దానికి తోడు రాజుని మించిన రాజభక్తి చూపించే అధికారగణం వందిమాగధులుగా తయారవడంతో ఆ అధికారం మత్తు వల్ల తాము చేసే చట్టాల నుంచి తమకు మినహాయింపు సహజం అని భావించేవారు పార్టీల గల్లీ నాయకులుగా ఎదగడం ఒకటి. రెండు, అధికారం వంశపారంపర్య హక్కుగా భావించేవారు అప్రయత్నంగా, సునాయాసంగా ప్రజాప్రతినిధులుగా, కాదు కాదు, రాజ్యం

ప్రజాప్రతినిధి భోజ్యం అనుకునేవారు "రాజులు"గా కూడా ఎన్నికైపోడం. మూడు, అణువణువునా ప్రభుభక్తి ఇంకిపోయి ఉన్న భజనపరులైన అధికారగణం. Caught in the Concentric Circles of Power..

గ్రేటర్ అన్న పేరుతో మెట్రోపాలిటన్ డెవలప్మెంట్‌లో మనం సాధించిందేమిటంటే మనం చేసుకున్న చట్టాలని మనమే తుంగలో తొక్కడం. DT & CP రూల్స్‌ని పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారాభివృద్ధికి అన్ని విధాల సహకరించిన అధికారులు, పాలకులూ అందరూ ఇందులో భాగస్వాములే. ఈ విషయంలో అవినీతి ఎంత సహజం అంటే నీరు పల్లమెరుగు అన్నంత సహజం. గ్రేటర్ చెన్నై, గ్రేటర్ హైదరాబాద్, బృహన్ముంబై ఏ మెట్రోపాలిటన్ అథారిటీ దీనికి మినహాయింపు కాదు. నీరు పల్లంలోకి ప్రవహించినంత సహజంగానే అవినీతి ప్రవహిస్తూంటే, అధికారగణ అలసత్వమే పునాదిగా అడ్డంగా తయారైన కాలనీలన్నీ 'లానైనా' వర్షాల ప్రవాహంలో మునిగిపోక తేలుతుంటాయా! చేసిన తప్పును అయ్యవారు సరిదిద్దుకోడానికి LRS పేరుతో ప్రభుత్వం పరిహారం వసూలు చేస్తామంటే తానతందానా అంటూ ప్రజలు ఆ పరిహారం చెల్లించినంత మాత్రాన నీరు ఎత్తుకు ప్రవహిస్తుందా, ఈ కాలనీలన్నీ చెరువులుగా మారడం మానేస్తాయా? ఒక్క హైదరాబాదులోనే కాదు, చెన్నైలో కూడా అర్బన్/మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ ఇలాగే ఉంది. 1980ల తరవాత రియల్ ఎస్టేట్ అద్భుతంగా అభివృద్ధి చెందిందని చంకలు గుద్దుకుని గొప్పగా చెప్పుకునే వేలాచేరి, మడిప్పాకం, మేడవాక్కం, ముడిచ్చూర్, పళ్ళికరణై ఇలా చెన్నై శివార్లలోని ప్రాంతాలవారికి, ఈనాటికీ, నిన్నటి నివర్ తుఫానే సాక్ష్యంగా, వర్షాకాలం అంటే nightmare. అక్కడా LRS ointmentనే వాడతారు. ఫలితం శూన్యం. అటువంటి LRS, BRSలులాంటి amnesty schemeలు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చగలవేమోగానీ, దశాబ్దాల తరబడి ముందు చూపులేకుండా 'అభివృద్ధి' అనుకుంటూ చేసిన తప్పులని సరిదిద్దవు. ప్రభుత్వాలు చేసిన తప్పులకి ప్రజలు పరిహారం చెల్లిస్తూ ఉండడమే మిగులుతుంది. ఇక్కడ ప్రభుత్వం వేరు ప్రజలు వేరు అని ఒప్పుకోక తప్పదు. ప్రజలే ప్రభుత్వం, ప్రభుత్వమే ప్రజలు అని ఎంత నచ్చచెప్పుకున్నా దాని ఫలితాన్ని ప్రజలు మాత్రమే అనుభవించాల్సి వస్తోంది. LRS అంటేనే తాను చేసిన చట్టం దాని పని అది చేయకుండా ప్రభుత్వం అడ్డుపడడం అన్న గ్రహింపు రానంత వరకూ ఇలాంటి స్కీములు వస్తూనే ఉంటాయి. మొదటిసారి తమిళనాడు ప్రభుత్వం LRS స్కీమ్ ప్రకటించినప్పుడు అనధికార ఇళ్ళ స్థలాల సంఖ్య 14 లక్షలు. 2015లో అడ్వొకేట్ ఎలిఫంట్ జి.రాజేంద్రన్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం పర్యవసానంగా హైకోర్ట్ విధించిన ఆంక్షల నుంచి 2018లో బయటపడిన తరవాత అక్కడి ప్రభుత్వం తన LRS scheme కరుణాకటాక్ష వీక్షణాలను జనం సద్వినియోగం చేసుకోడానికి రెండోసారి ఆఖరి అవకాశాన్ని ఇచ్చింది. ప్రస్తుతం పద్దెనిమిది నెలల గడువు ముగిసినందున ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరించకపోయినా నేటికీ ఆఫ్ లైన్‌లో DT & CP, CMDAలకి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇంకా ఉండనే ఉంది.

ప్రభుత్వం LRS BRS అని అంటోందీ అని అంటే అర్థం ఏమిటంటే – మన కోసం మన వలన మనం చేసుకున్న మన చట్టాలని మనమే అతిక్రమించి చేసిన పనులని మనమే చట్టబద్ధం చేసుకోడానికి కొత్త చట్టాలు, నిబంధనలు మళ్ళీ మనమే చేసుకుంటూ ముందు చేసుకున్న చట్టాలని తోసిరాజంటున్నాం అని. ఒక పక్క ప్రభుత్వం – అంటే మనం – చట్టాలు చేస్తుంటుంది. వాటిని కొంతమంది పాటించినా, ప్రభుత్వ యంత్రాంగం అలసత్వం వల్ల, అవినీతి వల్ల వాటిని పట్టించుకోని వారి సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిపోతుంటే, చట్టం దాని పని అది చేసుకుపోతుందంటూనే ప్రభుత్వం ఏం చేస్తోందీ అంటే చట్టం దాని పని దాన్ని చెయ్యనివ్వనివారికి వత్తాసు పలుకుతోంది. చట్టాన్ని గౌరవించి చట్టబద్ధంగా ఉన్నవారిని వెర్రివెధవలని చేస్తోంది. ఒకపక్క District Town and Country Planning Act, Municipalities Act, Panchayat Raj Act, లాంటి చట్టాలు చేసుకుంటాం. ఎందుకు? సరైన పద్ధతిలో సక్రమమైన గ్రామ, పట్టణాభివృద్ధి కోసం, పర్యావరణ పరిరక్షణ, వరదల నివారణ, ఇవన్నీ కాయితాల మీదే సాధించడానికి. నిజానికి ఏం జరుగుతోందంటే, వాటిల్లోని నియమనిబంధనలన్నీ బేఖాతరు చేస్తూ లే ఔట్లు, భవన నిర్మాణాలు ప్రభుత్వ యంత్రాంగం కనుసన్నలలోనే సంవత్సరాల తరబడి జరిగిపోతూ ఉంటాయి. చట్టం దాని పని ఎక్కడా చేస్తున్న దాఖలాలుండవు. చట్టవిరుద్ధంగా చేసిన పనులన్నింటినీ ఒక్క దెబ్బతో రెగ్యులరైజేషన్, అమ్నెస్టీ స్కీముల పేరుతో చట్టబద్ధం చేసేస్తుంది. చట్టం దాని పని అది చేసుకుపోతున్నట్టేగదా!

బస్సుల వెనక పోస్టర్ల మీద నాయకులు నవ్వుమొహాలతో ఇదే ఆఖరి అవకాశం అని హెచ్చరిస్తుంటారు. మరో ప్రభుత్వం రాదా? వారికి తక్షణ ఆర్థికావసరాలుండవా? తన వంతుగా రూల్ ఆఫ్ లా కి మోకాలడ్డం పెట్టే జనం దగ్గర్నుంచి చార్జీలు పిండదా? ఒక ప్రభుత్వం పోతే మరోటి. అందరి తీరూ ఒకటే.

నత్తలని, తాబేళ్ళని ఆదర్శంగా తీసుకున్న మన న్యాయప్రక్రియలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ 2015లో ప్రభుత్వం ప్రకటించిన BRSకు, గత సెప్టెంబర్‌లో ప్రకటించిన BRSకు వ్యతిరేకంగా దాఖలు చేసిన వ్యాజ్యాలు ప్రజాహితమే అయినా, సత్ఫలితాలనివ్వడానికి పట్టే సమయంలో మరో రెండు ప్రభుత్వాలు మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

క్రికెట్ ఆటలో LBW చాలా సంక్లిష్టమైనది. బ్యాట్స్ మేన్ ఔటవడానికి ఉన్న మిగిలిన సందర్భాలకన్నా అంపైర్ సమర్థతకి ప్రతి బాల్‌ను సునిశితంగా పరిశీలనాత్మకంగా గమనిస్తూ ఆటని నిర్వహించే పనితనానికి పరీక్షగా ఉంటుంది. బౌలర్ రన్ అప్ ప్రారంభించిన దగ్గర్నుంచి బాల్ డెలివరీ అయి బ్యాట్ మేన్

బాల్‌ని ఎదుర్కొనేదాకా, Every delivery has the potential for LBW appeal. డెలివరీ అయిన ప్రతి బాల్ కూడా LBW నిబంధనను అనుసరించి సక్రమమైన నిర్ణయం ఇవ్వవలసిన బాధ్యత అంపైర్ మీద ఉంటుంది. అది కూడా బౌలర్, వికెట్ కీపర్, క్లోస్ ఇన్ ఫీల్డర్లలో ఎవరైనా అపీల్ చేసిన క్షణాల్లో సరైన నిర్ణయం చెప్పవలసి ఉంటుంది. పాపింగ్ క్రీస్, బౌలింగ్ క్రీస్ దాటకుండా బాల్ డెలివరీ అయిందా లేదా అంటే నో బాల్ కాదన్నది, బాల్ వికెట్‌లకి ఎదురుగా ఉన్నదా లేదా, బ్యాట్‌కి తగిలిందా లేదా, బాల్ బ్యాట్‌కి తగలకుండా బ్యాట్స్ మేన్ మరియేఇతర శరీరభాగానికైనా తగిలితే అది వికెట్స్‌కి ఎదురుగా ఉందా లేదా, ఆ విధంగా తగిలినప్పుడు బ్యాట్ మేన్ శరీరం అడ్డంకిగా లేకపోతే వికెట్స్‌కే ఆ బంతి తగిలుండేదా లాంటి ఐదు నియమాలను నిశితంగా గమనిస్తూ ఔటా కాదా అన్నది క్షణాల్లో నిర్ణయించాలి. DRS (Umpires Decisions Review System technology) రాక ముందు అంపైర్ పొరపాటు LBW నిర్ణయాలు ప్రత్యర్థుల గెలుపోటములను బాగానే ప్రభావితం చేసేవి. అంపైర్ నిర్ణయాన్ని ప్రభావితం చెయ్యడం కోసం బ్యాట్‌ని చూపిస్తూ బ్యాట్ టిప్ అని సైగలు చెయ్యని GR విశ్వనాథ్ లాంటి నిజాయతీపరులైన ఆటగాళ్ళూ ఉండేవారు. అందులోనూ వికెట్ కీపర్ కేచ్ పట్టిన సందర్భాల్లో లెగ్ అంపైర్ నిర్ణయం కోసం వేచి చూడకుండా పెవిలియన్ దారి పట్టేవారూ ఉండేవారు. అందుకే క్రికెట్‌ని జెంటిల్మెన్ గేమ్ అనేవారు, క్రికెట్ ఆటగా ఉన్న రోజుల్లో. ఇప్పుడు క్రికెట్ ఆట కాదు, ప్రొఫెషన్. వాళ్ళూ ఆటగాళ్ళు కారు, క్రికెట్ ప్రొఫెషనల్స్. No holds barred.

LBW,BRS అమ్నెస్టీ స్కీంలు అన్న వికెట్స్ ముందు నిలబడలేక, కాళ్ళు తెగి చట్టబద్ధపాలన– రూల్ ఆఫ్ లా చతికిలబడుతోంది. LBW అవుతోంది – లా బ్రోకెన్ విల్ ఫుల్లీ. (LAW BROKEN WILFULLY)

ప్రభుత్వం అంటే (మన కోసం మనం) చేసే చట్టాలు చిత్తశుద్ధితో, సకాలంలో అమలయ్యేలా చట్టం తన పనిని తాను చేయకుండా నిజాయతీ, చిత్తశుద్ధి లేని ప్రజలు, ప్రభుత్వం, అధికార యంత్రాంగం అడ్డుపడుతుంటే చట్టం కూడా LBW యే అవుతుంది. చట్టబద్ధపాలన అన్న క్రికెట్‌లో మన తప్పుడు నిర్ణయాలకి గెలిచే టీం మనమే, ఓడే టీమూ మనమే.

# Concentric Circles of Power

1. Power Centre - Public Authorities & People's Representatives
(PM/CMs, Ministers, MLAs, MPs, Bureaucrats IAS, IPS,)
2. Family
3. Friends
4. Executive Government Machinery (Revenue, Tax, Police)
5. The so called independent Judiciary
6. Business Enterprise
7. Common Man

Each of the above circles is a power centre in itself and constitute concentric circles around it.

The dynamics of these circles is such that everyone in each of these circle relentlessly tries to get close to the Power Centre by moving into the circle before their original circle.

# సహ చట్టం కమిషనర్ తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్తాం

ప్రజాస్వామ్య వ్యవస్థలో జరుగుతున్న పొరపాట్లను సరిదిద్ది వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 2005లో ప్రజలకు సమాచార హక్కు చట్టాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని, అటువంటి కీలక చట్టాన్ని దాని స్ఫూర్తిని దెబ్బతినకుండా చూడవలసిన రాష్ట్ర కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు రాజకీయ నాయకుడిలా వ్యవహరించటం మంచి పద్ధతి కాదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరంలో కమిషనర్ పర్యటనను పరిశీలించిన వారెవరికైనా ఆయన రాజకీయ నాయకుడా, అధికారా, స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థకు కమిషనరా తెలియని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కమిషనర్‌కి అధికార పార్టీ నాయకులు ఫ్లెక్సీలు కట్టడాలు, కమిషనర్ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి శాలువాలు కప్పించుకోవటం, తన పర్యటనలో సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించటానికి కనీసం ఒక్క కార్యక్రమాన్ని కూడా జిల్లాలో నిర్వహించకపోవటం తదితర అంశాలపై సహ చట్టం కార్యకర్తలకు ఆగ్రహం కలిగించిందన్నారు. చట్టం విలువ పెంచవలసిన కమిషనర్ ఇలా వ్యవహరించటం సరికాదన్నారు. ఈ వివరాల్ని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇకపై అప్పీళ్లు జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని కమిషనర్ ప్రకటించటాన్ని బాబ్జీ స్వాగతించారు.

**అమరావతి రైతులతో మాట్లాడండి**

ప్రభుత్వం మాట విని తమ భూములను రాజధాని అభివృద్ధికి ఇచ్చామని, అటువంటి తమకు అన్యాయం చేయవద్దని, అమరావతిని రాజధానిగా ఉంచాలని కోరుతూ అక్కడి రైతులు సంవత్సరం నుంచి ప్రశాంతంగా ఉద్యమిస్తున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కనీసం స్పందించకపోవటం సరికాదని బాబ్జీ అన్నారు. రాజధాని తరలిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం తమ గోడు పట్టించుకోలేదని అనేకమంది రైతులు, రైతు కూలీలు మరణించారన్నారు. రాష్ట్ర విభజన హామీల విషయంలో కూడా ముఖ్యమంత్రి అదే తీరును ప్రదర్శిస్తున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి, రాష్ట్రాభివృద్ధికి మంచిదికాదని, రైతుల ఘోష వినాలని భీశెట్టి కోరారు.

# విజయనగరం సమస్యల్ని పట్టించుకోని ముఖ్యమంత్రి

## లోక్‌సత్తా నిరసన దీక్షకు మద్దతు పలికిన టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, ప్రజాసంఘాలు



ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న విజయనగరం జిల్లా సమస్యల్ని పరిష్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పట్టాల పంపిణీ కోసం వస్తున్న సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఉన్న మహాత్మా జోతిబా పూలే విగ్రహం వద్ద డిమాండ్లతో లోక్‌సత్తా పార్టీ జిల్లా శాఖ నిర్వహించిన నిరసన దీక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో పెండింగ్ తాగు, సాగునీరు ప్రాజెక్టులు, ఎమ్మార్ కాలేజీ నిర్వహణ, మూతపడ్డ పరిశ్రమలను తెరిపించటం, గురజాడ వర్సిటీని విశాఖకు తరలించటం, జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల శంకుస్థాపన మొదలైన అంశాలపై డిమాండ్లు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాల్లో జిల్లా వెనుకబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ సమస్యా పట్టించుకోకుండా ఉందని, లోక్‌సత్తా పార్టీ దీక్షకు పూర్తి మద్దతునిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాకు ఏం చేశారో చెప్పాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి రాజు అన్నారు. లోక్‌సత్తా పార్టీ డిమాండ్లకు సంఘీభావం తెలుపుతున్నామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రతినిధి పాలవలస యశస్విని అన్నారు. సమావేశంలో ముందుగా జోతిరావు పూలే విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. జనసేన సీనియర్ నాయకుడు త్యాడ రామకృష్ణ (బాలు), బీజేపీ నాయకుడు కుసుమంచి సుబ్బారావు, కాంగ్రెస్ నాయకుడు సుంకరి సతీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు బొద్దల నరసింగరావు, లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రతినిధులు కాండ్రేగుల ప్రసాద్, రాయి పద్మావతి, అల్లంశెట్టి నాగభూషణం, తాట్రాజు రాజారావు, పాలుపర్తి అప్పారావు, చిన్నారావు, సత్తిబాబు, భాస్కర్, పిల్లా ఆదీశ్వరరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కొవిడ్ మహమ్మారి కీలక పాఠాలు

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

2020 లాంటి సంవత్సరాన్ని గత వందేళ్లలో ఎరుగం. మానవాళి ఇలా ఓ మహమ్మారి బారిన పడింది మొదటి ప్రపంచ యుద్ధం ముగిశాక 1918-20 కాలంలో. అప్పట్లో స్పానిష్ ఫ్లూ దాదాపు 50 కోట్ల మందికి సోకింది. ప్రపంచ జనాభాలో అది మూడో వంతు. 5 నుంచి 10 కోట్ల మంది ఆ అంటువ్యాధికి బలయ్యారు. 1914-18 కాలంలో జరిగిన ప్రపంచ యుద్ధం వల్ల 2 కోట్ల మంది ప్రాణాల్ని కోల్పోగా, స్పానిష్ ఫ్లూ వల్ల మరణాలు, విధ్వంసం అంతకు ఐదు రెట్లు ఉంది. ఒక్క భారతదేశంలోనే 1.5 నుంచి 2 కోట్ల మంది దాకా మరణించారని అంచనా. అందువల్లే 1911లో 25.2 కోట్లుగా ఉన్న మన జనాభా 1921 నాటికి 25.1 కోట్లకు తగ్గింది.

నాటి మహమ్మారితో పోలిస్తే కొవిడ్ తీవ్రత తక్కువే. స్పానిష్ ఫ్లూ ఇన్ఫెక్షన్ బారిన పడినవారిలో 10 నుంచి 20 శాతం మంది మృతి చెందగా, కొవిడ్ ఇన్ఫెక్షన్ మరణాలు 1% లోపే ఉన్నాయి. వ్యాధి నిర్ధారణ చేసిన వారిలో కొవిడ్ మరణాల శాతం 2.2 గా ఉంది. ఆధునిక వైద్యంలో పురోగతి, వ్యాధికి సంబంధించి మెరుగైన అవగాహన, 21వ శతాబ్దంలో ఆరోగ్య సంరక్షణ అవకాశాలు మునుపెన్నడూ లేనిరీతిలో అందుబాటులోకి రావటం ఈవేళ మహమ్మారి తీవ్రత తక్కువగా ఉండటానికి కొంత కారణం. కానీ అంతకంటే పెద్ద కారణం.. ఏ అదృష్టం వల్లో స్పానిష్ ఫ్లూ కంటే కొవిడ్ తక్కువ తీవ్రత కలిగి ఉండటం, తక్కువ ప్రాణాంతకం కావటం! శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు సురక్షితమైన, సమర్థవంతమైన టీకాలను కూడా అందుబాటులోకి తెచ్చారు కాబట్టి ఇప్పుడు కారుచీకట్లకు ఆవలి కాంతిరేఖల్ని చూడగలుగుతున్నాం. అత్యవసర వినియోగం కోసం అమెరికా నియంత్రణ సంస్థ ఎఫ్‌డీయే రెండు వ్యాక్సిన్లను ఆమోదించింది. రాబోయే నెలల్లో ఇంకా పలు టీకాలకు ఆమోదం లభించనుంది. కాబట్టి, 2021 చివరికి ప్రపంచంలోని చాలామేర ప్రజలకు వ్యాక్సిన్లు అందుతాయని, మహమ్మారి సద్దుమణుగుతుందని అనుకోవచ్చు. కానీ 75% మంది ప్రజలకు టీకా అందే వరకూ.. భౌతిక దూరాన్ని పాటించటం, మాస్కులు ధరించటం, శుభ్రత వంటి ముందు జాగ్రత్తల్ని మనం పాటించాల్సిందే.

స్పానిష్ ఫ్లూ కంటే కొవిడ్-19 తక్కువ తీవ్రత కలిగినదే అయినా, ఈవేళ ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆర్థిక విధ్వంసం మాత్రం అప్పట్లో కంటే అనేక రెట్లు ఎక్కువ. వందేళ్ల క్రితంతో పోలిస్తే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నేడు ఎంతో విస్తృతంగా అనుసంధానమై ఉంది. అంతర్జాతీయ సరఫరా గొలుసులు, వాణిజ్యం, విదేశీ ప్రయాణాలు.. దేశాల మధ్య సరిహద్దుల్ని ఊహకందనిరీతిలో చెరిపేశాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా అప్పట్లో కంటే ఎంతో అధునాతనమైనది, పారిశ్రామికమైనది, పరస్పర ఆధారితమైనది.



ఆర్థికాభివృద్ధి దశను బట్టి దేశాల మధ్య తేడాలుండొచ్చుగానీ, ప్రపంచ ఆర్థికంలో వ్యవసాయం వాటా, వ్యవసాయంలో ఉపాధి పొందుతున్నవారి వాటా గత 100 ఏళ్లలో అన్ని దేశాల్లోనూ గణనీయంగా పడిపోయాయి. సాగు నుంచి ఆ వాటాలు పరిశ్రమలు, సేవల రంగాలకు మళ్లి అవి అనేకరెట్లు వృద్ధి చెందాయి. సుమారు 2,200 డాలర్ల తలసరి ఆదాయంతో దిగువ మధ్యాదాయ దేశంగా ఉన్న భారత్‌లో కూడా 60% ఉత్పత్తి సేవారంగంలోనే ఉంది. కొవిడ్ ప్రభావం వ్యవసాయం మీద కన్నా పరిశ్రమలు, సేవల రంగాలపై ఎంతో ఎక్కువగా ఉంది. ఆ కారణంగా ప్రపంచవ్యాప్తంగా, భారత్‌లోనూ కోట్ల మంది ప్రజలు ఉపాధిని కోల్పోయారు. దాదాపు 30 కోట్ల మంది కొత్తగా పేదలు, పస్తులుండే వారి జాబితాలో చేరిపోయారు. 1929 నాటి మహా మాంద్యం సృష్టించిన ఆర్థిక విధ్వంసానికి ఇదేమీ తక్కువ కాదు. అయితే 2021లో మహమ్మారి సద్దుమణుగుతుంది కాబట్టి, ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెంది 2022 నాటికి ప్రపంచ ఉత్పత్తి మళ్లీ 2019 స్థాయికి చేరుతుందని ఆశించవచ్చు. ఆర్థికం ఇంత వేగంగా కోలుకున్నా కూడా, భారత్ వంటి పేద దేశాలు రెండేళ్ల వృద్ధి రేటును కోల్పోవటమంటే అది పేదలకమీద పెనుభారమే అవుతుంది. నిరుద్యోగం ఇంకా పెరుగుతుంది. 2020లో ఆర్థిక పతనాన్ని తప్పించుకున్న ఏకైక పెద్ద దేశం చైనా. ఈ ఏడాది కూడా చైనా వృద్ధి 4.9% ఉంటుందని అంచనా. చైనాలో పరిశ్రమలు, సేవలు, వాణిజ్యం, ప్రయాణరంగాలు వేగంగా వృద్ధి బాట పట్టాయి. కొవిడ్ మహమ్మారిని తక్కువ వ్యవధిలోనే సమర్థవంతంగా కట్టడి చేయటం ఇందుకు దోహదం చేసింది.

కొవిడ్ నుంచి మనం మూడు పెద్ద పాఠాలను నేర్చుకోవాల్సి ఉంది. మొదటిది, అభివృద్ధి చెందుతున్న దేశాలను.. ముఖ్యంగా భారత్‌ను పీడిస్తున్న ఆరోగ్య రంగ సంక్షోభం, ఆదాయ అసమానతలకు సంబంధించినది. రెండోది గత శతాబ్దంలో పర్యావరణ విధ్వంసం వల్ల భవిష్యత్తులో తలెత్తే అవకాశమున్న ఆరోగ్య సంక్షోభాలకు సంబంధించినది. మూడోది, వచ్చే 30 ఏళ్లలో మన పిల్లలు ఎదుర్కోబోతున్న భూతాప (గ్లోబల్ వార్మింగ్) పెరుగుదల సంక్షోభం. మరిన్ని మహమ్మారులు, గ్లోబల్ వార్మింగ్.. ఈ రెండూ ప్రపంచ స్థాయి సవాళ్లు, కాబట్టి

ప్రపంచవ్యాప్తంగా ఉమ్మడి చర్యలు అవసరం.

మొదటగా.. ఆరోగ్య సంక్షోభం, ఆర్థిక అసమానతలు. అధ్వాన్న ఆరోగ్య సేవలు, విస్తృత పేదరికం, ఆదాయ అసమానతలకు నిలువెత్తు నిదర్శనం భారతదేశం. మన దేశంలో, ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రభుత్వ వ్యయం కేవలం 1.3%. ప్రపంచ దేశాలన్నిటిలోకీ ఇది తక్కువ. మొత్తం ఆరోగ్య వ్యయంలో 30% లోపే ప్రభుత్వం ఖర్చు పెట్టటం మరే దేశంలోనూ కనిపించదు. అనారోగ్యం వల్ల ఆదాయాన్ని కోల్పోవటం, చిక్సిత కోసం జేబులో నుంచి ఖర్చు వల్ల దాదాపు 6 కోట్ల మంది ప్రజలు ఏటా పేదరికంలోకి కుంగిపోతున్నారు. మనం ఇంకేమీ చేయనక్కర్లా, కాస్త చెప్పుకోదగిన స్థాయి నాణ్యమైన ఆరోగ్యాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తెస్తే చాలు.. భారతదేశంలో కేవలం దాదాపు 10 ఏళ్లలో పేదరికాన్ని నిర్మూలించగలం! 1-1.5 కోట్ల దాకా కొత్త ఉద్యోగాలను ఆరోగ్య సంరక్షణ సేవలలో సృష్టించగలం! కొవిడ్ వ్యాధి సమయంలో ఆస్పత్రుల్లో పడకలు అందుబాటులోలేక పేద, మధ్యతరగతి వర్గాలు ఎన్ని బాధలు పడ్డారో, చికిత్స ఖర్చులు భరించలేక అనేక కుటుంబాలు ఎంత అల్లకల్లోలమయ్యాయో అందరం నెలల తరబడి చూశాం. ఈ నివారించదగ్గ బాధలు భారతదేశంలోని మనందరికీ మేలుకొలుపు కావాలి. తమ జనాభాలో ఎక్కువమంది కొవిడ్ బారిన పడటం, మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం చాలా దేశాలను వణికించింది. ఈ విషయంలో భారతదేశానిది అదృష్టమనే చెప్పాలి. ఆ దేశాల్లో కంటే మన దేశంలో వ్యాధి వ్యాప్తి తక్కువగా ఉంది, వ్యాధి సోకినవారిలో కూడా ఎక్కువమందిలో తీవ్రత తక్కువగా ఉంది. ఫ్లూ, ఇతర కరోనా సమస్యలకు మనలో జన్యుపరమైన నిరోధం ఎక్కువగా ఉండటం ఇందుకు కారణం కావచ్చు. అయినప్పటికీ, భారతదేశంలో పేద, మధ్యతరగతి ఎక్కువ అల్లాడిపోవాల్సి వచ్చింది. మన దేశజనాభాలో 4.6% మాత్రమే ఉన్న యునైటెడ్ కింగ్‌డమ్‌లో కొవిడ్ వల్ల 70,000 మరణాలు సంభవించాయి. భారత్‌లోని మరణాల్లో ఇది 47%. అంటే బ్రిటన్‌లో మరణాల రేటు మన వద్ద కంటే పది రెట్లు ఎక్కువ. బ్రిటన్‌లో ప్రతి కుటుంబానికీ ఆస్పత్రి పడక ఉచితమే అందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రి ఖర్చులకు ఆర్థికంగా ఎవరూ సతమతమవ్వాల్సిన పరిస్థితి లేదు. అందుకే ఆరోగ్య సేవలు అందక ఎవరూ మరణించలేదు. ఏ కుటుంబమూ ఆర్థికంగా చితికిపోలేదు.



అలాగే మన దేశంలో కొన్ని విషయాల్లో మనం అదృష్టవంతులం. తక్కువ ధరలకు అత్యంత నాణ్యమైన మందులు, వ్యాక్సిన్లను తయారు చేసే ప్రపంచస్థాయి ఔషధ పరిశ్రమ మనకుంది. తగినంతమంది డాకర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉన్నారు. మన ఆస్పత్రులు ప్రపంచంలోనే తక్కువ ఖర్చుతో అత్యంత నాణ్యమైన వైద్య సేవల్ని అందించగలవు. రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రభుత్వాలు పేదల ఆస్పత్రి సేవలకు ఇన్సూరెన్స్ ఆధారిత సదుపాయాన్ని ప్రభుత్వ డబ్బుతో కొంతమేరకు ఏర్పాటు చేశాయి. 12 ఏళ్ల క్రితం అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ కార్యక్రమం ఇప్పుడు దేశంలోని చాలా రాష్ట్రాలకు వ్యాపించింది. అయితే మనం చేయాల్సిన మరో రెండు ముఖ్యమైన పనులున్నాయి. మొదటిది, మంచి ప్రమాణాలు కలిగిన, నమ్మదగిన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను ప్రతి కుటుంబానికీ అందుబాటులోకి తేవాలి. తాము ఉండే చోటు నుంచి 10-15 కిలోమీటర్లలోపు తమకు నచ్చిన డాక్టర్‌ను ఎంచుకునే అవకాశాన్ని ఆ కుటుంబానికి కల్పించాలి. ఔట్‌పేషెంట్‌గా వీరికి డాక్టర్ వద్ద అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలి. ఇక రెండోది, వ్యాధి ముదిరిన తృతీయ దశలో వైద్యాన్ని పటిష్టంగా అందించేందుకు ప్రభుత్వ బోధనాస్పత్రులను, జిల్లా ఆస్పత్రులను బాగా మెరుగుపరచాలి. తృతీయ దశలో వైద్య సేవలకు ప్రైవేటు ఆస్పత్రుల మీద ఆధారపడితే, ఖర్చు కళ్లు బైర్లు కమ్మేలా ఉంటుంది. ఈ దశలో అందించే ఆధునిక వైద్య సేవలు ఎంతో ఖరీదైనవి. మౌలిక వసతులు, భవనాలు, అత్యంత ఖరీదైన యంత్రాలు, పరికరాలు, అత్యంత నిపుణులైన, సుశిక్షితులైన వైద్యులు, నర్సుల సేవలు వంటి వాటి వల్ల బిల్లులు భారీగా ఉంటాయి. ఇక్కడ ప్రభుత్వ వైద్యం మేలు. వనరుల్ని మెరుగ్గా వినియోగించుకోవటం, వ్యాధి నిర్ధారణ, చికిత్సలో మరింత హేతుబద్ధ, శాస్త్రీయ పద్ధతుల్ని నిర్ణయించి అమలు చేయటం ద్వారా తృతీయ దశ వైద్యంలో ప్రభుత్వం ఖర్చుల్ని తగ్గించి, నాణ్యమైన సేవలకు కూడా భరోసా ఇవ్వగలదు. ఆధునిక వసతుల కోసం విపరీత పెట్టుబడి వ్యయం, అతిగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అనవసరమైన, అత్యంత ఖరీదైన చికిత్సలు, కేసులు, ఆరోపణలు వస్తాయేమోనని ముందు జాగ్రత్తగా మితిమీరిన పరీక్షలు, మందుల వాడకం, కొన్ని కేసులలో బిల్లుల్లో ఎక్కువ చూపటం, అవినీతికి పాల్పడటం వల్ల.. తృతీయ దశ వైద్యానికి ప్రైవేటు రంగంలో వ్యయం ప్రపంచవ్యాప్తంగా కూడా ఎప్పుడూ అసాధారణంగానే ఉంటుంది.

మన ప్రభుత్వాలు జీడీపీలో 1.3% మాత్రమే ఆరోగ్య సంరక్షణ కోసం వెచ్చిస్తున్నాయి. మనం గనక 0.5% లేదా 1 ట్రిలియన్ లేదా 1,00,000 కోట్ల రూపాయలను అదనంగా, అది కూడా విజ్ఞతతో కుటుంబ ఆరోగ్య సేవలకు, తృతీయ దశ చికిత్సకు ఖర్చు చేయగలిగితే.. మన దేశంలో ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్య వ్యవస్థను అందుబాటులోకి తేవచ్చు, ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు తమ జేబుల్లో నుంచి రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన దుస్థితి లేకుండా చేయవచ్చు. ప్రజారోగ్యంలో ఇంత స్థాయి ఫలితాల్ని చూపే ఈ పథకాన్ని అమలు చేశాక కూడా ప్రభుత్వం ఆరోగ్య రంగంపై చేస్తున్న ఖర్చు జీడీపీలో 2% లోపే ఉంటుంది. అప్పటికి కూడా ఇది ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చు. కాబట్టి ప్రభుత్వాలు తాత్సారం చేయకుండా వెంటనే అందరికీ ఆరోగ్యం కోసం

ఏర్పాట్లు చేయటం అత్యవసరం.

ఆరోగ్య సంరక్షణతో పాటు మనం మౌలిక వసతుల నిర్మాణానికి, విద్య, నైపుణ్యాలను మెరుగుపరచటానికి, ఉపాధి ఆధారిత పరిశ్రమలను, సేవలను ప్రోత్సహించటానికి శరవేగంగా చర్యలు తీసుకోవాలి. కొవిడ్ సంక్షోభ సమయంలో జరిగిన సరఫరా గొలుసుల విచ్ఛిన్నం ప్రపంచ లావాదేవీల రీతిలో మార్పు తెచ్చింది. భారత్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మన దేశం 10-15 మెగా ఇండస్ట్రియల్ పార్కుల్ని పారిశ్రామిక కేంద్రాలుగా ఏర్పాటు చేయాలి. ఒక్కో దాంట్లో 25,000 - 50,000 ఎకరాల భూ బ్యాంక్‌ను అందుబాటులో ఉంచాలి. ఈ పార్కుల వరకైనా ప్రపంచ స్థాయి మౌలిక వసతుల్ని ఏర్పాటు చేసి, అనవసరమైన నియంత్రణల్ని తొలగించాలి. ఎన్ని ఉద్యోగాలిస్తారు అనే ప్రాతిపదికన ప్రోత్సాహకాలను ఇవ్వాలి. దీంతోపాటు, పెద్ద ఎత్తున కార్మికుల అవసరముండే పరిశ్రమలను ప్రోత్సహించటం మీద దృష్టి పెట్టి వస్త్ర, రెడీమేడ్, పాదరక్షలు, బొమ్మలు, తోలు, ఎలక్ట్రానిక్స్ తదితరాల్లో అనవసర నిబంధనలన్నిటినీ తీసిపారేయాలి. నెట్‌వర్క్ ఉత్పత్తుల్లో తుది స్థాయి కూర్పు(అసెంబ్లీ) యూనిట్లకు ప్రోత్సాహకాలనివ్వాలి. మనకు ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో 17% మేర నిరుద్యోగం ఉంది. నైపుణ్యంలేని, కొంతమేర నైపుణ్యమున్న వారి కోసం కోట్ల సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించకపోతే, మనం తీవ్రమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. పేదరికాన్ని అంతం చేసి, అసమానతల్ని నిర్మూలించాలంటే మిగిలినవాటన్నిటి కన్నా ఉద్యోగాల కల్పనే మనకు అత్యంత ప్రాధాన్యాంశం కావాలి. అసంఘటిత రంగంలో ఉన్న కోట్లాది మంది కార్మికులు, ఇళ్లలో పనిచేసేవారు, కొవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయిన వలస కార్మికుల మీద మనం ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కోట్లాది మంది వలస కార్మికులలో అనేకమంది నగరాల్లో ఇళ్లు లేక, పని దొరక్క పస్తులుండటం, వందలాది కిలోమీటర్లు మండే ఎండలో నిర్వేదంగా నడుస్తూ తిరిగి తమ సొంతూళ్లకు పోవటం మన మనసుల్లో ముద్రించుకుపోయింది, మన అంతరాత్మను కదిలించింది. ఎన్నటికీ మరపురాని, మరువకూడని దారుణ సన్నివేశాలవి. ఇళ్లలో పనిచేసే శ్రామికుల్లో అనేక మందికి తిరిగి ఉద్యోగాలు లభించవు. వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, రోబో స్వీపర్లు, మైక్రోవేవ్ ఓవెన్లు తదితర వినియోగ వస్తువులతో పనుల్ని సొంతంగా చేసుకోవటం అలవరచుకున్న మధ్యతరగతి ప్రజానీకం ఇక ఇంటిపనివారిని నియమించుకోరు. పేద వర్గాలలో మహిళలు సంపదసృష్టిలో భాగమవటం ఇప్పటికే ప్రమాదకర రీతిలో పడిపోతోంది. ఉపాధి కలాపాల్లో మహిళల వాటా తగ్గుతున్న పెద్ద దేశం ప్రపంచంలో భారత్ మాత్రమే. ఈ అసంఘటితరంగ శ్రామికులకు తిరిగి శిక్షణనివ్వటానికి మనం జాతీయ స్థాయిలో ఒక బృహత్ ప్రయత్నం ప్రారంభించాలి. కార్మిక సాంద్ర పరిశ్రమల్లో వీరికి గౌరవప్రదమైన, ఉత్పాదకతతో కూడిన ఉపాధి అవకాశాల్ని కల్పించాలి.

దూరదృష్టి, సంకల్పంతో కూడిన ప్రయత్నాల్ని యుద్ధప్రాతిపదికన చేస్తేనే మన సమాజంలోని తీవ్రమైన అసమానతల్ని తగ్గించగలం. కొవిడ్ మహమ్మారి ఇందుకు ఓ మేలుకొలుపు. ఇంత జరిగినా.. ఇంకా మాకు అధికారమే పరమలక్ష్యంగా ఉండే రాజకీయాలే కావాలి, ఆధిపత్యం, ఫ్యూడల్ పెత్తనం చుట్టూ తిరిగే రాజకీయ కార్యకలాపాలే కావాలి అంటే.. భారతదేశం ప్రపంచ దేశాలన్నిటి చివరన నిలుస్తుంది. మన సామర్థ్యం చాలామేర వికసించకుండా వృథా పోతుంది, కోట్లాది మంది కడు పేదరికంలో మగ్గుతూనే ఉంటారు, అరాచకం, హింస, నిరంతర రాజకీయ సంక్షోభాలతో అసాధారణ సంక్షోభంలోకి మన సమాజం జారిపోతుంది. ఆర్థిక అసమానతలు ఆగ్రహాన్ని, అశాంతిని, హింసను రగులుస్తాయి. అవి తాత్కాలికంగా ప్రజలని రెచ్చగొట్టటానికి, ప్రజల మధ్య విభజనలు, మత దురభిమానం, విద్వేష రాజకీయాలకు దారితీస్తాయి. సామాజిక ఘర్షణ నుంచి తలెత్తిన అటువంటి రాజకీయాలకు అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రతీక. కోట్లాదిమంది పేదరికాన్ని, ఆర్థిక అసమానతల్ని, ఆరోగ్య సంక్షోభాన్ని మనం యుద్ధప్రాతిపదికన పరిష్కరించుకోకపోతే మన స్వేచ్ఛ, శాంతి, సామరస్యాలకు పొంచి ఉన్న ప్రమాదాలను టర్కీలో ఎర్డోగాన్, రష్యాలో పుతిన్, ప్రపంచవ్యాప్తంగా ఇంకా ఎందరో పాలకులు గుర్తుచేస్తున్నారు.

ప్రపంచ సమాజం ఆకళింపు చేసుకోవాల్సిన రెండో పెద్దపాఠం.. పర్యావరణ విధ్వంసం వల్ల భవిష్యత్తులో వన్యప్రాణుల నుంచి వైరస్‌లు మనుషుల్లోకి ప్రవేశించి మహమ్మారుల ప్రమాదం పెరగటం. గత కొన్ని దశాబ్దాలలో అనేక వైరస్‌లు ఇతర జాతుల నుంచి మనుషుల్లోకి ఇప్పటికే వ్యాపించాయి. 'ఎయిడ్స్' వాటిల్లో ఒకటి. ఇది పశ్చిమ ఆఫ్రికాలో చింపాంజీల నుంచి మనుషులకు వ్యాపించి ప్రపంచ మహమ్మారిగా మారింది. హెచ్ఐవి వైరస్ మనుషుల్లోకి ప్రవేశించటం 1920లలో జరిగి ఉండొచ్చుగానీ, ఎయిడ్స్ మొదటి కేసును మాత్రం 1981లో గుర్తించారు. ఎయిడ్స్‌కు హెచ్ఐవి వైరస్ కారణమని 1983లో ఫ్రాన్స్‌లో కనుగొన్నారు. 2019 నాటికి 7.6 కోట్ల మంది ప్రజలు హెచ్ఐవి ఇన్ఫెక్షన్‌కి గురయ్యారు. 3.27 కోట్ల మంది ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ సంబంధ అనారోగ్యాలతో మరణించారు. ఈవేళ దాదాపు 4 కోట్ల మంది ప్రజానీకం ఎయిడ్స్ ఇన్ఫెక్షన్‌తో జీవిస్తుండగా, సుమారు 700,000 మంది ఏటా ఎయిడ్స్ కారణంగా మరణిస్తున్నారు. సమర్థవంతమైన చికిత్సను కనుగొనటం వల్ల ఎయిడ్స్ మరణాల్ని నిరోధించటం సాధ్యమైంది. యాంటీ-ఎయిడ్స్ మందుల్ని ప్రపంచంలోనే అత్యధికంగా ఉత్పత్తి చేస్తూ, అత్యంత చౌక ధరకు అందిస్తున్న దేశం భారత్. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2.6 కోట్ల మంది యాంటీరిట్రోవైరల్ (యాంటీ-ఎయిడ్స్) చికిత్సను తీసుకుంటున్నారు. ఇతర అనేక వైరస్‌లు- సార్స్-1, ఎబోలా, మిడిల్-ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ (మెర్స్) మొదలైనవి వన్యప్రాణుల నుంచి మనుషుల్లోకి ప్రవేశించి ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో మరణాలకు, కల్లోలానికి కారణమయ్యాయి. సార్స్-1 చైనాలో ఆవిర్భవించింది. దీని మరణాల రేటు 10%గా ఉంది. మెర్స్ పశ్చిమ ఆసియా నుంచి వచ్చింది. మరణాల రేటు 30%-40%. ఎబోలా పశ్చిమ ఆఫ్రికా నుంచి విస్తరించింది. మరణాల రేటు 70%గా ఉంది. అదృష్టవశాత్తూ, కొవిడ్-19 కంటే ఈ వైరస్‌లలో ఇన్ఫెక్షన్ రేటు మాత్రం బాగా తక్కువ. కాబట్టి లక్షల మందికి సోకక ముందే

వాటిని అదుపు చేయగలిగారు. కానీ పదుల వేల సంఖ్యలో వైరస్‌లు గబ్బిలాలు, కోతులు, చింపాంజీలు, గొరిల్లాలు, తాబేళ్లు, ఇంకా అనేక జాతులలో ఉంటాయని మనం గుర్తుంచుకోవాలి.

జనాభా పెరుగుతున్న కొద్దీ ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో అడవుల విధ్వంసం పెద్దఎత్తున జరుగుతోంది. ఆఫ్రికాలో జనాభా పెద్దఎత్తున పెరుగుతోంది. ఉన్నకొద్దీ అడవుల్ని నరికి వేస్తున్నారు. వన్యప్రాణుల మాంసానికి బాగా గిరాకీ ఉండటంతో అడవులలో జంతువులని మాంసం కోసం విపరీతంగా వేటాడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వన్యప్రాణుల్ని పెంపుడు జంతువులుగా మచ్చిక చేసుకుంటున్నారు. వీటన్నిటి వల్ల జంతు వైరస్‌లు మానవ జాతిలోకి ప్రవేశించి ప్రమాదాన్ని పెంచుతున్నాయి. వేగంగా వ్యాపిస్తూ, తీవ్ర వ్యాధులకు కారకమవుతున్నాయి. అదేవిధంగా చైనా, ఆగ్నేయాసియాల్లో, దక్షిణ అమెరికాలో అడవుల తొలగింపు, ఆహారం కోసం వన్యప్రాణుల వేట, మాంసం కోసమో, పెంపుడు కోసమో అరుదైన వన్యప్రాణుల పట్ల వేలం వెర్రి వంటివి మనుషుల్లోకి వైరస్‌లను వ్యాప్తి చేసే పెద్ద ప్రమాదకారకాలుగా ఉన్నాయి. కొవిడ్ విషయంలో అంతర్జాతీయ వైద్య పరిశోధకులు సమర్థవంతమైన టీకాలను రికార్డు సమయంలో ఒక్క ఏడాదిలోనే ఉత్పత్తి చేయగలిగారు. ఇన్ఫెక్షన్ సోకిన చాలామందిలో కూడా కొవిడ్ తీవ్రత తక్కువగానే ఉంది. తీవ్ర ప్రభావం చూపే మహమ్మారులన్నిటి నుంచి రక్షణ కల్పించేలా పదుల వేల వ్యాక్సిన్లను సృష్టించటం అసాధ్యం. కొన్ని వ్యాధులకు సంబంధించి సర్వశక్తులతో ప్రయత్నిస్తున్నా, ఇప్పటికీ వాటికి వ్యాక్సిన్లను మానవాళి తయారు చేయలేకపోయింది. ఒకపక్క కొవిడ్ లాగా వేగంగా వ్యాపిస్తూ మరోవైపు కొవిడ్ కంటే ప్రమాదకరంగా, మెర్స్, ఎబోలాల్లా ప్రాణాంతకం కాగలిగే వైరస్‌ల వ్యాప్తికి అవకాశముంది. కొవిడ్ తరహా ఇన్ఫెక్షన్, ఎబోలా తరహా ప్రాణాంతక లక్షణం ఉండే వైరస్ తాకిడికి ప్రపంచం గురైతే, మొత్తం మానవాళి మనుగడకే అది గొడ్డలి పెట్టవుతుంది. అడవుల్లోకి చొరబాటు, వేట, వన్యప్రాణుల్ని తినటాల్ని ఆఫ్రికా, తూర్పు ఆసియా, దక్షిణ అమెరికాల్లో అపుచేయటమే ఏకైక రక్షణ మార్గం. ఇది ప్రపంచం కలసికట్టుగా కృషి చేస్తేనే సాధ్యం. కేవలం ఓ దేశం స్థాయిలో ప్రయత్నాలు సరిపోవు. మహమ్మారులకు మూలకేంద్రాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్న ఆ దేశాల్లోని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించటం, వన్యప్రాణుల వినియోగాన్ని నిలువరించటం, ఆర్థికంగా నష్టపోయిన దేశాలు, కుటుంబాలకు పరిహారం చెల్లించటం, ప్రత్యామ్నాయ వృత్తుల్లో పునరావాసానికి వారికి శిక్షణనివ్వటం, జీవకణాల నుంచి కల్చర్ ద్వారా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో డిమాండ్‌కు తగ్గ మాంసాహారాన్ని ఉత్పత్తి చేయటం, వన్యప్రాణులతో సంపర్కాన్ని తగ్గించటం.. ఇవన్నీ జంతువుల నుంచి మనుషులకు వైరస్ పాకటాన్ని తగ్గించేందుకు మనం తీసుకోవాల్సిన కీలక చర్యలు. లేకుంటే, మరింత ప్రమాదకర మహమ్మారులు ప్రపంచాన్ని చుట్టుముట్టి కనీవినీ ఎరుగని స్థాయిలో మానవాళి ప్రాణనష్టానికి దారి తీయవచ్చు. కొవిడ్ కలిగించిన ఆర్థిక విధ్వంసం ప్రపంచంలోని అత్యధిక శాతం ప్రజానీకాన్ని దెబ్బతీసింది. పేదరికాన్ని, నిరుద్యోగాన్ని, పస్తుల్ని, అసమానతల్ని పెంచింది, అపార కష్టానికి గురిచేసింది. ఇంకా ప్రమాదకరంగా ఉండే వైరస్ వ్యాపిస్తే, ఈ బాధ, వేదనల్ని అనేకరెట్లు పెంచుతుంది. ఈ సంక్షోభం ఒక ప్రాంతానికో, దేశానికో, ఖండానికో పరిమితమవదు. భవిష్యత్ మహమ్మారుల్ని నివారించటం మొత్తం మానవాళికి అనివార్యమైన అవసరం. మహమ్మారి వల్ల ప్రాణనష్టం, ఆర్థిక పతనం ప్రమాదాలతో పోలిస్తే.. మహమ్మారుల్ని నివారించటానికయ్యే ఖర్చు, కలిగే అసౌకర్యం చాలా తక్కువ.

కొవిడ్ మహమ్మారి నుంచి మానవాళి గ్రహించాల్సిన మూడో పెద్ద పాఠం భూతాపాన్ని (గ్లోబల్ వార్మింగ్) అత్యవసర సమస్యగా సమష్టిగా ఎదుర్కోవటం. భూతాపం ప్రస్తుతం మానవ మనుగడకు ప్రమాదమని శాస్త్రీయ ఆధారాలన్నీ తేల్చి చెబుతున్నాయి. గ్రీన్‌హౌస్ వాయువులను ఇక ముందు నియంత్రించగలిగినా కూడా, భూమ్మీద ఇప్పటికే జరిగిన నష్టం వల్ల సరాసరి ఉష్ణోగ్రతలు సుమారు 2 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుతాయి. కార్బన్ డయాక్సైడ్, మిథేన్, ఇతర ఉద్గారాల విడుదలను ఆపకపోతే ఉష్ణోగ్రతల పెరుగుదల ఇంకా ఎక్కువగా ఉంటుంది. 2 డిగ్రీల సెల్సియస్ చాలా స్వల్పమే గదా అనిపించవచ్చు. కానీ 2 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతతో చోటు చేసుకునే మార్పు- మంచు యుగానికి, ఎడారీకరణకి మధ్య తేడాగా మారవచ్చు. ప్రపంచంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఇప్పటికే కల్లోలాల్ని సృష్టిస్తున్నాయి. గ్లేసియర్లను కరిగిస్తున్నాయి.. సైబీరియా, గ్రీన్‌లాండ్ వంటి శీతల ప్రదేశాలలో మంచును కరిగిస్తున్నాయి.. మన దేశంలో గంగా, ఉపఖండంలోని ఇండస్ వంటి హిమనదాలు ఎండిపోతుండటం, ఆర్కిటిక్ మహా సముద్రం కరుగుతుండటం, అంటార్కిటికాలో మంచు ఫలకం కరగటం, సముద్ర మట్టాలు పెరగటం, తీర, లోతట్టు ప్రాంతాలు ముంపుకి గురికావటం, ద్వీపదేశాలు మునిగిపోవటం, దేశాలకు దేశాల్లో అటవీ కార్చిచ్చులు, భారత్ వంటి ఉష్ణ మండల దేశాల్లో ఉష్ణోగ్రతలు భరించలేని స్థాయిలో ఉండటం, పెనుతుఫానులు, టైఫూన్లు వంటి అసాధారణ, అనూహ్య వాతావరణ పోకడలు, ఎడారీకరణ, దోమలు, ఇతర వ్యాధికారక కీటకాల వ్యాప్తి పెరగటం, మహమ్మారులు విజృంభిస్తుండటం, ఇంకా ప్రపంచవ్యాప్తంగా గుర్తించని అనేక భయోత్పాతాలకు కారణమవుతున్నాయి.


మానవాళి మనుగడకు ప్రమాదకరమైన భూతాపానికి మూలం మానవుడి చర్యలే. ఇప్పటిదాకా ఆర్థిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణల మధ్య ఘర్షణ ఉంది. దాదాపు 200 ఏళ్లుగా, ముఖ్యంగా గత 100 ఏళ్లుగా ఫ్యాక్టరీలు నడపటానికి, ఇళ్లు, దుకాణాలు, వీధుల్లో దీపకాంతులకు, కార్లు, ఆటోమొబైళ్లు, రైళ్లు, ఓడల్లో ఇంధనానికి మానవాళి బొగ్గు, చమురు, వాయువు వంటి శిలాజ ఇంధనాల మీదే ఆధారపడింది. శిలాజ ఇంధనాన్ని మండించకపోతే మన అవసరాలకు తగ్గ ఉత్పత్తిని సాధించలేం, మన ఆదాయాలు, జీవన ప్రమాణాలు పెరగవు. అభివృద్ధి వర్సెస్ భూతాపం.. అనే ఈ క్రూరమైన సందిగ్ధం వల్ల మనం గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించలేకపోతున్నాం. తలసరి ఇంధన వాడకం పెద్దఎత్తున ఉన్నది సంపన్న దేశాల్లో కాగా.. వృద్ధి కోసం తంటాలు పడుతున్న పేద దేశాలకు ఇంధనం వాడొద్దని, ఉత్పత్తిని నిలిపివేయాలని చెప్పటం హాస్యాస్పదం.

అయితే ఇప్పుడు పునరుత్పాదక ఇంధనాన్ని పుష్కలంగా, చౌకగా – దీర్ఘకాలిక ప్రాతిపదికనైతే శిలాజ ఇంధనాల కంటే చౌకగా – చేయగలిగేలా సాంకేతికతలు పరిణతిని సాధించటం మనందరికీ సంతోషకరమైన విషయం. మాంసం ఉత్పత్తిలో కర్బన ఉద్గారాల్ని తగ్గించే టెక్నాలజీలు కూడా మనకున్నాయి. వరి ఉత్పత్తిలో మెరుగైన పద్ధతులు, ప్రత్యామ్నాయ ఆహారాలు గ్రీన్‌హౌస్ వాయువుల్ని ఇంకా తగ్గిస్తాయి. కణాల కల్చర్ ద్వారా మాంసం ఉత్పత్తికి సింగపూర్ అనుమతులిచ్చింది. అటువంటి టెక్నాలజీల వల్ల ఇక వధించేందుకు జంతువుల్ని పెంచాల్సిన అవసరం ఉండదు. ప్రపంచ మార్కెట్ల డిమాండ్‌కు తగ్గ మాంసాన్ని రాబోయే 10-20 ఏళ్లలో కొత్త టెక్నాలజీతో తయారుచేయవచ్చు. మనకు ఇప్పటికే సౌర విద్యుత్తు, బ్యాటరీ స్టోరేజీ టెక్నాలజీ, విద్యుత్ కార్లు, ఇంధన పొదుపు పరికరాలు, బయోమాస్‌ను ఇంధనంగా మార్చే సెల్యులోజిక్ ఎంజైములు, ఇతర అద్భుత సాంకేతికతలు చవకగా అందుబాటులో ఉన్నాయి. ఉత్పత్తిని, ఆర్థిక వృద్ధిని, ఉద్యోగాల్ని కోల్పోకుండానే వచ్చే 20 ఏళ్లలో శిలాజ ఇంధనాల మీద ఆధారపడాల్సిన అవసరం నుంచి పూర్తిగా బయటపడే సామర్థ్యం ఈవేళ మానవాళికి ఉంది. కొత్త ఇంధన వ్యవస్థల్ని నిర్మించి, నిర్వహించే క్రమంలో కోట్ల సంఖ్యలో కొత్త ఉద్యోగాల్ని సృష్టించవచ్చు.

అయితే ఇందుకు ప్రతి దేశంలో, ప్రపంచ స్థాయిలో కూడా భారీగా ప్రయత్నం కావాలి. ప్రస్తుత శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్ గ్రిడ్‌ల నుంచి పునరుత్పాదక ఇంధన గ్రిడ్‌లకు మరలటానికి సుమారు 15-20 ట్రిలియన్ డాలర్లు అవసరమవుతాయి. మనం ప్రస్తుత విద్యుత్ ప్లాంట్‌లను మూసివేస్తే, వాటి వ్యయాన్ని ఎవరో ఒకరు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల పరిహారం కట్టాల్సి ఉంటుంది. పాత పెట్రోల్ బంక్‌ల స్థానంలో విద్యుత్ కార్ల బ్యాటరీలను రీఛార్జి చేసే సౌర విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్లు రావాలి. ప్రస్తుత కేంద్రీకృత గ్రిడ్‌ల స్థానంలో వికేంద్రీకరించిన పంపిణీ వ్యవస్థలు ఏర్పడాలి. పగలు సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూనే, ప్రపంచ వ్యాప్తంగా బ్యాటరీ స్టోరేజీ సామర్థ్యాన్ని నిరంతర విద్యుత్ అవసరాల కోసం భారీస్థాయిలో నెలకొల్పాలి. మన కర్మాగారాలు, ఇళ్లు, జీవితాల్ని నిరాటంకంగా నడిపించుకోవటానికి, తదనుగుణమైన ఇతర మార్పులు అనేకం రావాల్సి ఉంటుంది. ఈ పరివర్తన (ట్రాన్సిషన్) కోసం తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా పనిచేసే టెక్నాలజీలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. కానీ ఈ పరివర్తన జరగాలంటే మనకు భారీ వనరులు కావాలి. కొవిడ్ సంక్షోభం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలూ తమ ఆర్థిక వ్యవస్థల ఉద్దీపనకు, ఆర్థిక కలాపాలు లేక కుదేలైన కార్మికులని, సంస్థలను ఆదుకునేందుకు సుమారు 15 ట్రిలియన్ డాలర్ల ప్రభుత్వ ధనాన్ని వెచ్చించాయి. ఈ మొత్తాన్ని కేవలం ఒక ఏడాదిలో సమకూర్చగలిగాయి. శిలాజ ఇంధన గ్రిడ్‌ల నుంచి పునరుత్పాదక గ్రిడ్‌లకు మళ్లటానికి మనకు కావలసిందల్లా 15 ట్రిలియన్ డాలర్లు – అంటే కొవిడ్ ఉద్దీపనకు ఒక సంవత్సరకాలంలో వినియోగించిన మొత్తాన్ని 10-15 ఏళ్ల కాలంలో వినియోగించటం. వృద్ధి, ఉపాధి, నాణ్యమైన జీవితంతో పర్యావరణహిత ఆర్థిక వ్యవస్థల్ని నిర్మించటానికి కావలసిన సాంకేతికత, వనరులు ప్రపంచానికి ఉన్నాయి. మనకు కావలసిందల్లా రాజకీయ సంకల్పం, ఆర్థిక, వ్యాపార సృజనాత్మకత, ప్రపంచ దేశాల మధ్య సహకారం. మన పిల్లలకు మెరుగైన, ఆరోగ్యకరమైన, సురక్షితమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు మనం చెల్లించాల్సిన మూల్యం బహు స్వల్పం. భవిష్యత్ తరాలకు లభించే లాభాలు మాత్రం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటాయి. మన పిల్లల్ని మనం ప్రేమిస్తాం, వారి భవిష్యత్తు కోసం అన్నిటినీ త్యాగం చేయటానికి సిద్ధంగా ఉన్నాం. ఈ ప్రేమ కులం, మతం, ప్రాంతం, జాతీయత, వర్గం లేదా ఆర్థిక హోదా వంటి అన్ని అవరోధాల్నీ అధిగమిస్తుంది. కేవలం దాన్ని మనం గుర్తిస్తే చాలు. మనం చేయవలసింది ఎంతో ఉంది, అతి తక్కువ ఖర్చుతోనే, సమష్టిగా చేయగలం మన పిల్లలకు మెరుగైన భవిష్యత్తునిచ్చేందుకు. మన సంకల్పాన్ని, వనరుల్ని భవిష్యత్తులో మరింత గొప్ప ప్రతిఫలాన్ని అందుకునేందుకు మనకు రాజకీయ నాయకత్వం, ఆర్థిక నిర్మాణాలు, వాణిజ్య సంస్థలు కావాలి.

ఒకవిధంగా మొత్తం మానవళికి కొవిడ్ ఒక మేలుకొలుపు. అసమానతలు తగ్గించటానికి, అందరికీ అవకాశాల్ని అందించటానికి, అభివృద్ధిని పెంచటానికి, పేదరికాన్ని అంతం చేయటానికి.. నాణ్యమైన, అందరికీ అందుబాటులో ఉండే ఒక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ, నైపుణ్యాలు, పెట్టుబడి ప్రోత్సాహకాలు, ఉద్యోగాల కల్పన, సమ్మిళిత వృద్ధి ఎంత కీలకమన్నది అన్ని దేశాలకు, ముఖ్యంగా భారత్‌కు ఇది గుర్తుచేసింది. ఇది కేవలం ఒక ఆర్థికపరమైన అవసరం కాదు, స్థిరత్వానికి కావలసిన ఓ రాజకీయ అనివార్యత, సామరస్యత, సంతోషాలకు కావలసిన ఓ సామాజిక అనివార్యత. భవిష్యత్తులో తలెత్తే అవకాశమున్న మరింత ప్రమాదకర, విధ్వంస కారక మహమ్మారుల్ని నిరోధించటానికి మనం ప్రకృతిలో సమతుల్యతను పునరుద్ధరించాలి. వన్యప్రాణుల్ని ఆహారంగా వినియోగించటానికి స్వస్తి చెప్పాలి. అడవుల నరికివేతను ముఖ్యంగా ఆఫ్రికా, తూర్పు ఆసియా, దక్షిణ అమెరికాల్లో ఆపుచేయాలి. చివరిగా, భూతాపాన్ని ఎదుర్కొని తిరిగి సాధారణ స్థితికి మళ్లించటానికి, తద్వారా మన పిల్లల, మొత్తం మానవాళి భవిష్యత్తును పరిరక్షించటానికి మనం అందుబాటులో ఉన్న టెక్నాలజీని, వనరుల్ని సరైనరీతిలో ఉపయోగించాలి.

ఇరవయ్యొకటో శతాబ్దం అబ్బురపరిచే అవకాశాలు, అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణల కాలం. శతాబ్దాల పారిశ్రామిక విప్లవం మనకు ఊహించలేనంత నాణ్యమైన జీవితాన్ని అందించింది. కానీ కొందరికే పరిమితమైన వేగవంతమైన అభివృద్ధి వల్ల తలెత్తుతున్న మానవ, పర్యావరణ విపరిణామాలను మాత్రం ఆలస్యం లేకుండా ఎదుర్కోవాలి. కొవిడ్ మనకు ఈ సవాళ్లను గుర్తుచేసింది. అదృష్టవశాత్తూ, ఈరోజు మనకు అందుబాటులో ఉన్న విస్తృత ఆర్థిక వనరులు, ఇటీవలి సంవత్సరాలలో జరుగుతున్న సంభ్రమాశ్చర్యకర సాంకేతిక ఆవిష్కరణలు, ఈ శతాబ్దపు మానవులకున్న అసాధారణ సృజనాత్మకత, ఆలోచనా నైపుణ్యాలు.. వృద్ధి రేటును, ఉద్యోగాల్ని, ఆదాయాల్ని, అభివృద్ధినీ పెంచుకుంటూనే పెరుగుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వెలకట్టలేని అవకాశాన్ని మనకు అందిస్తున్నాయి. ✦


INDIAN DEMOCRACY AT WORK
MAN'S CAPACITY FOR JUSTICE MAKES DEMOCRACY POSSIBLE, BUT MAN'S INCLINATION TO INJUSTICE MAKES DEMOCRACY NECESSARY
- Reinhold Niebuhr
Join us on
20-28 February 2021
as we discuss the reforms needed to make our Rule of Law institutions deliver better results
Register at www.idaw.in
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB | Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय
University of Hyderabad

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th January, 2021 Posting Date 15 &16th of every month




Wish you all a
happy, healthy, peaceful &
prosperous 2021

-Dr Jayaprakash Narayan,
FDR, Loksatta founder




**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**